# మీపై నమ్మకం ఉంచండి

# మీపై నమ్మకం ఉంచండి

డాక్టర్ జోసెఫ్ మర్ఫీ

అనువాదం : ఏ.ఆర్. బాలసుబ్రహ్మణ్యం

MANJUL
మంజుల్ పబ్లిషింగ్ హౌస్

*First published in India by*

MANJUL

**Manjul Publishing House**
*Corporate and Editorial Office*
• 2nd Floor, Usha Preet Complex, 42 Malviya Nagar, Bhopal 462 003 - India
*Sales and Marketing Office*
• 7/32, Ansari Road, Daryaganj, New Delhi 110 002 - India
Website: www.manjulindia.com

*Distribution Centres*
Ahmedabad, Bengaluru, Bhopal, Kolkata, Chennai,
Hyderabad, Mumbai, New Delhi, Pune

Telugu translation of *Believe in Yourself* by *Dr. Joseph Murphy*

This edition first published in India by
Manjul Publishing House Pvt. Ltd. in 2017

Copyright © JMW Group, Inc., New York
This edition has been authorized by The Joseph Murphy Trust

**ISBN 978-81-8322-672-1**

Translation by A. R. Balasubrahmanyam
Typesetting by Balaji Graphics

Printed and bound in India by Thomson Press (India) Ltd.

All rights reserved. No part of this publication may be reproduced, stored in or introduced into a retrieval system, or transmitted, in any form, or by any means (electronic, mechanical, photocopying, recording or otherwise) without the prior written permission of the publisher. Any person who does any unauthorized act in relation to this publication may be liable to criminal prosecution and civil claims for damages.

# విషయసూచిక

**అధ్యాయం 1**

మీ కలలను నిజం చేసుకోండి .................................... 7

**అధ్యాయం 2**

వ్యాపారంలో సుప్తచేతనాత్మక
మనసును ఉపయోగించుకోవడం ............................... 37

**అధ్యాయం 3**

విజయాన్ని ఊహించడం ఎలా? ................................ 61

*రచయిత గురించి* ........................................................ 71

## అధ్యాయం ఒకటి

# మీ కలలను నిజం చేసుకోండి

బైబిల్‌లో జోసెఫ్ అంటే 'క్రమశిక్షణ ఇవ్వబడిన లేదా నియంత్రించబడిన ఊహ' అని అర్థం. ఈ ఊహాశక్తి మనసుకున్న ప్రధాన శక్తులలో ఒకటి. మీ ఆలోచనలను ముందుకు తోసి, తొడుగులతో అలంకరించి ఆవరణ యవనిక మీద దృశ్యమానం చేసే అద్భుత శక్తి దీనికి ఉంది.

ఇజ్రాయెల్‌ను జోసెఫ్ ప్రేమించాడు. ఇజ్రాయెల్ ఆధ్యాత్మికంగా మేలుకున్న మానవుడు. నియంత్రించబడిన ఊహకు గల శక్తిని ఎరిగినవాడు. ఆ ఎరుకనే 'అతడి వార్ధక్యపు కుమారుడు' అంటారు. కుమారుడు అంటే అభివ్యక్తీకరణ. వార్ధక్యం అంటే మనోసూత్రాలకు సంబంధించిన వివేకం, పరిజ్ఞానం. ఊహకు గల శక్తి మీకు తెలిసివచ్చినప్పుడు దానిని 'వార్ధక్యపు కుమారుడు' అని చెప్పుకోవచ్చు.

## మీపై నమ్మకం ఉంచండి

వార్ధక్యం అంటే సంవత్సరాలు గడిచిపోవడం కాదు; అది వాస్తవంగా మీలో వివేకం వికసించడం; దివ్యజ్ఞానోదయం. ఊహ లేదా భావన అన్నది గొప్ప విజ్ఞానవేత్తలు, కళాకారులు, వైద్యవేత్తలు, ఆవిష్కర్తలు, వాస్తుశిల్పులు, మార్మికులు మొదలైన వారిచేత ఉపయోగింపబడుతూన్న అత్యంత శక్తి వంతమైన పరికరం. యావత్ ప్రపంచం, 'అది అసాధ్యం; అది జరగదు' అంటూన్నప్పుడు, 'అది సుసాధ్యం, ఇదిగో జరిగిపోయింది!' అనేదే ఊహ! మీ ఊహ ద్వారా అంటే కల్పన ద్వారా ప్రకృతి రహస్యాలను ఛేదించుకుని వాటిని కనుగొనడానికి వాస్తవాల లోతులలోకి చొచ్చుకుపోగలుగుతారు.

ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త మొదట తను ఒక చిన్న కొట్టును ఎలా ప్రారంభించిందీ నాతో చెప్పాడు. 'అప్పుడే నేను పెద్ద పెద్ద కలలు కనేవాణ్ణి, (జోసెఫ్ స్వాప్నికుడు) దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగల అతిపెద్ద సంస్థను నడుపుతున్నట్టు కలలుగనే వాణ్ణి' అని అతడు చెప్పాడు. అతడు క్రమం తప్పకుండా, ఒక పద్ధతి ప్రకారం, తన మనసులో బ్రహ్మాండమైన భవనాలను, కార్యాలయాలను, కార్ఖానాలను రూపకల్పన చేసుకునే వాడు. మనసుకున్న రసవాదం తెలుసు గనక, దాంతో తన కలలకు వాస్తవ రూపం ఇవ్వగలిగాడు.

అతడు అభివృద్ధి చెందాడు. విశ్వజనీన ఆకర్షణ సూత్రం ద్వారా, తన లక్ష్య సాధనకు అవసరమైన ఆలోచనలు, వ్యక్తులు, మిత్రులు, డబ్బులు అన్నింటినీ ఆకర్షించసాగాడు. అతడు ప్రయత్నించి భావనను రూపొందించు కుని పెంపొందించుకున్నాడు. ఆ తరవాత అవి రూపం దాల్చేంతవరకు తన మనసులోని మానసికరూపాల మధ్య జీవించాడు.

ఈ విషయంగా అతడు మాట్లాడుతూ, "మిమ్మల్ని మీరు విజేతగా ఊహించడం చాలా సులభం. అది అపజయాలను ఊహించడం అంత సులభమైనదే. అయితే, అంతకన్నా ఎంతో ఆసక్తికరమైనది", అంటూ ఇచ్చిన వివరణ నాకెంతగానో నచ్చింది.

జోసెఫ్ ఒక స్వాప్నికుడు – స్వప్నాల స్వాప్నికుడు. అంటే, అతని

మనసులో ఎన్నో రూపాలు, భావనలు, లక్ష్యాలు కలిగివుంటూ, తన మనో చిత్రాలకు స్పందించే సృజనాత్మక శక్తి ఒకటి ఉందని తెలుసుకున్నాడు. మనలో మనం కలిగి ఉండే మనోచిత్రాలు–భావోద్వేగాలతో అభివృద్ధి చెందుతాయి. మన జ్ఞానేంద్రియాలన్నీ ఏకైక ఇంద్రియ భావోద్వేగమే అని సరిగ్గా చెప్పబడింది. సుప్రసిద్ధ మనోవిజ్ఞానశాస్త్ర అధ్యాపకుడు థామస్ హోవార్డ్, "భావోద్వేగమే సూత్రం, సూత్రమే భావోద్వేగం" అంటాడు. భావోద్వేగం శక్తికి మూలాధారం. మంచి ఫలితాలు పొందడానికి మనం మనోచిత్రాలను భావోద్వేగంతో నింపాలి.

'జోసెఫ్ ఒక కల కన్నాడనీ, దానిని ఆయన తన కుటుంబ సభ్యులతో చెప్పినప్పుడు వాళ్ళు అతణ్ణి ద్వేషించారనీ' మనకు చెబుతారు. బహుశా మీరు దీనిని చదువుతున్నప్పుడు, మీకు ఒక కల ఉండవచ్చు. ఒక లక్ష్యం, ఒక పథకం, ప్రణాళిక లేదా దేన్నో ఒకదాన్ని సాధించి తీరాలన్న ఆకాంక్ష మీలో ఉండవచ్చు. బైబిల్ భాషలో ద్వేషించడం అంటే తిరస్కరించడం. మీ మనసులోని ఆలోచనలు, భావోద్వేగాలు, విశ్వాసాలు, అభిప్రాయాలు, మిమ్మల్ని సవాలు చేస్తూ కలలను కించపరుస్తూ, 'నీ వల్ల కాదు. అది అసాధ్యం, దాన్ని గురించి మరిచిపో!' అని చెప్పే మీ తోబుట్టువులు.

బహుశా ఇలాంటి ఆలోచనలు మీ పథకాన్ని, ఆకాంక్షను పరిహసించేవిగా ఉండవచ్చు. మీ సొంత సమాజంతోనే గొడవ పడడం మీ మనసులో జరుగుతుండడం మీరు గ్రహించవచ్చు : వ్యతిరేకత అడుగుపెడుతుంది. మీ మనసులో పొడసూపే వ్యతిరేకతను సమర్థవంతంగా ఎదుర్కొనే మార్గం – మీరు చూస్తున్నవాటినుంచి, వింటున్నవాటినుంచి అంటే విషయాల ఆకృతులనుంచి మీ దృష్టిని మరోవైపు మరల్చుకుని వేరు చేసుకోవడమే. మీ లక్ష్యం, లేదా గమ్యం పట్ల ఆసక్తితోనూ, స్పష్టంగానూ ఆలోచించడం ప్రారంభించాలి. మీ లక్ష్యం మీద లేదా గమ్యం మీద మీ మనసు నిలబడినప్పుడు మీరు మీ మనసు సృజనాత్మక సూత్రాన్ని ఉపయోగిస్తారు. అప్పుడు అది పనిచేయడం ఆరంభిస్తుంది.

"*ఆహా, నా కంకెల కట్ట పైకి లేచింది. నిటారుగా గంభీరంగా నిలబడింది. అదో చూడు : నీ కంకెల కట్టలన్నీ చుట్టూ మోకరిల్లి నా కంకెల కట్టకు నమస్కరిస్తున్నాయి*" (జెనెసిస్ 37:7). మీ ఆదర్శాన్ని లేదా ఆకాంక్షను చైతన్యంలో పైకెత్తండి. దానిని ఉద్ధరించండి. హృదయపూర్వకంగా దాని పట్ల నిబద్ధత కలిగి ఉండండి. దానిని కీర్తించండి. మీ పరిపూర్ణ ధ్యాసను, ప్రేమను, భక్తిని మీ ఆదర్శంపై కేంద్రీకరించండి; అలా మీరు చేయగా చేయగా భయానకమైన ఆలోచనలన్నీ పైకెత్తబడిన మీ మనోస్థితికి తలలు వంచి నమస్కరిస్తాయి. అంటే, అవి తమ శక్తిని కోల్పోయి మనసు నుంచి మటుమాయమవుతాయి.

తుది ఫలితాలను ఊహించగల మీ శక్తి ద్వారా – ఎలాంటి పరిస్థితుల పైన కాని, స్థితులపైన అయినాసరే నియంత్రణను సాధించగలుగుతారు. ఏదైనా కోరికను, ఆశను, ఆలోచనను, నెరవేర్చుకోవాలని ఆశించినట్టయితే, అది నెరవేరినట్టు మీ మనసులో మనోచిత్రాన్ని చిత్రించుకోండి. ఆ కోరికను వాస్తవంలో అనుభవిస్తున్నట్టు స్థిరంగా, నిరంతరం భావించండి. ఈ విధంగా, వాస్తవంలో నిజమయ్యేట్టు దానిని నిర్బంధించగలుగుతారు. మీరు నిజమని భావించేది మీ మనసు మరో పరిమాణం (డైమెన్షన్) లో అప్పటికే ఉంటున్నదే. మీ ఆదర్శంపట్ల అచంచల విశ్వాసం కలిగి ఉన్నట్టయితే, అది ఒకనాటికి వాస్తవంలో వస్తుగతంగా జరిగి తీరుతుంది. మీరు మనసులో గాఢంగా ముద్రించుకున్న దానిని, మీలోని మహా వాస్తుశిల్పి దృగ్గోచరమైన తెరమీదికి తోసుకు వస్తాడు.

జోసెఫ్ (ఊహ) రంగు రంగుల కోటును ధరిస్తాడు. కోటు అంటే బైబిల్‌లో మానసిక ఆచ్ఛాదన అని అర్థం. మీరు కలిగివున్న మనోవైఖరులు, మానసిక అవస్థలు, భావోద్వేగాలే మీ మానసిక వస్త్రాలు. రంగు రంగుల కోటు వజ్రం పలు పార్శ్వాలకు, ఏ ఆలోచనకైనా వాస్తవరూపమిచ్చే శక్తికి సంకేతం. మీరు నిరుపేద అయిన మీ స్నేహితుణ్ణి ఐశ్వర్యంతో తులతూగు

తున్నట్టు భావించవచ్చు. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతున్నట్టూ, పెదవులపై నవ్వులు నాట్యం చేస్తున్నట్టూ చూడవచ్చు. మీరు వినాలనుకున్న వాటిని అతని నోటిగుండా వినవచ్చు. మీరు అతణ్ణి ఎలా చూడాలనుకున్నా సరే, సరిగ్గా అలాగే చూడవచ్చు. అంటే – అతడు ఉత్సాహంగా, సంతోషంగా, ఐశ్వర్యవంతుడిగా, విజేతగా ఉన్నట్టూ చూడవచ్చు. మీ ఊహ వివిధ రంగుల కోటు. అది ఏ ఆలోచననైనా, కోరికనైనా సాకారం చేసి వస్తుగతం చేయగలదు. లేమి తాండవించే చోట కలిమి నాట్యాన్నీ, అశాంతి అలముకున్న చోట ప్రశాంతినీ, అనారోగ్యం పీడించేచోట ఆరోగ్యాన్నీ ఊహించుకోవచ్చు.

అతని తోబుట్టువులు అతనితో, "నువ్వు నిజంగానే మమ్మల్ని పాలించవచ్చు", అన్నారు. ఊహ మొట్టమొదటి ప్రధాన శక్తి. అది చైతన్యంలోని మిగతా శక్తులకన్నా, అంశాలకన్నా ముందు ఉంటుంది. మీకు పన్నెండు శక్తులు తోబుట్టువులుగా ఉన్నాయి. అయితే, క్రమశిక్షణ ఇవ్వబడిన ఊహాశక్తి – దేశ కాలాలను తుత్తునియలు చేసి పరిమితులను అధిగమించి పైకి లేచేలా చేస్తుంది. మీ ఊహను ఉన్నతమైన దైవిక భావనలతో, ఆలోచనలతో నిరంతరం నింపుతున్నప్పుడు, కొనసాగుతూన్న మీ ఆధ్యాత్మిక అన్వేషణలో, మిగతాశక్తులన్నిటికన్నా ఊహాశక్తి అత్యంత ప్రభావంగల శక్తి అని కనుగొనగలుగుతారు.

'జోసెఫ్ ఈజిప్టులోకి విక్రయించబడ్డాడు' అన్న మాటకు అర్థం– మీ భావన లేదా కోరిక వస్తుగతం కావడానికి ముందు ఆత్మగతంగా అర్థం చేసుకోబడాలి, అని అర్థం. ప్రతి భావన 'ఈజిప్టు లోపలికి' వెళ్ళాలి. అంటే– ఆలోచనల ఆవిర్భావం జరిగే ఆత్మగత ప్రదేశంలోకి వెళ్ళాలి అని అర్థం.

'ఈజిప్టు వెలుపలికి నా కుమారుణ్ణి పిలిచాను'. జోసెఫ్ ఈజిప్టు సేనాధిపతి. భావనా ప్రపంచాన్నంతటినీ ఊహే నియంత్రిస్తుందని, ఇది మీకు చెబుతోంది. ఎలాంటి చెరసాలలో ఉన్నా సరే – అది భయం, రోగం, లేమి, లేదా ఏ విధమైన పరిమితి గల కారాగారమయినా సరే, మిమ్మల్ని

ఆ కారాగారం నుంచి విడుదల చేసే సేనాధ్యక్షుడు జోసెఫ్ అన్న విషయం గుర్తుంచుకోండి. మీరు స్వేచ్ఛను ఊహించుకోవాలి. భావన చెయ్యాలి. అది ఆత్మగతంగా ఆకళింపు చేసుకోబడేంతవరకు భావించుకుంటూనే ఉండాలి. ఆ తరవాతే గర్భకాలానంతరం, చిమ్మచీకటిలో సాక్షాత్కారం జరుగుతుంది. మీ ప్రార్థనకు ఫలితం లభిస్తుంది.

అత్యంత ప్రతిభావంతుడైన ఒక ఆర్కిటెక్ట్ వాస్తుశిల్పి విషయాన్నే తీసుకుందాం. ఆయన ఆధునికమైన, అత్యంత సుందర నగరాన్ని నిర్మించగల సామర్థ్యం కలిగినవాడు. ఆయన మొదట విశాలమైన రహదారులు, బ్రహ్మాండమైన భవనాలు, సుందర ఉద్యానవనాలు మొదలైన హంగులతో సుందర నగరాన్ని తన మనసులోనే ఊహించుకుని రూపకల్పన చేస్తాడు. నగర నిర్మాణ పథకాన్ని నిర్మాణ కార్మికులకు అప్పగించడానికి ముందుగానే దాని రూపాన్ని భవనాలతో సహా నిర్దుష్టంగా తన మనసులో నిర్మించు కుంటాడు. అప్పుడు ఆ సుందర భవనాలు ఎక్కడ ఉన్నాయి? ఆయన ఊహలో మాత్రమే ఉన్నాయి.

మీ తల్లి ఇక్కడికి 10,000 మైళ్ళ దూరంలో నివసిస్తున్నప్పటికీ, తలుచుకున్నదే తడవుగా ఇక్కడనుంచే ఆమె కంఠస్వరం వినగలుగుతున్నారు కదా! ఆమె కళ్ళెదుట ఉన్నట్టే ఆమెను స్పష్టంగా చూడగలుగుతున్నారు కదా! మీకున్న అద్భుత శక్తి అది. విజేతలు కావడానికీ, సంపన్నులు కావడానికీ మీరు ఆ శక్తిని ప్రయత్నంతో పెంపొందించుకోవచ్చు.

సేల్స్ మేనేజర్లు తరచూ, "నేను జాన్‌ను పంపేయవలసి వచ్చింది. ఎందుకంటే అతని వైఖరి సరైనది కాదు" అని చెప్పడం మీరు వినే ఉంటారు. 'సరైన వైఖరి' ప్రాముఖ్యత వాణిజ్య ప్రపంచానికి బాగా తెలుసు.

చాలా సంవత్సరాల క్రితం జరిగిన విషయం ఒకటి నాకు జ్ఞాపకం వస్తోంది. పునర్జన్మ గురించి చిన్న వ్యాసం ఒకటి రాశాను. దాన్నొక చిన్న పుస్తకంగా తీసుకు వచ్చాను. నేను ఉపన్యాసం ఇస్తూన్న చర్చి బుక్ స్టాల్‌లో

కొన్ని ప్రతులు అమ్మకానికి ఉంచాను. ఆరంభంలో మరీ తక్కువ ప్రతులే అమ్ముడు కాసాగాయి. ఎందుకో తెలుసా? ఆ వ్యాసంలోని విషయాలు విక్రయశాలలోని సేల్స్‌గర్ల్‌కు అసలు నచ్చలేదు. అందులోని భావాలను తీవ్రంగా వ్యతిరేకించింది.

నేను ఆమెను పిలిచి, బైబిల్‌లో పునర్జన్మ అంటే ఉన్న అసలు అర్థాన్నీ, దాని పుట్టు పూర్వోత్తరాలనూ వివరంగా విడమరిచి చెప్పాను. ఆ భావంలోని నాటకీయతను అర్థం చేసుకున్న తరవాత దానిపట్ల ఆమెకు ఆసక్తి కలిగింది. ఆ తరవాత పుస్తకాల అమ్మకం జోరు పుంజుకుంది. నా వరస ఉపన్యాసాలు పూర్తయ్యేలోగానే ప్రతులన్నీ అమ్ముడై పోయాయి. సరైన మనోవైఖరికి గల ప్రాముఖ్యతను తెలియజేసే చక్కని ఉదాహరణ ఇది.

మీ మానసిక వైఖరి అంటే – ఎదుట ఉన్న ప్రజలు, పరిస్థితులు, స్థితి గతులు, వస్తువులు మొదలైనవాటికి మీలో కలిగే మానసిక ప్రతిచర్య అని అర్థం. మీ సహోద్యోగులతో మీ అనుబంధం ఎలాంటిది? మనుషులతో, జంతువులతో, మొత్తం మీద విశ్వంతో సాధారణంగా స్నేహంగా మసలు కుంటున్నారా? ప్రపంచం మిమ్మల్ని ప్రేమిస్తున్నదా? ప్రపంచం మీకు వ్యతిరేకంగా ఉందని అనుకుంటున్నారా? లేదా మీరు జీవించడానికి ఋణపడి ఉందా? క్లుప్తంగా మీ వైఖరి ఏమిటి?

పైన ఉదహరించిన అమ్మాయి భావోద్వేగ ప్రతిచర్య, మనసులో గాఢంగా పాతుకుపోయిన వైమనస్యం వల్ల ఏర్పడింది. అదే పుస్తకాలు అమ్మడంలో తప్పువైఖరి; పుస్తకంపట్ల రచయితపట్ల ఆమెకున్న విముఖత.

మీ మానసిక అంగీకారం లేకుండా, బాహ్యంగా ఏదైనా సరే మిమ్మల్ని బాధించదు. ప్రభావితం చేయదు. గాయపరచజాలదు. ఆశాభంగానికి గురిచేయజాలదు అని స్పష్టంగా గ్రహించినప్పుడే మీరు సరైన మానసిక వైఖరిని పెంపొందించుకోగలుగుతారు. మీ ప్రపంచంలో మీరు మాత్రమే ఆలోచనాపరులు; అందువల్ల మానసికమైన మీ అనుమతి లేకుండా మీకు

ఏదిగానీ – కోపం, విషాదం, బాధ కలిగించజాలదు. మిమ్మల్ని కదిలించడానికి మీరు మానసికంగా అనుమతిస్తే తప్ప, మిమ్మల్ని ప్రతికూలంగా ఆలోచింపచేయడానికి వెలుపలినుంచి మీకేసి వచ్చే సూచనలకు ఎలాంటి శక్తీ ఉండదు. మీ ఆలోచనా ప్రపంచానికి మీరే యజమానులు అన్న విషయం స్పష్టంగా తెలుసుకోండి. ఆలోచనలను అనుసరించే భావోద్వేగాలు కలుగుతాయి; అందువల్ల మీ కక్ష్యలో మీరే అత్యున్నతులు, అత్యధికులు సుప్రీమ్. ఇతరులు మిమ్మల్ని ప్రభావితం చేయడానికి అనుమతించగలరా? వార్తాపత్రికల పతాక శీర్షికలు, ఇతరుల విమర్శలు, నీలి వార్తలు, పుకార్లు మిమ్మల్ని బాధిస్తాయా? మీలో మానసిక కుంగుబాటును కలిగించగలవా? అలా అయినట్టయితే, మీ మానసిక స్థితికి మీరే కారణం అని అంగీకరించి తీరాలి. మీ మానసిక ప్రతిచర్యను మీరే సృష్టించుకున్నారు. మీ వైఖరి తప్పు.

ఇతరులలోని చెడును గురించి మీరు తలుచుకుంటున్నారా? అలా తలుచుకునేప్పుడు మీ అంతరాంతరాల్లో పుట్టుకువచ్చే భావోద్వేగాన్ని గమనించండి; అది మీ ఆయురారోగ్యాలకూ, ఐశ్వర్యానికీ ప్రతిబంధకమైనది; ప్రతికూలమైనది; వినాశకరమైనది. మీరు అనుమతించినప్పుడు మాత్రమే బాహ్య పరిస్థితులు మిమ్మల్ని ప్రభావితం చేస్తాయి. జీవితంపట్ల, ఇతర విషయాలపట్ల మీ వైఖరిని మీరే స్వచ్ఛందంగా, తప్పకుండా మార్చుకోవచ్చు. మీరే మీ విధికి యజమాని, ఆత్మ సుప్త చైతన్యాత్మక మనస్సుకు కెప్టెన్ కావచ్చు. క్రమశిక్షణ ఇవ్వడం ద్వారా, దిశానిర్దేశం చేయడం ద్వారా, నియంత్రించబడిన సంకల్పం ద్వారా మీ భావోద్వేగాలను, మానసిక వైఖరిని అధిగమించి అధీనంలోకి తీసుకురావచ్చు.

ఉదాహరణకు ఒక వ్యక్తిని నీచుడిగా, అయోగ్యుడిగా, అసూయా పరుడిగా భావించినప్పుడు మీలో కలిగే భావోద్వేగాన్ని గమనించండి. ఇప్పుడు పరిస్థితిని తిరగవేసి చూడండి. అదే వ్యక్తిని నిజాయితీపరుడిగా, సత్యవంతుడిగా, ప్రేమ కలవాడిగా, దయాళువుగా ఊహించుకోండి; మీలో

కలిగే ప్రతిస్పందనలను గమనించండి. ఇప్పుడు తెలియడం లేదూ మీ వైఖరులకు యజమాని మీరే అని?

వాస్తవంలో అసలు విషయం ఏమిటంటే, మామూలుగా దేవుడు అంటే మీకున్న భావనే జీవితం పట్ల మీకున్న మొత్తం వైఖరిని నిర్ణయిస్తుంది. దేవుడి గురించిన మీ బలీయమైన భావనే జీవితం పట్ల మీ భావన, ఎందుకంటే దేవుడే జీవితం గనక. మీ ఆలోచనలకు ప్రతిస్పందించే మీలో వున్న ఆధ్యాత్మిక శక్తి దేవుడు – అన్న బలీయమైన భావన లేదా వైఖరి గనక ఉన్నట్టయితే, మీ ఆలోచనలు ఎల్లప్పుడూ నిర్మాణాత్మకంగానూ, సామరస్యం గానూ ఉంటాయి. ఈ శక్తి అన్ని విధాలా, అన్ని వేళలా దారి చూపుతూ మిమ్మల్ని సంపన్నులను చేస్తుంది. ఈ బలీయమైన వైఖరి ప్రతి ఒక్కదానికీ రంగులద్ది కాంతివంతం చేస్తుంది. మీరు సానుకూలంగా అవుననే మనో వైఖరితో ప్రపంచాన్ని చూడగలుగుతారు. మీ దృక్పథం సానుకూలమైనది గనక, ఎల్లప్పుడూ మీరు ఉత్తమమైన వాటికోసమే ఉత్సాహంగా ఎదురు చూస్తూ ఉంటారు.

చాలామంది జీవితం పట్ల అంధకార బంధురమూ, నిరాశావహమైన దృక్పథమే కలిగి ఉంటారు. వాళ్ళు ఎప్పుడు చూసినా – విరక్తి, అనుమానం, విసుగు, వెగటు వెలిబుచ్చేవారుగానే ఉంటారు. ప్రతి యొక్క దానికీ ప్రతికూలంగా స్పందించమని వాళ్ళను నిర్దేశించే బలీయమైన ప్రతికూల మనోవైఖరే దీనికి కారణం.

ఉన్నత పాఠశాలకు వెళ్ళే ఒక పదహారేళ్ళ కుర్రాడు, "నాకు మరీ తక్కువ గ్రేడ్లు వస్తున్నాయి. చదివింది జ్ఞాపకం ఉండడం లేదు. కారణం ఏమిటో తెలియడం లేదు," అన్నాడు నాతో. దీనికి కారణం ఒక్కటే. తప్పుగా ఉంటున్నది అతని వైఖరి ఒక్కటే. అతడు ఆ వైఖరిని వదులుకుని, తనకు చదువు ఎంత ముఖ్యమైనదో, న్యాయవాది కావడానికి, కాలేజీకి వెళ్ళడానికి మంచి గ్రేడ్లు ఎంత అవసరమో గ్రహించి, నూతన మనోవైఖరిని అలవరచు

కోవడం ఆరంభించాడు. మానసిక స్థితిని మార్చగల త్వరిత మార్గాలలో ఒకటైన విజ్ఞానాత్మకంగా ప్రార్థించడం మొదలుపెట్టాడు.

విజ్ఞానాత్మకమైన ప్రార్థనలో – ఆలోచనకు స్పందించే సిద్ధాంతంతో మనం వ్యవహరిస్తాం. ఈ యువకుడు తనలో ఆధ్యాత్మిక శక్తి ఉంది అని గ్రహించాడు. వాస్తవంలో అదే ఏకైక కారణం, శక్తి. పైగా, తన జ్ఞాపకశక్తి నిర్దుష్టమైనదనీ, అన్ని వేళలా, అన్ని చోట్లా తను తెలుసుకోవలసిన, తనకు అవసరమైన వాటినంతా అనంత మేధస్సు నిరంతరాయంగా తనకు తెలియజేస్తున్నట్టూ అతడు చెప్పుకోసాగాడు. ఉపాధ్యాయులు, సహవిద్యార్థుల పట్ల ప్రేమ, సుహృద్భావాలను ప్రసరించసాగాడు. ఇప్పుడు అతడు వెనకటి కన్నా ఎక్కువ స్వతంత్రాన్ని ఆనందంతో అనుభవించసాగాడు. అన్నింటా తనకు 'ఏ' గ్రేడ్లు రావడంతో తన తల్లీ, ఉపాధ్యాయులూ అభినందిస్తున్నట్టు నిరంతరం సుస్థిరంగా భావించుకోసాగాడు. ఆశించిన ఫలితాలను అందుకున్నట్టు ఊహించుకుని భావించడమే చదువుపట్ల అతని వైఖరిలో మార్పుకు దోహదం చేసింది.

మన మనోవైఖరులన్నీ మన భావనలతో ప్రభావితమవుతాయని మనం ముందే చెప్పుకున్నాం. ఈ రోజు చెడుగా ఉండబోతోందనీ, వ్యాపారం మందకొడిగా ఉంటుందనీ, వర్షం వస్తుందనీ, ఒక్క ఖాతాదారూ రారనీ, వచ్చినా వాళ్ళ వద్ద చాలినంత డబ్బులు ఉండవనీ, మీరు భావించారనుకుందాం. ఆ రోజంతా మీ ప్రతికూల భావనల ఫలితాలే మీరు అనుభవించవలసి వస్తుంది.

ఒకసారి ఒకాయన లండన్ వీధులగుండా నడిచి వెళుతున్నాడు. ఉన్నట్టుండి వీధిలో పాము ఎదురైతే అన్న ఊహ ఆయన మనసులో కదలాడింది. ఆ సమయానికి అక్కడ పాములాంటిది ఏదో కనిపించింది. భయంతో గడగడ వణికిపోయాడు. అతడు చూసింది పాములాంటిదానినే. పామును కాదు. అయితే, దానిని నిజంగానే పామని భ్రమపడి మానసిక, భావోద్వేగ ప్రతిస్పందనకు లోనయ్యాడు.

ఇష్టమైన వాటిని, మంచివాటిని, ఉదాత్త విషయాలను మాత్రమే ఊహించుకోవాలి. దాంతో జీవితంపట్ల మీ భావోద్వేగ వైఖరి సొంతం మారి పోతుంది. జీవితం గురించి మీరేమని భావిస్తున్నారు? అది మీకు సంతోషదాయకంగా ఉండాలా? లేదా ఆశాభంగాల, నిరాశానిస్పృహల పొడవాటి తోరణంగా ఉండాలా? మీకు ఏం కావాలో మీరే ఎంపిక చేసుకోండి.

మీరు తరచూ అలవాటు కొద్దీ మీలో రూపొందించుకుని గడిపే మనోచిత్రాలకు అనుగుణంగానే మీ బాహ్యప్రపంచ అనుభవాలను మీరే అచ్చుపోసి, రూపొందించి, సరిదిద్దుకుంటూ ఉంటారు. మీకు గౌరవ మర్యాదలను తెచ్చే, మిమ్మల్ని ఉద్ధరించే, మీకు సంతోషం, తృప్తి కలిగించే స్థితిగతులను, పరిస్థితులను మాత్రమే ఊహించుకోండి. అలా కాకుండా జీవితాన్ని దుర్భరంగానూ, భయంకరంగానూ, క్రూరమైనదిగానూ, చేదు గానూ, పోరాటంగానూ భావించి, జీవితంలో పోరాటం, బాధ తప్పింప రానివి అని భావించుకున్నట్టయితే – మీకు మీరే మీ జీవితాన్ని దుర్భరం చేసుకుంటున్నారన్నమాట!

మీరు ఒక గోల్ఫ్ మైదానంలో ఉన్నట్టు ఊహించుకోండి. స్వేచ్ఛగా, నింపాదిగా, అమితోత్సాహంతో, శక్తితో ఉంటారు. గోల్ఫ్ మైదానంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొని ముందుకు వెళ్ళడంలోనే మీ సంతోషం ఉంటుంది. అవరోధాలన్నింటినీ అధిగమించడంలోనే గగుర్పాటు కలిగించే ఆనందం ఉంటుంది.

ఇప్పుడు ఒక దృశ్యాన్ని చూద్దాం: మిమ్మల్ని మీరు ఒక వ్యక్తి అంతిమ యాత్రలో వెళుతున్నట్టు ఊహించుకోండి. పైన కనబరచిన పరిస్థితులు ఒక్కొక్క దానిలో మీరు మీలో ఏర్పరచుకున్న విభిన్న భావోద్వేగ స్పందనలను ఒకసారి గమనించండి. అంతిమయాత్రలో ఉన్నా, ఆ వ్యక్తి జన్మదినోత్సవంలో పాల్గొంటున్నట్టు ఆనందించవచ్చు. ప్రేమించబడిన ఆ వ్యక్తి తన మిత్రులతో

వర్ణనాతీతమైన అందం అనురాగాల మధ్య ఉండవచ్చు. అక్కడున్న వారి మనసులనూ, హృదయాలనూ దేవుడి శాంతి నదీ ప్రవాహం ముంచెత్తు తున్నట్టు ఊహించుకోవచ్చు. మీరు ఎవరైనా సరే, మీరు మీ మనోస్వర్గాలను నిజంగానే అధిరోహించవచ్చు. ఇది మీ ఊహకు ఉన్న అద్భుతశక్తి.

"అతను మరొక కల గని, అతని సోదరుడికి చెప్పాడు: 'అదిగో చూడు నేను ఇంకొక కల గన్నాను. అదిగో చూడు – సూర్యుడూ, చంద్రుడూ పదకొండు నక్షత్రాలూ నాకు నమస్కరించాయి' ".

ప్రాచీన సంకేత శాస్త్రం ప్రకారం సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు – చేతనాత్మక, సుప్తచేతనాత్మక మనసుకు సంకేతాలు. పదకొండు నక్షత్రాలు ఊహతో పాటు ఉన్న పదకొండు శక్తులకు సంకేతాలు. మరో విషయం ఏమిటంటే – క్రమశిక్షణ ఇవ్వబడిన ఊహ మిగతా మానసిక శక్తులకన్నా ముందు ఉంటుందనీ; చేతనాత్మక, సుప్తచేతనాత్మక మనసు దిశలను నిర్దేశిస్తుందనీ స్ఫూర్తి పొందిన రచయితలు చెబుతూనే ఉన్నారు. ఊహే మొదటిది. అన్నిటికన్నా ముందున్నది; దానిని వైజ్ఞానికంగా నడిపించవచ్చు.

యాభై సంవత్సరాల క్రితం, నేను ఓసారి మా తండ్రి గారితో వెళ్ళి ఐర్లాండులోని ఒక రౌండ్‌టవర్‌ను పరిశీలనగా చూస్తున్నాను. ఒక గంట సేపైనా ఆయన ఒక్క మాట మాట్లాడలేదు. తదేకంగా చూస్తూ, దేన్నో గ్రహిస్తున్నట్టు కనిపించాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు కనిపించాడు. 'దేన్ని గురించి అంతగా ఆలోచిస్తున్నావు?' అని నేను అడిగాను. ఆయన ఇచ్చిన సమాధాన సారాంశం ఇది : 'ప్రపంచంలో వెలసిన గొప్ప గొప్ప అద్భుతమైన ఆలోచనలను తెలుసుకోవడం ద్వారానే మనం పెరుగుతూ విస్తరించగలుగు తున్నాం.' ఆయన టవర్ శిలాయుగం గురించి గాఢంగా ఆలోచించాడు. ఆ ఊహలు అతణ్ణి ఇంకా వెనక్కి, అంటే ప్రప్రథమంగా శిలలు ఏర్పడిన కాలానికీ, రాతి గనులలోకీ తీసుకువెళ్ళాయి. ఆ తరవాత అతని ఊహలు శిలలను బహిర్గతం చేశాయి. ఆయన తన అంతర్నేత్రంతో శిలల నిర్మాణం,

అవి భూగర్భంలో రూపొందడం, శిలల కూర్పు మొదలైన వాటిని దర్శించి వాటిని ఒక అరూప స్థితికి కుదించాడు. ఆఖరికి ఆయన ఇతర శిలలలో ఆ శిలల ఏక రూపాన్నీ, సకల ప్రాణికోటి ఏకత్వాన్నీ ఊహించగలిగాడు. రౌండ్ టవర్‌ను చూడడం నుంచి ఐరిష్ జాతి చరిత్రను పునర్నిర్మించుకోవడం సాధ్యమే అని ఆయన తనదైన దివ్యభావన ద్వారా తెలుసుకోగలిగాడు.

తన ఊహాశక్తి ద్వారా, ఆ ఉపాధ్యాయుడు టవర్‌లో నివసిస్తూన్న అదృశ్య మానవులను చూడగలిగాడు. వాళ్ళ కంఠస్వరాలను వినగలిగాడు. ఆయన ఊహలో ఆ ప్రదేశమంతా సజీవంగా సాక్షాత్కారమయింది. ఆ శక్తి ద్వారా ఆయన ఎంతో వెనక్కు, అక్కడ రౌండ్ టవర్ లేని కాలానికి సైతం వెళ్ళగలిగాడు. శిలలు ఏర్పడిన ఆ ప్రదేశం గురించీ, వాటిని ఎవరు అక్కడికి తరలించారు, ఆ నిర్మాణ ఉద్దేశం ఏమిటి, దానికి సంబంధించిన చరిత్ర మొదలైన విషయాలను ఆయన మనసులో ఒక చోట గుదిగుచ్ఛగలిగాడు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే, "వేనవేల సంవత్సరాలకు పూర్వం అదృశ్యమైపోయిన పాదాలను దాదాపు స్పృశించి వాటి చప్పుడును విన గలుగుతున్నాను."

ఆత్మగతమైన మనసు అన్నింటిలోకీ చొచ్చుకుపోయి వ్యాపిస్తుంది. అది అంతటా ఉంటోంది. సర్వం రూపొందించబడిన పదార్థం అదే. భవనం నిర్మించబడిన రాళ్ళల్లోనే శాశ్వతత్వం నిధి నిక్షేపాల నిలయం ఉంటోంది. అచేతనమైనవి, కదలలేనివి అంటూ ఏవీ లేవు. అంతా ప్రాణం యొక్క విభిన్న రూపాల సాక్షాత్కారాలు. (సూర్యుడూ, చంద్రుడూ జోసెఫ్ (ఊహ)కు నమస్కరిస్తున్నాయి.) నిజంగానే మీ ఊహాశక్తి ద్వారా ప్రకృతి అదృశ్య రహస్యాలు మీ ఎదుట ద్యోతకమవుతున్నట్టు మీరు భావించవచ్చు. మీరు మీ చైతన్యం లోతులలోనికి చొచ్చుకుపోయి పరిశీలించినట్టయితే, ఉన్నవి ఉన్నట్టు కనిపించనివి స్పష్టంగా కనిపిస్తాయి.

ఒకనాటి సాయంకాలం అస్తమిస్తూన్న సూర్యుణ్ణి చూస్తూ ఒక పార్కులో

కూర్చున్నాను. ఉన్నట్టుండి సూర్యుణ్ణి లాస్‌ఏంజెలెస్‌లోని ఒక ఇల్లులా భావించసాగాను. మన సూర్యుడి వెనక అంతకన్నా పెద్ద పరిమాణంలో మరో సూర్యుడు ఉన్నాడు. దాని వెనక అంతకన్నా పెద్దదైన మరో సూర్యబింబం. అలా అలా అసంఖ్యాకంగా, అనంతంగా కనిపించాయి. అసంఖ్యాకమైన సూర్యగోళాల గురించీ, పాలపుంతలకు ఆవలి వరకూ అనంతంగా విస్తరించిన సూర్యగోళాల గురించీ, సౌరకుటుంబాల గురించీ తలుచుకుని ఆలోచించమని ఊహలో ఒక ప్రేరణ. అనంత సముద్రతీరంలోని ఇసుకరేణువులాంటిది ఈ ప్రపంచం. విడివిడిగా విడిభాగాలను చూద్దం కన్నా, మొత్తాన్ని అన్నిటి ఐక్యతను తిలకిద్దాం. కవి చెప్పినట్టు – 'ప్రకృతి దేహంగా, భగవంతుడు ఆత్మగా పరిఢవిల్లుతూన్న ఏకైక బ్రహ్మాండ పూర్ణత్వంలో అన్నీ అంతర్భాగాలే.'

నిజానికి మానవుడి ఊహాత్మకమైన మనసునుంచే అన్ని మతాలూ ఆవిర్భవించాయి. టెలివిజన్, రేడియో, సూపర్ జెట్స్ మొదలైన ఆధునిక ఆవిష్కరణలన్నీ మనిషి భావనా ప్రపంచం నుంచే కదా కనుగొనబడ్డాయి? మీ ఊహ మీకు అమూల్యమైన సంగీత, కళా, కవితాభరణాలను అందించే అద్భుత అనంతత్వ నిధి భాండాగారం. మీరు ప్రాచీన శిథిల శకలాలనూ, పురాతన ఆలయ కుడ్యాలనూ, లేదా పిరమిడ్‌లనూ సందర్శించి – గతించిన భూతకాల చరిత్రను పునర్నిర్మించుకోవచ్చు. పురాతన చర్చి ప్రాంగణ శిథిలాల నుంచి అత్యంత సౌందర్యంతో, వైభవంతో వెలుగొందే ఆధునిక మహానగర పునర్నిర్మాణాన్ని దర్శించవచ్చు. మీరు లేమి బందిఖానాలో, దరిద్రంలో శిలల ఊచల వెనక మగ్గుతూ ఉండవచ్చు. అయినా మీ భావనలో అపూర్వమైన హద్దులు లేని స్వతంత్రాన్నీ, స్వేచ్ఛనూ కనుగొనవచ్చు.

పరీసియన్ స్క్వేయర్ క్లీనర్ చికో – ఎన్నడూ పగటి వెలుతురును చూడకపోయినప్పటికీ, మనసులోనే ఏడవస్వర్గమనే స్వర్గతుల్యమైన మానసిక స్థితిని ఊహించుకుని ఎలా జీవించాడో జ్ఞాపకం చేసుకోండి.

జైల్లో ఉన్నప్పుడే బున్‌యాన్ గొప్ప కళాఖండమైన 'పిల్‌గ్రిమ్స్ ప్రోగ్రెస్'ను రచించాడు. మిల్టన్ అంధుడే అయినప్పటికీ, తన అంతర్నేత్రంతో చూడ గలిగాడు. ఆయన కల్పనాశక్తి ఆయన మెదడును జ్వలించే నిప్పుల బంతిగా మార్చింది. ఆయన 'పేరడైజ్ లాస్ట్'ను రచించాడు. ఆ విధంగా ఆయన దేవుడి స్వర్గాన్ని కాస్తా అన్నిచోట్లా వున్న ప్రజలందరి వద్దకూ తీసుకు వచ్చాడు.

కల్పనాశక్తి మిల్టన్ ఆధ్యాత్మిక నేత్రం; అది దేవుడి మహిమను అన్వేషిస్తూ, దేశ కాల పరిస్థితులను అధిగమించి అదృశ్య వ్యాపకత్వాన్నీ, శక్తినీ వెలికి తీసుకువచ్చేలా చేయగలిగింది.

తన సుప్తచేతనాత్మక మనసుతో సాన్నిహిత్యం కలిగినవున్నవాడే మేధావి. అతడు విశ్వశక్తిని తనకు తగ్గట్టు వినియోగించుకోగలడు. దాని ద్వారా తన సమస్యలకు సమాధానం పొందగలుగుతాడు. అందువల్ల అధిక ప్రయాసతో శ్రమపడవలసిన అవసరం ఉండదు. మేధావి రకం మనసులో, ఊహాశక్తి అత్యున్నత స్థాయికి అభివృద్ధి చెంది ఉంటుంది. గొప్ప కవులు, రచయితలు అందరూ కూడా బాగా అభివృద్ధి చెందిన ఊహాశక్తి కలిగి ఉంటారు.

షేక్స్‌పియర్ తన కాలంలో ప్రాచుర్యంలో ఉన్న పాత కథలను, కల్పిత గాథలను, పురాణ కథలను వినడం నేను ఇప్పుడు చూడగలుగుతున్నాను. ఆయన ఆ కథలలోని పాత్రలను తన మనసులోని నాటకాల్లో ప్రవేశపెట్టాడు... ఆ తరవాత ఒక్కొక్కదానికీ ఎముకలు, కండరాలు, చర్మం, శిరోజాలు తొడిగి అలంకరించి, కదలాడేలా చేయగలిగాడు; ఆ తరవాత, మనల్ని గురించి మనమే చదువుకుంటున్నామా అనుకునేంత సహజ సజీవపాత్రలుగా తీర్చిదిద్ది మన మధ్య నడయాడేలా చేయగలిగాడు.

మీ ఊహాశక్తిని ఉపయోగించుకుని మీ తండ్రి వ్యాపారంలోకి ప్రవేశించండి. మీ తండ్రి వ్యాపారం – కృత్యం – మీ వివేకాన్నీ, నైపుణ్యాన్నీ,

జ్ఞానాన్నీ శక్తిసామర్థ్యాలనూ వెలికితెచ్చి మీతోపాటు అందరినీ ఆశీర్వదించడం. మీరు మీ తండ్రి కృత్యంలో ప్రవేశిస్తున్నారు అంటే– మీరొక చిన్న దుకాణాన్ని నిర్వహిస్తున్నప్పటికీ మీ ఊహలో మీరు అంతకన్నా పెద్ద దుకాణాన్ని నడుపుతూ సాటి జనులకు మరింత సేవను అందజేస్తున్నట్టు భావించడం.

మీరు ఒక కథారచయిత అయినా సరే, మీ తండ్రి పనిని పుణికి పుచ్చుకోవచ్చు. మీ మనసులో 'బంగారు సూత్రాన్ని' బోధించే కథను సృష్టించుకుని – ఆ కథనూ, అందులోని పాత్రలనూ ఆధ్యాత్మీకరించబడిన అత్యంత కళాత్మకమైన మీ మనస్తత్వంలోకి ప్రవేశపెట్టాలి. ఆ తరవాత ఆ కథ పాఠకులను అమితాసక్తితో అలరించగల అద్భుత కళాఖండంగా రూపొందుతుంది.

మనిషిని గురించిన సత్యం ఎల్లప్పుడూ అద్భుతమైనది, అందమైనది. ఒక నవలనుగాని, కథనుగాని రాస్తున్నప్పుడు – సత్యాన్ని అందంగా, ఆహ్లాద భరితంగా అలంకరించాలన్న విషయంలో కృతనిశ్చయంతో ఉండాలి. ఇప్పుడు మీరొక సింధూర వృక్షం కాయను చూస్తే చాలు. మీ కల్పనా నేత్రంతో నదీనదాలు, సెలయేళ్ళతో నిండిన అద్భుతమైన మహారణ్యాన్ని నిర్మించు కోవచ్చు. దానిని మనుషులతో సహా సకల విధాల ప్రాణులతో కళకళలాడేలా చేయవచ్చు. అక్కడి ఆకాశ మేఘాలలో ప్రతిమేఘం మీదా ఇంద్రధనుస్సు వెల్లివిరిసేలా చేయవచ్చు. ఒక ఎడారిని చూసి అందులో గులాబీలు విరబూసినట్టు ఊహించుకోవచ్చు. 'ముళ్ళున్న చోట దేవదారు వృక్షం పెరగనీ. ముళ్ళ పొదలకు మిర్టిల్ చెట్టు పెరగాలి.' అంతర్దృష్టి, ఊహ కలిగిన మనుషులు ఎడారిలో సరోవరాలు సందర్శించగలరు. తక్కిన వాళ్ళు ఇన్నాళ్ళు కేవలం ఎడారినీ, అడవులనూ చూసినచోట వీళ్ళు నగరాలను సృష్టించగలరు.

ఒక నగర నిర్మాణ వాస్తు శిల్పి – బావి తవ్వి చిన్న ఇల్లు సైతం కట్టకముందే – అక్కడ పెద్ద పెద్ద భవనాలూ, ఫౌంటన్‌లూ వెలుగొందడం

చూడగలడు. 'కారడవిని తటాకంగానూ, బంజరు భూమిని మంచినీటి చెలమలుగానూ తయారుచేయగలను.'

ఎక్కువసేపు పనిచేయడం, కఠినశ్రమ లేదా నడిరేయి వరకు మేలుకుని శ్రమించడం– మిల్టన్‌నూ, షేక్స్‌పియర్‌నూ, బెతోవన్‌నూ సృష్టింపజాలవు. ప్రశాంత తరుణాలలో కాలం పునాదినుంచి అదృశ్య విషయాలను ఊహించడం ద్వారానే మనుషులు మహత్తర కార్యాలను సాధించ గలుగుతారు – అన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది.

మీ మనోయవనిక మీద వ్యక్తమయిన వర్ణనాతీతమైన ఆ సౌందర్యాన్ని ఊహించుకోవచ్చు. మీరు అందాన్ని ప్రేమించే నిజమైన చిత్రకారుడు గనక అయినట్టయితే, ఆ యువతి సౌందర్యం సునాయాసంగా మీ కుంచె ద్వారా వెలువడుతుంది. మహాస్ఫూర్తి తరుణాలు మీ వద్దకు వస్తాయి. దానికీ, చెమటోడ్చడానికీ, శారీరక మానసిక కఠోరశ్రమకూ ఎలాంటి సంబంధమూ ఉండదు.

గ్రీన్విచ్ గ్రామంలో అందమైన కవితలు రాసిన ఒక కవిని కలిశాను. ఆయన కవితలను అట్టల మీద ముద్రించి క్రిస్మస్ సమయంలో అమ్మేవాడు. వాటిలో కొన్ని కవితలు ఆధ్యాత్మిక ప్రేమ అనర్ఘ రత్నాలు. తను ప్రశాంతంగా ఉన్నప్పుడు తన మనసులో అందమైన దృశ్యంతో సహా మృదువైన పదాలు కదలాడుతాయని ఆయన నాతో చెప్పాడు. రంగుల పువ్వులు పూచేవి. మనుషులు, స్నేహితులు స్పష్టంగా ఆయన మనసులోకి వచ్చేవారు. ఆ చిత్రాలు ఆయనకు తమ కథలు చెప్పేవి. పలు సందర్భాలలో ఏపాటి ప్రయత్నం లేకుండానే అతని మనసులో కవిత, గీతం, నిర్దుష్టంగా పూర్తిగా దృశ్యమానం అయ్యేవి. స్ఫురించేవి. మనుషుల హృదయాలను కదిలించే అందమైన కవితలు రాస్తున్నట్టు తరచూ ఊహించుకునే అలవాటు ఆయనకు ఉండేది.

కవిత అంటే 'ఊహల అభివ్యక్తీకరణ' అన్నాడు షెల్లీ. కవి, ప్రేమను

గురించి ఏకాగ్రతతో గాఢంగా ఆలోచిస్తూ, ప్రేమను గురించి రాయాలను కున్నప్పుడు – ఆయనలో ఉన్న అదృశ్య మేధాశక్తి, వివేకం ఆయన మనసును కదిలించి, దేవుడి అనంత సౌందర్య ప్రభావాన్ని ఆయన మీద ప్రసరింపజేసి, దేవుడి శాశ్వత ప్రేమకేసి ఆయన్ను మేలుకొలిపి, ఆయన పదాలు వివేక, సత్య, సౌందర్యాలతో రూపుదాల్చేలా చేస్తాయి.

గొప్ప సంగీత కళాకారుడు లోపలే ఉన్నాడు. సంగీతం వినిపించడం, సమకూర్చడమే మీ పని అయినప్పుడు, మీరు తండ్రి పనుల మీద ఉన్నట్టు దృఢంగా భావించండి. భగవంతుణ్ణి గొప్ప సంగీత కళాకారుడు అని గుర్తించడమే మీ తండ్రి పనులలో మొట్టమొదటిది. ఆ తరవాత, మీ లోపల ఉన్న సంగీతం, దేవుడి ప్రేమగీతం మీ ద్వారా ఆలపించబడుతోంది, సమకూర్చబడుతోంది అని తెలుసుకోవడానికి ధ్యానించడం, అనుభూతి చెందడం, ప్రార్థించడం... అంతే. ఆ తరవాత అంతకు ముందెన్నడూ ఆలపించనంత గొప్పగా ఆలపించగలుగుతారు.

ఎడిసన్ ప్రతియొక్క ఆవిష్కరణకూ మొట్టమొదట ఆయన ఊహలోనే అంకురార్పణ చేయబడింది. మరో గొప్ప ఆవిష్కర్త, విజ్ఞానశాస్త్రవేత్త అయిన టెల్సా విషయంలోనూ ఈ వాస్తవమే జరిగింది.

'ఆదర్శనీయం చేసి, ఊహించి, ముందుగానే చెప్పడానికి మూడు స్టోరీ స్పిన్నర్లు కావాలనుకుంటాను' అని ఆలివర్ వెండ్‌వెల్ హోల్మ్స్ చెప్పాడను కుంటాను. అయితే, తనలోని ఊహించి కలలుగనే సామర్థ్యమే – ఫోర్డ్‌ను ప్రపంచాన్ని చక్రాల మీద నడిపించడం గురించి ఆలోచింపజేసి ముందుకు తీసుకువెళ్ళడానికి కారణమని నేను విశ్వసిస్తున్నాను.

మీకున్న ఊహించే సామర్థ్యమే కాల దేశాలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకునే శక్తిని మీకు ప్రసాదిస్తుంది. మీ అంతర్నేత్రం ద్వారా మీరు మీ గతాన్ని పునర్నిర్మించుకోగలుగుతారు, లేదా భవిష్యత్ ఆలోచనను గాఢంగా చేయగలుగుతారు. 'ఇజ్రాయెల్ జోసెఫ్ (ఊహ) ను సోదరు

లందరిలోకీ ఎక్కువగా ప్రేమించాడు' అని జెనిసిస్ చెప్పడంలో ఆశ్చర్యం లేదు. ఊహకు క్రమశిక్షణనిచ్చి, ఆధ్యాత్మికం చేసి, నియంత్రించినప్పుడు అది మనిషికిగల అత్యున్నత ఉదాత్త లక్షణంగా రూపొందుతుంది.

కొన్నేళ్ళ కిందట నేనొక యువ రసాయనవేత్తతో మాట్లాడడం తటస్థించింది. అతని ఉన్నతాధికారులు ఒకానొక జర్మన్ డై తయారు చేయడానికి ఏళ్ళ తరబడి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ యువకుడు అక్కడ చేరగానే, ఆ పనిని అతనికి అప్పగించారు. అది అంతటి కష్టసాధ్యమైనదని అతనికి తెలియదు. ఎలాంటి శ్రమా లేకుండానే కొన్ని రసాయనాల మిశ్రమంతో ఆ సంయోజనాన్ని తయారుచేయగలిగాడు. దానిని చూసి ఆశ్చర్యపోయిన ఉన్నతాధికారులు, అందులోని రహస్యం చెప్పమని అడిగారట. 'దానికి తగ్గ సమాధానం నా వద్ద ఉందనీ అది సాధ్యమై తీరుతుందనీ నేను దృఢంగా భావించడమే దానికి కారణం' అని అతడు సమాధానమిచ్చాడు. దానిని నమ్మకుండా ఉన్నతాధికారులు రహస్యమేమిటని మరీమరీ అడగడంతో అతడు, తన మనసులో 'సమాధానం' అనే అక్షరాలు ఎరుపు రంగులో ప్రకాశించడం చూశానని చెప్పాడు. ఆ తరవాత అతడు ఆ అక్షరాల దిగువ శూన్యం సృష్టించి, తనకు కావలసిన రసాయన సమీకరణాన్ని, సుప్త చైతన్యం నింపుతుందని భావించాడట. మూడో రాత్రి అతనికి ఒక కల వచ్చింది. ఆ కలలో పూర్తి సమీకరణతోపాటు సంయోజనం తయారుచేసే సాంకేతిక విధానం కూడా స్పష్టంగా కనిపించింది.

'జోసెఫ్ (ఊహ) ఒక స్వాప్నికుడు. స్వప్నాల స్వాప్నికుడు.' 'అతణ్ణి హతమార్చడానికి వాళ్ళు కుట్ర పన్నారు. ఒకరితో ఒకరు – చూడండి అదిగో వచ్చాడు స్వాప్నికుడు అని చెప్పుకున్నారు.' బహుశా ఈ బైబిల్ ఉటంకింపులు చదువుతున్నప్పుడు మీ మనసులో భయం, సందేహం, ఉత్కంఠ ఆలోచనలు కలిగి మీలోని కోరికను, లక్ష్యాన్ని, కలను హతమార్చడానికి కుట్రపన్నవచ్చు. మీ మనసులో భయం ఏర్పడే స్థితులను, పరిస్థితులను గమనించి చూడండి; అయినప్పటికీ మీలో కోరిక ఉంటుంది. దానిని సఫలం చేసుకున్నట్టయితే,

మీ సమస్య పరిష్కారమై ప్రశాంతత సమకూరుతుంది.

మీరు జోసెఫ్‌లా ఆచరణశీలుడైన స్వాప్నికుడుగా ఉండాలి. మీ కలలను నిజం చేసుకోవడానికి దృఢంగా నిర్ణయించండి. వస్తువుల పైపై రూపాల నుంచి, ఇంద్రియాల సాక్ష్యాల నుంచి, మీ దృష్టిని ఉపసంహరించుకోండి. మీరు ప్రార్థించిన వాటిని మీ ఇంద్రియాలు తిరస్కరించినప్పటికీ, అవి నిజంగా మీ హృదయంలో ఉన్నవే అని దృఢపరచుకోండి. మీలో వున్న ఆధ్యాత్మికశక్తి, సర్వశక్తి సంపన్నంలో విశ్రాంతి తీసుకోవడానికి – నకిలీ దేవుళ్ళయిన భయ సందేహాల వెంబడి పరుగులెత్తే మీ మనసును వెనక్కు తీసుకురండి. మీ మనసు నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉన్నప్పుడు ఏకైక శక్తి, ఏకైక సమక్షం ఉన్న సత్యం గురించి గాఢంగా ఆలోచించండి. ఆ శక్తి సముఖం, సమక్షం ఇప్పుడు మీ ఆలోచనకు మార్గదర్శకంగా, శక్తిగా, శాంతిగా, ఆత్మీయశక్తి నిచ్చేదిగా ప్రతిస్పందిస్తుంది. దైవశక్తి సమాధానం కలిగివుందనీ, మీకు ఇప్పుడు దారి చూపుతోందనీ తెలుసుకుని, ఆధ్యాత్మిక శక్తి సంపూర్ణ సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి మీ మానసిక ధ్యాసనంతటినీ కేంద్రీకరించండి. దానిని నమ్మండి. దానినే గాఢంగా విశ్వసించండి. మీ ప్రార్థనకు ఇప్పటికే ఫలితం లభించిందన్న వెలుగులో భూమి మీద అడుగులు వేయండి.

కొలంబస్ గురించీ, ఆయన అమెరికాను కనుగొన్న విషయం గురించీ మనమందరం చదువుకున్నాం. ఆయన ఊహే ఆయన్ను అమెరికాను కనుగొనేలా చేసింది. ఆయన ఊహ, దాంతోపాటు దివ్యశక్తిపట్ల ఆయనకు ఉన్న ప్రగాఢ విశ్వాసం, ఆయన్ను ముందుకు నడిపించి విజయాన్ని తీసుకువచ్చాయి.

నావికులు కొలంబస్‌తో, "మన నమ్మకం వమ్మయింది, ఇప్పుడు ఏంచెయ్యాలి?" అన్నారట. అందుకు ఆయన సమాధానం : "ఆ విషయం తెల్లవారాక చెప్పవచ్చు. ముందుకు సాగివెళ్ళండి. సాగివెళ్ళండి." ఇక్కడే

ప్రార్థన తాళంచెవి ఉంది. చివరిదాకా విశ్వాసం ఉంచండి. మార్గంలో వేసే ప్రతి అడుగులోనూ పరిపూర్ణ విశ్వాసం ఉంచండి. చివరిదాకా పట్టుదల వదలకండి. ఫలితం పదిలంగా ఉన్నట్టు మీరు తుదిఫలితాన్ని చూశారు గనక, అది పదిలంగా ఉందని మీ హృదయానికి తెలుసు.

కోపర్నికస్ తన స్పష్టమైన ఊహ ద్వారా భూమి ఎలా దాని ఇరుసు మీదుగా పరిభ్రమిస్తున్నదో వెలువరించి, అంతకు పూర్వం నెలకొన్న ప్రాచీన ఖగోళ సిద్ధాంతాలను వదులుకునేలా చేశాడు.

మనమందరం కూడా కాలానుగుణంగా ఎప్పటికప్పుడు మన భావాలను, విశ్వాసాలను, అభిప్రాయాలను పరీక్షించుకుంటూ మనల్ని మనం నిజాయితీగా, "నేనెందుకు దీనిని విశ్వసిస్తున్నాను? ఈ అభిప్రాయం ఎక్కడినుంచి వచ్చింది?" అని ప్రశ్నించుకోవడం అద్భుతంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. బహుశా మనకున్న చాలా భావాలు, సిద్ధాంతాలు, విశ్వాసాలు, అభిప్రాయాలు పూర్తిగా తప్పుగానూ, వాటిలోని వాస్తవం, నిక్కచ్చితనం గురించి పరిశీలించి విచారించబడకుండా మనచేత సత్యంగా అంగీకరింపబడినవిగానూ ఉంటున్నాయి. మన తాతలు తండ్రులు ఒక విధంగా వాటిని నమ్మినంత మాత్రాన మనమూ నమ్మితీరాలనడం సరైన కారణం కాదు.

ఒక విషయాన్ని తమ బామ్మ విశ్వసించింది గనక, అది నిజమే అయి వుంటుందని ఒకావిడ నాతో చెప్పింది. అది అసంబద్ధం! జాతి మనసు నిజం కాని చాలావాటిని విశ్వసిస్తుంది. తరతరాలుగా వస్తున్నంత మాత్రాన అవి తప్పకుండా సరైనవనిగానీ, తుది తీర్పు అని గానీ, అధికారం కలవని గానీ చెప్పలేము.

పైన ప్రస్తావించిన నిజాయితీతో అనుకున్నది స్పష్టంగా వెలిబుచ్చగల ఆ మహిళ మనసు, మానసిక వాస్తవాలపట్ల చాలా సున్నితంగా ఉండేది. ఆమె బైబిల్‌లో ఉన్నవాటిని అలాగే ఉన్నది ఉన్నట్టు తీసుకునేది. ఆ మనసు

వైమనస్యంతో, మూఢ నమ్మకంతో పనిచేస్తూ తనలో నెలకొన్న విశ్వాసాలకు, అభిప్రాయాలకు, ముందే ఏర్పరచుకున్న భావాలకు అనుగుణంగా లేనివాటి నంతా వ్యతిరేకించేది.

మన మనసు ప్యారాచూట్‌లాగా ఉండాలి. ప్యారాచూట్ తెరుచు కుంటుంది. తెరుచుకోలేదంటే దానివల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. అదేవిధంగా నూతన సత్యాల కోసం మన కళ్ళనూ, మనసులనూ ఎల్లప్పుడూ తెరిచే ఉంచాలి. విశ్వాసం, అవగాహన అనే రెక్కలతో మన సమస్యల మీదుగా విహరించేట్టు చేసే నూతన సత్యాల పట్ల, నూతన జ్ఞానం పట్ల నిరంతరం ఆకలి, దాహం కలిగి ఉండాలి.

ఈనాటి సుప్రసిద్ధులైన జీవశాస్త్రవేత్తలు, భౌతికశాస్త్రవేత్తలు, ఖగోళ శాస్త్రజ్ఞులు, గణిత మేధావులు అందరూ స్పష్టమైన, విజ్ఞానాత్మకమైన ఊహా సంపద కలిగిన వారే. ఉదాహరణకు ఐన్‌స్టీన్ సాపేక్షసిద్ధాంతం మొదట ఊహలోనే ఉండేది.

ప్రాచీన ఈజిప్టు మసీదులను, పిరమిడ్లను అధ్యయనం చేసే వాస్తు నిర్మాణ శాస్త్రవేత్తలు, లుప్తజంతుశాస్త్రవేత్తలు తమ ఊహాత్మక గ్రహణశక్తి ద్వారానే ప్రాచీన దృశ్యాలను పునర్నిర్మించగలుగుతున్నారు. నిర్జీవమైన గతం మళ్ళీ ఒకసారి సజీవమూ, వినగలిగినదీ అవుతోంది. ప్రాచీన శిథిలాలనూ, అక్కడి చిత్రాక్షరాలనూ పరిశీలించి చూసి విజ్ఞానశాస్త్రవేత్త భాషలేని యుగం గురించి మనకు తెలియజేయగలుగుతున్నాడు. మూలుగులు, గొణుగుడులు లేదా సౌజ్ఞల ద్వారా సమాచార పరివర్తన జరిగేది. ఒక విజ్ఞానవేత్త ఊహ – ఆయనకు ప్రాచీన దేవాలయానికి పై కప్పులు, ఆలయం చుట్టూ ఉద్యానవనాలు, తటాకాలు, ఫౌంటన్‌తో అందమైన రూపాన్నిచ్చే శక్తిని ఇస్తోంది. శిలాజాల శకలాలు – కళ్ళతో, కణజాలంతో, ఎముకలతో, కండరాలతో, నరాలతో పొదగబడుతున్నాయి. అవి మళ్ళీ లేచి నడుస్తున్నాయి. మాట్లాడుతున్నాయి. గతించిన గతం –

సజీవ వర్తమానం అవుతోంది. వాస్తవానికి ఊహలో కాలమో, దేశమో లేవని కనుగొన్నాం. మీ కల్పనాశక్తి ద్వారా మీరు సర్వకాలాలకూ అత్యంత స్ఫూర్తినిచ్చిన రచయితల నేస్తం కావచ్చు.

ఇటీవల నేను లాస్ యాంజెలిస్‌లోని విల్‌షైర్ ఎబెల్ థియేటర్‌లో మన ఆదివారం శ్రోతల కోసం రెవిరేషన్ ఒక అధ్యాయం గురించి ప్రసంగించాను. అంతకు ముందు రాత్రి కింద కనబరచిన పద్యం అంతరార్థం గురించి లోతుగా ఆలోచిస్తూ, ధ్యానంలో ఉన్నప్పుడు- అంతర్ దృష్టిలో వాస్తవంలోనే స్ఫూర్తిప్రదాయకమైన ఆ పద్యం రచించిన మార్మిక సాధువు నా పక్కనే ఉన్నట్టూ, ఆయనతో సన్నిహిత సాంగత్యం కలిగినట్టూ అనుభూతి పొందాను.

"ఇక జాన్ అయిన నేను పవిత్ర నగరాన్ని చూశాను. నూతన జెరూసలెం దేవుడి దగ్గరి దివినుంచి-భర్తకోసం అలంకరించబడిన వధువులా దిగిరావడం చూశాను. ఇంకా నేను స్వర్గం నుంచి, 'చూడండి దేవుడి పూజాస్థలం మనుషులతో ఉన్నాడు. ఆయన వారి మధ్యే ఉంటాడు. వారి దేవుడు అవుతాడు' అన్న మహాస్వరం విన్నాను." (రెవిలేషన్ 21 : 2, 2)

ఇప్పుడు మీరు మనసు గుండా ప్రవహిస్తున్న దేవుడి శాంతినదిని అంతర్గతంగా గ్రహించడానికీ, అనుభూతి పొందడానికీ మీ సొంత మనసు వసారాలో నడవలేరా? ఇప్పుడు మీరు ఆనందం, వినోదం, విశ్వాసం, సామరస్యం, ప్రేమ, సుహృద్భావం వంటి అద్భుతమైన అందమైన మనుషులు నివాసం ఉంటున్న మీ మనసు పవిత్రనగరంలో ఉంటున్నారు. మీ మనసు దేవుడు ప్రకాశించే అందంతో అలంకరించబడుతుంది; అందువల్ల మీ మనోస్థితి ఉద్దీపనం చెంది ఉత్తేజభరితం, ఉదాత్తమై దైవంలాగా రూపొందు తుంది. దేవుడినీ, మంచి వాటన్నిటినీ మీరు మానసికంగా, ఆధ్యాత్మికంగా పరిణయమాడతారు. మీరు వివాహ వస్త్రాభరణాలు ధరిస్తారు. అనంతంతో సుస్థిరంగా లయబద్ధం కావడంవల్ల దేవుడి నిత్య సత్య గుణాలు మీ

మనసును నింపుతాయి. మీ ఊహలో మీరు దేవుడి పూజాస్థలం అని గ్రహించి, అనుభూతి పొందగలుగుతారు. దేవుడి పవిత్ర ఆత్మ మీ శరీరం లోని ప్రతి అణువులోనూ వ్యాపించి, నిండడం మీకు తెలుస్తుంది. ఇప్పుడు మీ ఊహ దివ్యోన్మాదంతో ఆక్రమించబడుతుంది. దివ్య ప్రతిరక్షకం పొందాక, మీ హృదయ మందిరంలో దేవుడు కొలువుండడంతో మీరు దివ్యోన్మత్తులవుతారు.

మీరు ఒక బండను చూడవచ్చు. దివ్యమైన ఊహతో బండరాతిలో శాశ్వత సౌందర్యానందాలకు రూపమివ్వడానికి మడోన్నాను వెలికి తీసుకు రావచ్చు. ఎన్నడూ మీ ఊహను ప్రతికూలంగా ఉపయోగించడానికి అనుమతించకండి. దాన్ని ఎప్పుడుగాని ముక్క చెక్కలు చేసి మెలి తిప్పకండి. అనారోగ్యం, ప్రమాదాలు, నష్టాలు మొదలైనవాటి గురించి భావన చేసినట్టయితే మానసికంగా బద్ధలైపోతారు. అనారోగ్యాన్నీ, లేమినీ భావన చేయడం – మీ మనశ్శాంతినీ, ఆరోగ్యాన్నీ నాశనం చేస్తాయి.

ఓడ ప్రయాణం చేస్తున్నప్పుడు ఓసారి ఒక ప్రయాణీకుడు సూర్యాస్తమయాన్ని చూస్తూ ఆనందాతిరేకంతో, "ఆహా, చాలా సంతోషంగా ఉంది. అది అలాగే ఉండాలని ఆశిస్తున్నాను," అనడం విన్నాను.

మీరూ అందమైన సూర్యోదయాన్ని ఎన్నోసార్లు చూసి ఉంటారు. "ఇది ఇలాగే ఉండిపోతే ఎంత బావుణ్ణు!" అని మీరూ అనుకుని ఉండవచ్చు. మారుతూన్న ఈ తాత్కాలిక ప్రపంచంలో ఏదీ శాశ్వతంగా ఉండదు. అయితే, భగవత్ సత్యాలు ఎల్లప్పుడూ శాశ్వతంగా ఉంటాయి. రాత్రి వెంబడి చీకటి వస్తుంది. అయితే, మళ్ళీ ఉదయం వస్తుంది. ప్రాతఃసంధ్యా కాంతులు వెల్లివిరుస్తాయి. మీరు అన్నింటినీ అలాగే నిశ్చలంగా ఉండి పోవాలని కోరుకోరు. మీరూ ఒకేచోట స్థిరంగా ఉండిపోవాలని అనుకోరు. ఎందుకంటే లోపలా, వెలుపలా గెలువవలసిన నూతన ప్రపంచాలు చాలా ఉన్నాయి. నిరంతరమైన మార్పు ప్రాణికోటికి మూలాధారంగా ఉంటోంది.

మీరు కదలక మెదలక అలాగే ఉండిపోవాలనుకోరు. సమస్యలన్నవి మీనుంచి సమాధానాలు కోరే జీవితవిధానం. వాటిని అధిగమించడంలోనే, గెలుపొందడంలోనే గొప్ప ఆనందం, తృప్తి ఉన్నాయి. మార్పును ఆస్వాదించి అనుభవించలేదనుకుంటే జీవితం భరించ శక్యం కానిదిగా, కొనసాగించడం అసాధ్యమైనదిగా తయారవుతుంది. అన్నీ ఎల్లప్పుడూ ఒకే విధంగా మూస పోసినట్టు ఉన్నట్టయితే విసుగు కలుగుతుంది. రాత్రి–పగలు, చల్లదనం–వేడిమి, ఆటు–పోటు, వేసవి–శిశిరం, ఆశ–నిరాశ, నమ్మకం–అపనమ్మకం, గెలుపు–ఓటమి మీకు ఎదురవుతాయి. వీటన్నిటినీ మీరు చూడాలి, కలవాలి. వైరుధ్యాల మధ్య నడయాడుతూ ఉంటారు. మీకున్న ఊహించగల శక్తి ద్వారా మీరు కోరుకున్న వాటిని ఊహించుకుని వాటి వాస్తవాన్ని ఆత్మగతంగా అనుభూతి చెందడానికి వైరుధ్యాల మధ్య సామరస్యం ఏర్పరచుకుంటూ మనసుకు శాంతిని సమకూర్చుకోవాలి.

దుఃఖం, విషాదం, ప్రేమాస్పదులను కోల్పోవడం మొదలైన వాటి మధ్యనుంచి – మీ ఊహ, విశ్వాసం – పక్షి రెండు రెక్కల్లా, మిమ్మల్ని అలాగే మీ తండ్రి అయిన దేవుడి ఒడిలోకి తీసుకువెళతాయి. అక్కడే మీకు శాంతి ఓదార్పు, మీ ఆత్మకు దివ్య ఓదార్పు లభిస్తాయి!

మీ ఊహలో దేవుడి ముఖంలోకి లేదా దేవుడి సత్యంలోకి తిన్నగా చూడగలుగుతారు. దేవుడు మీ కన్నీటి బాష్పాలన్నిటినీ తుడుస్తాడు. ఆ తరవాత ఎలాంటి విలాపమూ ఉండదు. మానవ హృదయంలోని మంచు పొరలు, పొగమంచు తెరలు – దేవుడి ప్రేమ అనే సూర్యుడి వెలుతురులో కరిగిపోతాయి.

"ఇంకా, వారి కళ్ళలోని కన్నీటి బాష్పాలన్నిటినీ దేవుడు తుడిచి వేస్తాడు. ఆ తరవాత అక్కడ మరణం అంటూ ఉండదు. విషాదమో, విలపించడమో ఉండవు; అక్కడ బాధ అంటూ ఉండదు. ఎందుకంటే, అవన్నీ మటుమాయమైపోతాయి. చూడు, అన్నిటినీ నేను కొత్తవిగా చేస్తాను." (రెవిరేషన్ 4, 5)

రాత్రుల్లో చిమ్మచీకటి కమ్ముకున్నప్పుడు మీకు వెలుపలికి వెళ్లే దారి కనిపించదు; అంటే – మీ సమస్య అత్యంత జటిలంగా ఉన్నప్పుడు, మీ ఊహే మీ రక్షకుడు కావాలి.

'నేను నా కళ్ళను (ఊహను) కొండలకేసి పైకెత్తుతాను. అక్కడినుంచే నాకు సాయం వస్తుంది' (ప్రార్థనా గీతాలు 121 :1). కొండలు, అంతర్గత సానువులు – మీలోని దేవుడి ఉనికి. మీరు మార్గదర్శకత్వం, ప్రేరణ కోసం వెతికేప్పుడు, మీ చూపులను – 'అనంత మేధస్సు నాకు దారిచూపి నడిపిస్తుంది', లేదా 'దివ్యజ్ఞానం నా మనసులో ప్రవహించడంతో నేను పైనుంచి ప్రేరణ పొందుతాను' మొదలుగా గల దివ్య సత్యాల నక్షత్రాల మీద నిలపండి.

మీ లోపలే ఒక రూపశిల్పి, వాస్తుశిల్పి, నేతగాడు ఉన్నారు. వాళ్ళు మీలోనే ఉన్న మీ ఆలోచనలు, భావోద్వేగాలు, విశ్వాసాలను తీసుకుని వాటితోనే మీకు శాంతి లేదా అశాంతి, ఆరోగ్యం లేదా అనారోగ్యం సమకూర్చే జీవన విధానాన్ని రూపొందిస్తారు. వాటిని సరైన విధానంలో సరిదిద్దుతారు. మీకు మీరు వర్ణనాతీతమైన, మాటలకు అందని భగవద్విషయాలు సందర్శించగల మూడవ స్వర్గం దాకా తీసుకువెళ్ళే జీవితాన్నీ ఊహించుకోవచ్చు; లేదా ఛిద్రమైన, రోగగ్రస్తమైన ఊహను ఉపయోగించి హీనమైన అథోలోకాల లోతులలోకి మునిగిపోనూవచ్చు.

మనిషి దేవుడి పూజాస్థలం. మనిషి ఎంతగా లోతుల్లో మునిగిపోయినప్పటికీ ఫరవాలేదు. అతణ్ణి ఉద్ధరించే స్వాస్థ్య ఉనికి అతణ్ణి పైకి తీయడానికీ, సేవలు అందించడానికీ కాచుకుని ఉంటుంది. అది మనలోపలే మన పిలుపు కోసం నిరంతరం కాచుకుని ఉంటుంది. మీరు మీ వ్యాపార లావాదేవీలలోనూ, కార్యకలాపాలన్నిటిలోనూ మీ ఊహను అద్భుతంగా ఉపయోగించవచ్చు. ఎల్లప్పుడూ మీరు అవతలి వ్యక్తి స్థానంలో ఉన్నట్టు ఊహించుకోండి; అప్పుడు అది ఏంచెయ్యాలో మీకు చెబుతుంది. ఎదుటి

వ్యక్తి ఎలాంటి లక్షణాలను వ్యక్తీకరించాలని మీరు ఆశిస్తున్నారో అలాంటి సుగుణాలన్నిటినీ ఆ వ్యక్తి వ్యక్తీకరిస్తున్నట్టు భావించండి. అతడు ఎలా కనిపిస్తున్నాడో అలా కాకుండా మీరు ఎలా కనిపించాలని కోరుకుంటున్నారో అలా చూడండి. ఒకవేళ అతడు కటువుగా, ఎత్తిపొడుపుగా మాట్లాడుతూ మీకు వెగటు పుట్టిస్తూ వ్యతిరేకంగా ఉండవచ్చు. అతని మనసులో వమ్మయిన నమ్మకాలూ, ఆశాభంగాలూ, విషాదాలూ చాలా ఉండవచ్చు. మీరు అందమైన వాటినీ, మంచివాటినీ భావనచేసి, దేవుడి వస్త్రంతో అతణ్ణి కప్పండి. దేవుడి ఆదర్శాల ప్రపంచం, దేవుడి అనంత భావాలు ఏర్పడి, వెలుపలికి రావడానికి అతనిలో కాచుకుని ఉన్నాయి. కావాలంటే మీరు, "అతనిలో జన్మించడానికి దేవుడు వేచి ఉన్నాడు" అని చెప్పవచ్చు. మీరు తలుపు తెరిచి ఆ వ్యక్తి హృదయంలో దేవుడి ప్రేమాగ్నిని రగిలించవచ్చు. బహుశా మీరు రగిలించే కణిక దివ్యాగ్నిగా ప్రజ్వలించనూవచ్చు.

ప్రపంచంలోని చిత్రాలయాలన్నిటిలోకీ గొప్పవీ, సంపన్నమైనవీ – దేవుడి సత్యాలకూ, దివ్యసౌందర్యానికీ అంకితమైన మనోచిత్రాలయాలు. లియోనార్డో డావిన్సీ, తనకున్న వరమైన ఊహాశక్తి ద్వారా ఏసుక్రీస్తునూ, ఆయన పన్నెండుమంది శిష్యులనూ, వాళ్ళ స్వభావాలనూ ధ్యానించాడు. ప్రగాఢమైన పగటికల ద్వారా అతని ఊహ అతనిలోని అనంత సాగరం నుంచి నిర్దుష్టమైన చిత్రాలు జాలువారేలా చేసింది. అతని నిర్దుష్ట ఏకాగ్రత కారణంగా, అతని అంతర్నేత్రం అంతర్గత ప్రకాశంతో మెరిసింది. దాని ద్వారా ఆయన ప్రేరణ పొందాడు. అతని దివ్యభావన నుంచి వెలువడిన కళాఖండం: ఆఖరివిందు *(ది లాస్ట్ సప్పర్)*.

ఒక ప్రశాంతమైన సరోవరం దగ్గరికో, ఎత్తయిన కొండ శిఖరం మీదికో వెళ్ళారనుకోండి. అక్కడి చల్లటి ప్రశాంత గంభీర వాతావరణం, సరోవర ఉపరితలంలో ప్రతిబింబించే, ఆకాశంలో కనిపించే నక్షత్రాలను పరిశీలించండి. అదే విధంగానే ఆధ్యాత్మికవ్యక్తి ప్రశాంత హృదయంలో భగవంతుడి అంతర్గత జ్యోతులు, వివేకం ప్రతిబింబిస్తాయి.

జీవితంలో మీ ఆదర్శాన్ని చిత్రించుకోండి; ఆ ఆదర్శంతో జీవించండి. మీ ఆదర్శం మీ ఊహను ఆక్రమించుకోనివ్వండి; ఆదర్శం మీలో గగుర్పాటు కలిగించనివ్వండి. మీ మనసుమీద ఆధిపత్యం వహించే ఆదర్శం దిశకేసే మీరు కదులుతారు. జీవితలక్ష్యాలు – మనిషి మనసు ఎండబారిన ప్రదేశాల మీద కదులుతూ అతణ్ణి నిత్యనూతనం చేస్తూ శక్తిని నింపే స్వర్గ హిమ సమూహాల్లాంటివి.

తన ఊహను సత్యం వెలిగించి దేదీప్యమానం చేసినప్పుడు ప్రేరణ పొందిన రచయిత ఇలా రాశాడు:

> *అక్కడ ఒక నది, అందులోంచి శాఖోపశాఖలైన జీవనదులు*
> *భగవంతుడి నగరాన్ని, ఆ సర్వోన్నతుడి ప్రతిరూపాలు నివసించే*
> *పవిత్రస్థలాన్ని సంతోషపరుస్తాయి.* – ప్రార్థనా గీతం 46:4

మానసికంగా మిమ్మల్ని దేవుడికేసి వెనక్కు మళ్ళించి నడిపించగల ఊహే నది అని మీకు ఇప్పటికే తెలిసిపోయి ఉంటుంది. శాఖోపశాఖలైన నదులు అన్నవి మీ ఆలోచనలు, భావోద్వేగాలు, మీ నుంచి ప్రతిచోటా ఉన్న ప్రతి ఒక్కరికేసీ ప్రవహించే ప్రేమ, సుహృద్భావాలు. మామూలు మనిషి ప్రపంచంకేసి చూస్తాడు; అతడు రోగాన్నీ, గందరగోళాన్నీ, మనిషి మరో మనిషి పట్ల ప్రదర్శించే అమానుషత్వాన్నీ చూస్తాడు. క్రమశిక్షణాయుత ఊహాశక్తిగల మానవుడు పైకి కనిపించే వాటికి అతీతంగా, వాటికిపైగా తేలిపోతూ సమున్నతసూక్ష్మసామరస్యసూత్రాన్ని దర్శించగలుగుతాడు.

ఆ సూత్రం అన్నింటిగుండా లోపలా, వెలుపలా పనిచేస్తోంది. అతను తన దివ్య ఊహద్వారా – అన్నిటి నేపథ్యంలో శాశ్వతమైన ధార్మిక సూత్రం, ఎల్లప్పుడూ కట్టిపడేసే శాంతి, యావత్ విశ్వాన్ని ఆధిపత్యం చేసే ఎల్లలులేని ప్రేమ ఉందని తెలుసుకుంటాడు. ఈ సత్యాలు అతని హృదయం గుండా ప్రవహిస్తాయి. అవి దేవుడు, స్వర్గం అనే దివ్యార్థ భావనలో విశ్రమించడానికి,

ఊహ ద్వారా వెలుపలి తెరను తొలగించుకుని చొచ్చుకుపోయే శాశ్వత సత్యం నుంచి జన్మించినవి.

దేవుడి శిక్షణాశిబిరమైన ఊహలో ప్రేరణ పొందిన రచయిత – కాలం వసారా గుండా పయనించి, శాశ్వతంగా నిలబడగల సాటిలేని ఆధ్యాత్మిక రత్నాలను అందించాడు. ఇవి సున్నితమైన అందం, దివ్యభావనతో పాటు భగవంతుడి ఉనికిని హృద్యంగా తెలియజేయడంలో సాటిలేనివిగా ఉన్నాయి:

> *నీ మార్గాలన్నిటా నిన్ను సురక్షితంగా ఉంచడానికే, ఆయన తన దూతలకు నీమీది బాధ్యతలను అప్పగిస్తాడు.*
>
> – ప్రార్థనాగీతాలు 91:11

> *నేను ఉదయం రెక్కల మీద సముద్రం లోతైన అంతరాంతర భాగాలలో విహరిస్తున్నప్పుడు కూడా నీ చేయి నన్ను నడిపించనీ; నీ కుడిచేయి నన్ను పట్టుకోనీ!*
>
> – ప్రార్థనాగీతం 139

## అధ్యాయం రెండు

# వ్యాపారంలో సుప్తచేతనాత్మక మనసును ఉపయోగించుకోవడం

మన బైబిల్ ప్రచురింపబడిన కాలానికి చాలాపూర్వమే ప్రాచీన జ్ఞానం, "మనిషి తను భావించినట్టే, అనుకున్నట్టే రూపొందుతాడు," అని చెప్పింది. ఈ ప్రాచీన బోధన - కాలనిశీధిలో కనుమరుగై పోయింది; కాలగర్భంలో కలిసిపోయింది.

"మనిషి తన మనసులో ఆలోచించినట్టుగానే అతడు ఉంటాడు," అని బైబిల్ చెబుతోంది.

చాలా సంవత్సరాలకు పూర్వం చీనాదేశంలో సాధువులందరూ ఒక మహాసాధువు అధ్యక్షతన ఒకచోట సమావేశమయ్యారట. ఆనాడు పెచ్చరిల్లిన దురాక్రమణదారుల విధ్వంసకర దాడులనుంచి తమ ప్రాచీన జ్ఞానసంపదను పరిరక్షించుకోవడం ఎలా అన్నదే ఆ సమావేశ ప్రధాన చర్చనీయాంశం.

సాధువులనుంచి చాలా సూచనలు వచ్చాయి. ప్రాచీన రచనలను, చిహ్నాలను హిమాలయ పర్వతసానువుల మధ్య పాతిపెట్టమని కొందరు సూచించారు. మరికొందరు టిబెట్‌లోని మఠాలయాలలో ప్రాచీన జ్ఞానాన్ని దాచిపెట్టవచ్చని చెప్పారు. ఇంకా కొందరు భారతదేశంలోని పవిత్ర దేవాలయాలే, తమ దేవుడి గురించిన జ్ఞానసంపదను భద్రపరచడానికి అనువైన ప్రదేశాలు అని అభిప్రాయపడ్డారు.

చర్చ జరుగుతున్నంతసేపూ ప్రధాన సాధువు మౌనంగా విన్నాడు. సాధువులు చర్చలో ఉన్నప్పుడే ఆయన జోగుతూ నిద్రలోకి జారుకున్నాడు. కొంత సేపటికి గుర్రుపెట్టి నిద్రపోయాడు. సాధువులందరూ నిర్ఘాంత పోతూండగా కొంతసేపటికి సాధువు కళ్ళు తెరిచి, “టానో (దేవుడు) సమాధానమిచ్చాడు. మనం మనదేశంలో దివ్యకల్పనాశక్తితో ఆశీర్వదించ బడిన గొప్ప చిత్రకారులను రప్పించి మనం చేయాలనుకున్న దానిని గురించి చెప్పాలి. మనం వాళ్ళకు నిగూఢ సత్య రహస్యాలను తెలియజేద్దాం. వాటిని వారు అందమైన చిత్రాలుగా చిత్రీకరిస్తారు. ఆ విధంగా అపురూప సత్యాలు సర్వకాలాలలో శాశ్వతంగా నిలిచి ఉండి అసంఖ్యాక భావితరాలకు లభ్యమవుతాయి. ఆ గొప్ప సత్యాలకూ, శక్తులకూ, భగవత్ స్వభావాలకూ రూపమిచ్చి, చిత్రకారులు నాటకీయంగా పూర్తిచేశాక, వాటిని చిన్న చిత్రాల అట్టలుగా తయారుచేద్దాం. వాటితో వినోదక్రీడను రూపొందిద్దాం. పుట్టుకు వచ్చిన నూతన వినోద క్రీడ గురించి ప్రపంచానికి తెలియచెబుదాం. ప్రపంచంలోని ప్రజలందరూ దానిని అవకాశ క్రీడగా భావించి, ఈ సరళ మార్గం గుండా పవిత్ర బోధనలను పరిరక్షిస్తున్నామని తమకు తెలియకుండానే భావితరాలకు అందజేస్తారు,” అని వివరించాడు.

ఆయన ఇంకా, “పవిత్ర రచనలన్నీ నాశనమైపోయినప్పటికీ, వాటిని ఏ కాలంలోనైనా, సంకేత బోధనల ద్వారా పునరుజ్జీవింపచేసుకోవచ్చు,” అన్నాడట. మన పేకాట పుట్టుక ఇలాగే జరిగింది.

సమస్త ఆలోచనలకూ ఊహ–రూపురేఖలు సమకూరుస్తుంది. తమ దివ్యకళానైపుణ్యంతో చిత్రకారులు ఈ ఆలోచనలన్నిటికీ రూపాలనిచ్చారు. కల్పనాచర్య ద్వారా మీ ఆత్మ లోతులలో దాగి ఉన్నది రూపం సంతరించుకుని వెలువడుతుంది. మీలో నిక్షిప్తమై నిగూఢంగా ఉన్నదానికి మీ కల్పన ద్వారా ఆలోచనలతో రూపం ఇవ్వబడుతుంది. అంతకు ముందు బహిర్గతం కాని వాటిని గురించి దీర్ఘాలోచన చేస్తారు.

కొన్ని సరళమైన ఉదాహరణలు తీసుకుందాం : మీకు పెళ్ళి కాబోతున్నది అనుకుందాం. దాని గురించిన స్పష్టమైన, వాస్తవిక చిత్రాలు మీ మనసులో కదలాడుతాయి. మీ ఊహాశక్తితో పెళ్ళినీ, పెళ్ళిని జరిపించే పూజారినీ, ఇతరులనూ చూస్తారు. పూజారి నోటివెంట వెలువడే ప్రకటనలను, మాటలను మీరు వినగలుగుతారు. పుష్పాలంకరణలతో సహా చూస్తారు. పెళ్ళి సంగీతం కూడా వింటారు. మీ వేలికి ఉంగరం ఉన్నట్టు ఊహించు కుంటారు. నయాగరా జలపాతానికో, యూరపుకో హనీమూన్‌కు పయన మవుతారు. వీటన్నిటినీ మీ ఊహే ప్రదర్శించింది.

అదేవిధంగా గ్రాడ్యుయేషన్‌కి ముందు, మీ మనసులో అనేక అందమైన దృశ్యనాటకాలు ఆవిష్కృతమవుతాయి. మీ గ్రాడ్యుయేషన్ పట్టభద్రత ఆలోచనలన్నిటికీ రూపమిస్తారు. కాలేజీ ప్రొఫెసర్ లేదా ప్రెసిడెంట్ మీ డిప్లొమా ప్రదానం చేస్తారు. సహవిద్యార్థులందరూ మీలాగే గౌన్లు ధరించి ఉండడం చూస్తారు. మీ తల్లి లేదా తండ్రి; గర్ల్ ఫ్రెండ్ లేదా బాయ్ ఫ్రెండ్ మిమ్మల్ని అభినందించడం ఆనందంగా వింటారు. కౌగిలింత; ముద్దు అనుభూతి చెందుతారు; అవన్నీ నిజం, నాటకీయం, ఉద్వేగభరితం, అద్భుతం. శూన్యంలోంచి వచ్చినట్టు మీ మనసులోకి స్వేచ్ఛగా రూపాలు వచ్చాయి. అయితే, మీరు మీ మనసులో చూసిన రూపాలకు రూపకల్పన చేసి, ప్రాణం పోసి, కదలికలనూ, స్వరాలనూ అందించిన శక్తిమంతుడైన అంతర్గత సృష్టికర్త ఉన్నాడన్న విషయం మీకు తెలుసు; దాన్ని అంగీకరించక

తప్పదు. ఈ రూపాలు మీతో, "నీ కోసమే మేం జీవిస్తున్నాం", అని చెప్పాయి.

ఒక యువకుడు సైన్యం నుంచి తిరిగి రావడానికి ముందు, "మా తల్లిని స్పష్టంగా చూస్తున్నాను, ఆమె నాకు ఆప్యాయంగా స్వాగతం చెప్పడం, ఊహించగలుగుతున్నాను. పాత ఇంటిని చూస్తున్నాను. మా తండ్రి పైప్ పీలుస్తున్నాడు. నా చెల్లెలు కుక్కలకు ఆహారం పెడుతోంది. మా ఇంట్లోని ప్రతి మూలనూ, వస్తువునూ చూడగలుగుతున్నాను. మావాళ్ళ కంఠస్వరాలను కూడా వినగలుగుతున్నాను," అని చెప్పాడు.

ఈ స్పష్టమైన చిత్రాలన్నీ ఎక్కడినుంచి వస్తున్నాయి? మనిషిలో పితురార్జిత వివేకం ఉందని కీట్స్ చెప్పాడు. మనం మనసారా కోరుకున్నట్టయితే ఆ పరిపక్వత పొందిన స్వర్గమధువును సేవించవచ్చు.

మీలో ఉన్న ఆత్మ లేదా దేవుడే ఊహకు అసలు సిసలైన మూలాధారం. ఒకసారి నేను లండన్‌లో ఒక పరీక్షకు హాజరయ్యాను. ప్రశ్నాపత్రంలోని ఒక ముఖ్యమైన ప్రశ్నకు నాకు సమాధానం తెలియలేదు. నేను నింపాదిగా ప్రశాంతంగా, మనసును సడలించుకుని 'దేవుడే నాకు సమాధానం తెలియ జేస్తాడు' అని ధ్యానించాను. అదే సమయంలో నాకు తెలిసిన సులభమైన ప్రశ్నలకు సమాధానాలు రాస్తూ వచ్చాను.

చేతనాత్మక మనసును సడలించినప్పుడు ఆత్మగత వివేకం ఉపరితలానికి వస్తుందని మనకు తెలుసు. కొంతసేపటికల్లా సమాధానరూపం స్పష్టంగా నా మనసులోకి వచ్చింది. పుస్తకం పుటలో అక్షరాల్లా, పూర్తి సమాధానం మనసులో గ్రాఫ్‌లాగా రాయబడి ఉంది. నా చేతనాత్మక మనసు లేదా మేధస్సుకన్నా శక్తివంతమైన జ్ఞానం నా ద్వారా మాట్లాడింది.

ప్రగాఢమైన మతవిశ్వాసం గల 14 యేళ్ళ విద్యార్థి ఒకడు తరచూ నావద్దకు వచ్చేవాడు. అతడు ఏదైనా సమస్య ఎదురైనప్పుడల్లా – ఏసుక్రీస్తు తనతో మాట్లాడుతున్నట్టూ, తన సమస్యకు పరిష్కారం తెలియజేసి, ఏం

చెయ్యాలో చెబుతున్నట్టూ ఊహించుకునేవాడట. ఒకసారి అతని తల్లికి జబ్బు చేసింది. ఆ కుర్రాడు ఉన్నతమైన ఊహాశక్తి కలిగినవాడు. జ్వరంతో బాధపడుతున్న ఒక పేదరాలిని ఏసుక్రీస్తు కాపాడిన ఉదంతాన్ని అతడు అంతకుముందే చదివి ఉన్నాడు. ఆ యువకుడు నాతో, "గత రాత్రి ఏసుక్రీస్తు నాతో, 'నువ్వు నీ మార్గంలోనే పయనించు. నీ తల్లికి పరిపూర్ణ స్వస్థత సమకూరుతుంది!' అని చెబుతున్నట్టు ఊహించి భావించాను," అన్నాడు. తన నమ్మకం, విశ్వాసం కారణంగా ఆత్మగతంగా విన్న సత్యాన్ని, ఆ మనోనాటకాన్ని ఎంతో వాస్తవంగానూ, స్పష్టంగానూ, ప్రగాఢంగానూ రూపొందించాడు.

అప్పటివరకు, ఇక ఎలాంటి వైద్యంవల్లా ప్రయోజనం లేదు; నయమవుతుందనే నమ్మకం లేదు, అని భావించబడ్డ స్థితిలో ఉన్న అతని తల్లి జబ్బు పూర్తిగా నయమయింది.

మనోసూత్రాల విద్యార్థులుగా అసలు ఏం జరిగిందో మీకు తెలుసు. అతడు తన ఊహతో భావోద్వేగంలోకి విద్యుత్తులా ప్రసరించి దాంతో మమేకమయ్యాడు. అతని విశ్వాసం, నమ్మకం ప్రకారం అది అతనికి జరిగింది. ఉన్నది ఒకే ఒక మనసు; ఒకే ఒక నయం చేసే సమక్షం. తన తల్లి అనారోగ్య స్థితిని గురించిన నమ్మకాన్ని మార్చుకుని, ఆమె సంపూర్ణ ఆరోగ్యవంతురాలని భావించడం వల్ల – ఏకకాలంలో పరిపూర్ణ ఆరోగ్యమనే ఆలోచన ఆమె మనసులో పునరుజ్జీవం పొందింది. ఆధ్యాత్మికంగా నయం చేయడం గురించి గానీ, ఊహకుగల శక్తిని గురించి కానీ ఆ యువకుడికి తెలియదు. అయినా, తనకు తెలియకుండానే అతడు ఆ సూత్రం పనిచేసేలా చేయగలిగాడు. తను ఏసుక్రీస్తుతో మాట్లాడుతున్నట్టు తన మనసులో పూర్తిగా విశ్వసించాడు. అతని విశ్వాసం ప్రకారం అతనికి అది జరిగింది.

ఒక విషయాన్ని విశ్వసించడం అంటే అది వాస్తవం అని అంగీకరించడం. పదహారవ శతాబ్దంలో పారాసెల్సస్, 'మీ విశ్వాసం యొక్క విషయం

నిజమైనా, అబద్ధమైనా, మీరు ఒకే విధమైన ఫలితాన్ని పొందుతారు' అన్నాడు. ఉన్నది ఒకే ఒక ఆధ్యాత్మిక, నయం చేసే సూత్రం. ఒకే ఒక నయం చేసే ప్రక్రియ. అదే విశ్వాసం. 'నీ విశ్వాసం ప్రకారం అది నీకు జరుగుతుంది.' నయం చేసే ప్రక్రియలు, విధానాలు, పద్ధతులు చాలా ఉన్నాయి. వాటన్నిటికీ ఫలితాలు లభిస్తాయి. ఒక నిర్దిష్ట పద్ధతి, విధానంవల్ల కాదు కాని ఒకే ఒక నిర్దిష్ట ప్రక్రియపట్ల భావన, విశ్వాసం కారణంగా. అవన్నీ కూడా ఏకైక వనరు అయిన దేవుడి తలుపు తడుతున్నాయి. దేవుణ్ణి ఆశ్రయిస్తున్నాయి. స్వస్థత సమకూర్చే అనంత ఉనికి, సమక్షం అన్నింటిలోకీ చొచ్చుకుపోయి వ్యాపించి ఉన్నది. అది సర్వవ్యాపకమైనది.

వూడూ వైద్యుడు తన మంత్రాల ఉచ్ఛారణతో ఫలితాలు పొందగలుగు తున్నాడు. హవాయ్ కహూనా తన నమ్మించే హావభావాలతోనూ, న్యూథాట్ వివిధ శాఖలు, క్రిస్టియన్ సైన్స్ – నాన్సీ స్కూల్ ఆఫ్ మెడిసిన్, ఆస్టియోపథీ మొదలైనవన్నీ కూడా అలాంటి పనులే చేస్తున్నాయి. ఈ ఆలోచనా విధానాలన్నీ కూడా మంచి చేస్తున్న చేతనావస్థను కలుసుకునే వివిధ స్థాయిలు.

మనిషి బాధలనూ, విషాదాలనూ, దుఃఖాలనూ పోగొట్టే ఏ విధానమైనా, ప్రక్రియ అయినా మంచిదే. చాలా చర్చిలు చేతులు ఉంచే విధానాన్ని అవలంబిస్తున్నాయి. ఇతరమైనవి మొక్కుబడులతో దేవాలయాలను సందర్శిస్తాయి; అన్నీ కూడా తమ తమ మానసిక అంగీకారం లేదా విశ్వాసాన్ని బట్టి లబ్ధి పొందుతున్నాయి.

మీరు దేవుడి సమక్షంలో ఒంటరిగా నిలబడాలని దృఢంగా సంకల్పించి నప్పుడు 'అంటే – బాహ్య వస్తువులకు, విషయాలకు శక్తినివ్వడం పూర్తిగా మానుకుని, జరుగుతూన్న ప్రపంచానికి అంటే – పర్యవసానాల ప్రపంచాన్నే కారణం చేయడం మానుకున్నప్పుడు' అది జరుగుతుంది. మీ సంపూర్ణ సహకారాన్ని మీలో ఉన్న ఆధ్యాత్మికశక్తికి అందించినప్పుడు ఉన్నది అదొక్కటే,

ఏకైక కారణం అని తెలుసుకున్నప్పుడు మీకు ఆపైన ఏ రకమైన ఆధారం అవసరమూ ఉండదు. మీ శరీరాన్ని రూపొందించిన సజీవ మేధస్సు మీ విశ్వాసానికీ, అవగాహనకూ వెంటనే స్పందిస్తుంది; మీకు తక్షణమే ఆధ్యాత్మిక స్వస్థత సమకూరుతుంది. ప్రార్థన ద్వారా దంతాన్ని పెంచుకోగల చేతనాస్థితి స్థాయిలో లేనప్పుడు, వెళ్ళి దంతవైద్యుణ్ణి సంప్రదించడమే ఏకైక మార్గం. ఆయన కోసమూ, నిర్దుష్టమైన దైవిక దంత పరిరక్షణ కోసమూ ప్రార్థించండి. మీరు బాహ్యాకారణాలను విశ్వసించినంతకాలం, బాహ్యా నివారణామార్గాలనే అన్వేషిస్తారు.

ఊహకు గల శక్తిని మరికాస్త విపులీకరించడానికి, క్షయవ్యాధితో బాధింపబడ్డ మా దగ్గరి బంధువును గురించి చెబుతాను. ఆయన ఊపిరి తిత్తులు దారుణంగా రోగగ్రస్తమయ్యాయి. ఆయన కుమారుడు ఆయన వ్యాధిని నయం చేయాలనుకున్నాడు. తండ్రి ఉంటూన్న పశ్చిమ ఆస్ట్రేలియా పెర్త్ ఇంటికి తిరిగి వచ్చాడు. రాగానే తాను ఒక సన్యాసిని చూశాననీ, ఆయన తనకు అసలైన శిలువ ముక్కను ఇచ్చాడనీ, అందుకు ఆయనకు 500 డాలర్లకు సమానమైన పైకం చెల్లించాననీ తన తండ్రికి చెప్పాడు. (ఈ యువకుడు దారిపక్కన పడివున్న ఒక చెక్కముక్కను తీసుకుని ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారుడి వద్దకు వెళ్ళి ఒక ఉంగరంలో అసలైన శిలువ చెక్కముక్కలా కనిపించే విధంగా పొదిగించుకున్నాడు.) ఉంగరాన్నీ, అందు లోని శిలువ ముక్కనూ స్పృశించడం ద్వారా చాలా మందికి అనేక వ్యాధులు నయమయ్యాయనీ, వాళ్ళు పరిపూర్ణ ఆరోగ్యవంతులయ్యారనీ తండ్రికి చెప్పాడు. అతని ఊహను రగిలించి ప్రజ్వరిల్లేలా చేశాడు. దాంతో ఆ వృద్ధుడు కొడుకు చేతిలోని ఉంగరాన్ని లాక్కుని, తన రొమ్ము మీద ఉంచుకుని, మౌనంగా ప్రార్థిస్తూ నిద్రపోయాడు. తెల్లవారేసరికి వ్యాధి నయమై మామూలుగా లేచి కూర్చున్నాడు. ఆ తరవాత చేయించిన వైద్య పరీక్షలన్నీ వ్యాధిలేనట్టు నెగెటివ్‌గా వచ్చాయి.

దారిపక్కన దొరికిన చెక్కముక్క అతనికి స్వస్థత సమకూర్చలేదని మీకు తెలిసే ఉంటుంది. సాంద్రతర స్థాయికి తట్టి లేపబడిన ఆయన ఊహ, నిర్దుష్ట స్వస్థత లభిస్తుందన్న విశ్వాసపూరితమైన ఎదురుచూపే అతనికి స్వస్థత సమకూర్చాయి. ఊహ, విశ్వాసంతో లేదా మనోగత భావోద్వేగంతో కలిసింది. ఈ రెండింటి సంగమం స్వస్థతను సమకూర్చింది. తన కొడుకు చేసిన తంత్రపూర్వకమైన ఉపాయం ఆయనకు తెలియదు; తెలిసిపోయి ఉన్నట్టయితే వ్యాధి మళ్ళీ తిరగబెట్టి ఉండేదేమో. పరిపూర్ణంగా నయం చేయబడిన ఆయన ఆ తరవాత పదిహేను సంవత్సరాలు జీవించి, తన 89వ యేట కాలధర్మం చెందాడు.

ఇక్కడ లాస్‌ఏంజెలిస్‌లో తన రంగంలో శిఖరాగ్రం చేరుకున్న ఒక వ్యాపారి నాకు తెలుసు. గత ముప్ఫైయేళ్ళుగా అతడు తీసుకుంటూన్న చాలా ముఖ్యమైన నిర్ణయాలన్నీ, పాల్‌తో జరిపిన ఊహాత్మక సంభాషణల ఆధారంగా తీసుకున్నవే అని నాతో చెప్పాడు. దాన్ని మరికాస్త వివరించమని అడిగాను. వాణిజ్య ప్రపంచంలో కొందరు వర్తక ప్రముఖులు, బైబిల్‌కు సంబంధించిన గొప్ప సాధువులతోనూ, రచయితలతోనూ తమ ఊహద్వారా జరిపే నాటకీయ సంభాషణల ద్వారా అద్భుతమైన మార్గదర్శకత్వం, సలహా పొందవచ్చని అనుభవపూర్వకంగా గ్రహించినట్టు అతడు చెప్పాడు.

విజయవంతమైన ఆ కార్యనిర్వహణాధికారి మాటలను సాధ్యమైనంత మేరకు యథాతథంగా ఇక్కడ పొందుపరుస్తున్నాను: "నా నిర్ణయాలు చాలాసార్లు కంపెనీ అభివృద్ధికీ, మరి కొన్నిసార్లు, నష్టాలకూ దివాలాకూ దారి తీస్తూ వచ్చాయి. దెబ్బతిన్నప్పుడు నేను డోలాయమాన స్థితిలో పడి, తీవ్రమైన నెత్తురు పోటుకూ, గుండె జబ్బులకూ లోను కావలసి వచ్చింది. ఉన్నట్టుండి ఒక రోజు నాలో ఈ ఆలోచన : నేనెందుకు ఏసుక్రీస్తునుగాని, పాల్‌ని గాని ఈ విషయంగా సంప్రదించకూడదు? ఎపిజల్స్ ఆఫ్ పాల్ అంటే నాకు ఎంతో అభిమానం. అందువల్ల ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకోవలసి వచ్చినప్పుడు, పాల్ నాతో ఇలా చెబుతున్నట్టు ఊహించుకునే

వాణ్ణి : 'నీ నిర్ణయం నిర్దుష్టమైనది. అది నీ సంస్థను ఆశీర్వదిస్తుంది. నిన్ను ఆశీర్వదిస్తుంది బిడ్డా! దేవుడి మార్గంలో పయనం కొనసాగించు!'. ఇలా ఊహించుకున్నప్పుడు పాల్‌ను నేను చూశాను. ఆయన కంఠస్వరం విన్నాను. శాంతి, అంతర్గత నైశ్చల్య తరంగం నన్ను ఆవహించేది. అట్టి నిర్ణయాల గురించీ ప్రశాంత చిత్తంతో ఉండేవాణ్ణి."

తను చేపట్టినది సరైన చర్యే అని తన్ను తాను నమ్మించడానికి ఈ వ్యాపారవేత్త తన ఊహను ఉపయోగించి దివ్యమార్గదర్శకత్వం పొందే విధానం ఇదే. ఈ ప్రపంచంలో ఒకే ఒక మేధోసిద్ధాంతం ఉంటోంది; అందుకు అవసరమైనదంతా ఒక్కటే. 'దేవుడు నాకు ఇప్పుడు మార్గం చూపుతున్నాడు. నా జీవితంలో ఒక్క సరైన చర్య మాత్రమే ఉంది' అని చెప్పడం, విశ్వసించడమే అది.

ట్రోవార్డ్ మీకు చెబుతున్నట్టు, మనసు సిలోగిజం లాగా పనిచేస్తుంది. మీ ఆధార వాక్యం సరైనదైతే దాని ముగింపు, ఫలితం కూడా తదనుగుణం గానే ఉంటుంది. ఆత్మగత కారణాలు అందులోంచే వస్తాయి. దాని తదుపరి ఫలితం ఎల్లప్పుడూ ఆధార వాక్యానికి అనుసరణగా సామరస్యంగానే ఉంటుంది. మీ మనసులో సరైన ఆధార వాక్యాన్ని పాదుకొల్పండి; మీరు మంచి చర్యకు ఆత్మగతంగా నిర్బంధించబడతారు. మనసు అంతర్గత చలనమే చర్య. బాహ్యచలనాలు, చర్యలు – మనసు అంతర్గత చలనానికి శరీరం నుంచి తామంతట వెలువడే స్పందనలు. మీ మిత్రుడు లేదా సహోద్యోగి మీ అద్భుతమైన నిర్ణయాన్ని ప్రశంసించి అభినందించే స్వరాన్ని వినడం– మీ జీవితంలో మంచి చర్యకు మీలో చలనం పుట్టిస్తుంది.

తన మనసును సరైన చర్య విశ్వాసంతో నింపడానికి సెయింట్ పాల్‌ను ఉపయోగించుకున్న వ్యక్తి, ఏకైక శాశ్వత మేధోసిద్ధాంతాన్ని వినియోగించాడు. తన మనసులో ఆ స్థలానికి చేరుకోవడానికి అవలంబించిన ఉపాయం పెద్ద విషయం కాదు.

కష్టాలు, సంధిగ్ధ పరిస్థితులు ఎదురైనప్పుడు గెథే తన ఊహను తెలివిగా ఉపయోగించుకునేవాడు. అలాంటి సందర్భాలలో ఆయన గంటల తరబడి మౌనంగా ఊహాత్మక సంభాషణలు జరిపేవాడని ఆయన జీవిత చరిత్ర రాసినవారు చెబుతారు. తన మిత్రులలో ఒకరు ఎదుట కుర్చీలో కూర్చుని తనకు సమాధానాలు ఇస్తున్నట్టు ఊహించడం ఆయన అలవాటు. మరోలా చెప్పాలంటే ఆయన ఏదైనా ఒక సమస్యను గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు అంటే అతని స్నేహితుడు ఎదుట కూర్చుని చేతులు ఆడిస్తూ, హావభావాలతో, అనువైన కంఠస్వరంతో సరైన పరిష్కార మార్గాలు సూచిస్తున్నట్టు ఊహాత్మక దృశ్యాన్ని వాస్తవమా అన్నంతగా సాధ్యమైనంత స్పష్టంగా  ఊహించుకునేవాడు.

న్యూయార్క్ నగరంలో నేను బాగా ఎరిగిన ఒక స్టాక్ బ్రోకర్ ఉండేవాడు; అక్కడి సైన్‌వే హాల్‌లో నేను నిర్వహించే తరగతులకు హాజరయ్యేవాడు. అతడు ఆర్థిక సమస్యలను పరిష్కరించుకునే పద్ధతి చాలా సరళమైనది. అతడు మనసులోనే కోటీశ్వరుడైన బ్యాంకర్ ఫ్రెండ్‌తో ఊహా సంభాషణలు జరిపేవాడు. ఆయన ఇతణ్ణీ, ఇతడి తెలివైన నిర్ణయాలనూ అభినందించేవాడు. రైట్ స్టాక్స్ కొనుగోలు చేసినందుకు మెచ్చుకునేవాడు. ఈ ఊహాత్మక సంభాషణలను అవి తన మనసులో విశ్వరూపంతో స్థిరపడేంత వరకు స్టాక్ బ్రోకర్ నాటకీయంగా కొనసాగించేవాడు.

ఊస్‌పిన్‌స్కై విద్యార్థి మిస్టర్ నికోల్స్, "అంతర్గతంగా మీలో సాగే మాటలను వీక్షించండి. అవి మీ ఉద్దేశంతో అంగీకరించనివ్వండి," అని తరచూ  చెప్పేవాడు.

ఈ బ్రోకర్ అంతర్గతంగా వినిపింపజేసే మాటలు, ఉపన్యాసం – ఆయన తనకూ, తన ఖాతాదారులకూ మంచి పెట్టుబడులు పెట్టే ఆయన ఉద్దేశాన్ని తప్పక అంగీకరించేవి. తన తెలివైన సలహాలతో, ఇతరులు బాగా డబ్బు సంపాదించేలా చూడడం, ఆర్థికంగా వాళ్ళు కూడా అభివృద్ధి

చెందడమే తన వ్యాపార జీవిత ప్రధాన ఉద్దేశం అని ఆయన నాతో చెప్పేవాడు. దీని ద్వారా అతడు మనోసూత్రాలను నిర్మాణాత్మకంగా ఉపయోగించుకుంటున్నాడన్నది తేటతెల్లం.

ప్రార్థన ఒక అలవాటు. ఈ బ్రోకర్ ఒక రోజులో క్రమబద్ధంగా నిర్ణీత సమయాలలో తన మనసులోని బింబం కేసి తిరిగి వచ్చేవాడు. దాన్ని అతడు ప్రగాఢ ఆత్మాశ్రయ విధానంగా తయారుచేశాడు. ఆత్మగతంగా రూపం దాల్చినవి, క్రమంగా వస్తుగతంగా అభివ్యక్తమయ్యేవి. అది మనోకుహరంలో అభివృద్ధి చెందిన సుస్థిర మానసిక చలనచిత్రం. తరచూ మీ మానసిక చలన చిత్రాన్ని ప్రదర్శించుకోండి. అది మీ మనోయవనిక మీద తరచూ ప్రజ్వలించేలా చూసుకోండి. క్రమక్రమంగా అది తప్పనిసరి అలవాటు విధానంగా రూపొందుతుంది. మీరు మీ మనోనేత్రంతో తిలకించే అంతర్గత చలనచిత్రం వెలుపల బాహాటంగా రూపం దాల్చుతుంది. 'అతడు లేనివాటిని అప్పటికే ఉన్నట్టు పిలుస్తాడు; అదృశ్యంగా ఉన్నవి దృశ్యమానమవుతాయి. కనిపించనివి కనిపిస్తాయి.'

తాము ఊహించినవి నిజమని భావోద్వేగం చెందినవన్నీ, జరిగి తీరుతాయన్న నమ్మకంతోనే చాలామంది – తమ సందిగ్ధావస్థలను, సమస్యలను తమ ఊహలను ఉపయోగించే పరిష్కరించుకుంటారు.

కొంతకాలం క్రితం ఒక యువతి, ఒకానొక సంక్లిష్టమైన వ్యాజ్యంలో ఇరుక్కుని ఐదేళ్ళపాటు బయటపడలేకపోయింది. వాయిదా తరవాత వాయిదా తప్ప ఎంతకూ పరిష్కారం కనిపించడం లేదు. పరిష్కారానికి నేనొక సూచన చేశాను. ఆమె దానిని అలాగే అమలు చేసింది. ఆ సూచన ప్రకారం ఆమె తనకు సాధ్యమైనంత స్పష్టంగా, ఫలితం గురించి న్యాయవాదితో సజీవ సంభాషణను నాటకీయం చేసింది. ఆమె అతణ్ణి కొన్ని ప్రశ్నలు అడుగుతుంది. వాటికి అతడు సరైన సమాధానాలు ఇస్తాడు. ఆ తరవాత ఆమె మొత్తం మాటలను, యేళ్ళ కిందట ఫ్రెంచి స్కూల్ ఆఫ్ థెరపిటిక్స్

సూచించిన విధంగా ఒక్క చిన్న మాటలో క్లుప్తీకరించింది. ఆ మాటను న్యాయవాది ఆమెతో మళ్ళీ మళ్ళీ చెబుతూ ఉండాలి. ఆమె చెప్పిన మాట ఇది: "నిర్దుష్టమైన సామరస్య పరిష్కారం లభించింది. మొత్తం వ్యాజ్యం న్యాయస్థానానికి వెలుపల పరిష్కరించబడింది."

తనకు సమయం దొరికినప్పుడల్లా ఆమె ఆ మానసిక చిత్రం కేసి చూడసాగింది. రెస్టారెంట్‌లో కాఫీ కోసం వేచి ఉన్నప్పుడు, ఆ మానసిక చిత్రాన్ని సైగలు, స్వరాలు, శబ్దపరికరంతో సహా నడిపించి తిలకించేది. ఆమె న్యాయవాది కంఠస్వరాన్నీ, చిరునవ్వునూ, హావభావాలనూ సులభంగా ఊహించుకో గలిగేది. ఆ చిత్రం తన ఆత్మగత విధానంగా, క్రమబద్ధంగా నడిచేంతవరకు, ఆ చిత్రం ఆమె మనసులో పదే పదే కదలాడసాగింది. అది ఆమె మనసులో లిఖించబడింది; లేదా బైబిల్ చెప్పే విధంగా అది ఆమె హృదయంలో లిఖించబడి, అంతర్భాగాలలో చెక్కబడింది. ఆమె అంతిమ నిర్ణయం – "ఇది దేవుడి చర్య. అంటే – సర్వతోముఖ సామరస్యం, శాంతి." (సామరస్యం దేవుడిది. చట్ట వ్యాజ్యంలో మీకు కావలసింది సామరస్య పూర్వకమైన పరిష్కారం.)

ఊహావిజ్ఞానశాస్త్రంలో మీరు మొట్టమొదట మీ ఊహకు క్రమశిక్షణ నివ్వడం ప్రారంభించాలి. దాన్ని అటూఇటూ పరిగెత్తనివ్వకూడదు. విజ్ఞాన శాస్త్రం స్వచ్ఛతను కోరుకుంటుంది. నైర్మల్యాన్ని నొక్కి వక్కాణిస్తుంది. మీకు రసాయనికంగా స్వచ్ఛమైన ఉత్పాదన కావాలంటే, మొదట అందులోని ఇతరమైన వాటిని, అదనంగా ఉన్న ద్రవ్యాలను తొలగించాలి. అంటే, అనవసరమైన వాటిని కచ్చితంగా వేరుగా విడదీసి దూరంగా గిరవాటెయ్యాలి.

ఊహావిజ్ఞానశాస్త్రంలో భయం, ఆందోళన, వినాశకర స్వగతం, స్వీయఖండన, అనేకానేక ప్రతికూలాల కలయిక మొదలుగాగల మానసిక మలినాలన్నిటినీ తొలగించుకోవాలి. మీ ధ్యాసనంతా మీ లక్ష్యం మీదే కేంద్రీకృతం చేసి – మీ జీవిత లక్ష్యం నుంచి, ఉద్దేశం నుంచి కించిత్తు

వైదొలగడానికి సైతం విముఖత చూపాలి.

మీ ఆదర్శాన్ని మనసారా ప్రేమిస్తూ, దానికి విశ్వాసపాత్రంగా ఉండడం ద్వారా మీ ఆదర్శ వాస్తవికతలోకి మీరు మానసికంగా పీల్చుకోబడతారు. అప్పుడే మీ కోరిక మీ ప్రపంచంలో రూపం సంతరించుకోవడం చూడగలుగుతారు. జోషువా గ్రంథం 'మీరు ఎవరిని సేవించాలో ఈ రోజే ఎంపిక చేసుకోండి' అని చెబుతోంది.

మీ ఎంపిక 'నేను అందమైన వాటినీ, మంచి వాటినీ మాత్రమే ఊహించుకుంటాను' గానే ఉండాలి.

తమకు దేవుడిచ్చిన శక్తి సామర్థ్యాలను దారుణంగా తల్లకిందులుగా ఉపయోగించే పలువురు నాకు తెలుసు. వారితో మాట్లాడాను. తన కుమారుడు జానీ ఇంటికి రావడం కొద్దిగా ఆలస్యమయిందంటే చాలు, అతని తల్లి మనసు ఏదో జరగకూడనిది జరిగిపోయినట్టు ఊహించు కుంటుంది. ఆమె మనసులో ప్రమాదం, ఆస్పత్రి, ఆపరేషన్ థియేటర్‌లో జానీ అన్నంత దాకా అలా అలా పయనిస్తుంది.

ఒక వ్యాపారి ఉన్నాడు. ఆయన వ్యాపారం చక్కగా జరుగుతూ అభివృద్ధి చెందుతోంది. అయినా, అతను ఎల్లప్పుడూ ప్రతికూల ఆలోచనలతోనే గడుపుతూ ఉంటాడు. ఊహను వినాశకరంగా ఉపయోగించుకోవడానికి ఇదొక ఉదాహరణ. ఆఫీసు నుంచి ఇంటికి వచ్చీ రాగానే, తన మనసులో ఓటమి చలనచిత్రాన్ని ప్రదర్శించుకోవడం ఆరంభిస్తాడు. బీరువాలన్నీ ఖాళీగా ఉన్నట్టూ, తన వ్యాపారం దివాలా తీసినట్టూ, బ్యాంక్ బ్యాలన్స్ ఖాళీ అయినట్టూ ఊహించుకుంటాడు. వ్యాపారం మూతబడిందని అనుకుంటాడు... అయినా వాస్తవంలో వ్యాపారం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. అతడి ప్రతికూల మనోచిత్రంలో ఎలాంటి వాస్తవమూ లేదు. అది తనకుతానుగా అల్లుకున్న అబద్ధం. అంతే. అతను భయపడేవి అతని అతీతమైన ఊహలో సేకరించబడడం లేదు. స్పష్టమైన ఊహలో సుస్థిరంగా

సంరక్షింపబడి లేవు. అలాంటప్పుడు ఓటమి అన్నది రాదు. అతడు నిర్విరామంగా ఆ మనోచిత్రంతో గడిపినట్టయితే, ఒకవేళ ఓటమి అటుకేసి రావచ్చు. అక్కడ కూడా ఓటమినిగాని, గెలుపునుగాని అతడు ఎంపిక చేసుకోవచ్చు. అయితే, అతడు ఓటమినే ఎంపిక చేసుకుంటాడు.

కొందరు సుదీర్ఘంగా బాధాకరమైన వాటిని మాత్రమే తలుచుకుంటూ ఉంటారు. ఇలాంటి వాళ్ళు మంచినీ, సంతోషకరమైన వాటినీ, ఇష్టమైన వాటినీ అసలు ఊహించుకోరు. ఎల్లప్పుడూ ఏదో చెడూ, వినాశం ముంచుకు రానున్నట్టూ అది తమకు తెలిసినట్టూ ఉంటారు. ఏదైనా మంచి జరుగుతుందనీ, జరగబోతోందనీ చెప్పడానికి వారికి ఒక్క కారణం కనిపించదు. అయితే, ఏదో దారుణం, చెడూ వాటిల్లబోతోందని చెప్పడానికి మాత్రం సకల కారణాలతో సంసిద్ధంగా ఉంటారు.

ఎందుకిలా జరుగుతుంది? కారణం చాలా సరళం: ఇలాంటి మనుషులు స్వతహాగానే ప్రతికూల మనస్తత్వం కలిగినవారు. వారి ఆలోచనలు చాలావరకు ప్రతికూలంగానూ, గందరగోళంగానూ, వినాశకరంగానూ, ఛిద్రస్వభావంతోనూ ఉంటాయి. ఈ ప్రతికూల ఆలోచనా విధానానికి అలవాటుపడడంతో, వారు తమ సుప్తచేతనాత్మక మనసును ప్రతికూలంగా ప్రభావితం చేస్తారు. వారి ప్రబల మనోస్థితులు, భావోద్వేగాలచేత వారి ఊహలు కట్టడి చేయబడతాయి. అందువల్లే, వారు తమకు ఎంతో ప్రియమైన వారి గురించి సైతం చెడునే ఊహించుకుంటారు.

ఉదాహరణకు అలాంటి వారి అబ్బాయి ఒకడు సైన్యంలో ఉన్నాడనుకుందాం. వాడికి జలుబు చేస్తుందనీ, మద్యానికి బానిస అవుతాడనీ; నైతికంగా పతనమైపోతాడనీ; అతడు ఎదురుదాడిలో ఉన్నట్టయితే కాల్చబడతాడనీ – ఇలా అన్నీ వినాశకర ఆలోచనలే వారి మనసును ఆక్రమిస్తాయి. అలవాటుకు మనసుమీద ఉన్న మనోవశ్యం చేసే స్వభావం కారణంగా ఇలా జరుగుతుంది. వారి ప్రార్థనలు చెల్లుబాటుకాని డొల్లలుగా నిష్ప్రయోజనమవుతాయి.

ఇప్పుడు ఎంపిక చేసుకోండి! నిర్మాణాత్మకంగానూ సామరస్యంగానూ ఆలోచించడం ఆరంభించండి. ఆలోచించడం అంటే మాట్లాడడం. మీ ఆలోచనే మీ మాట. మీ మాటలు తేనెపట్టులా, చెవులకు తియ్యగా, మీ ఎముకలకు ఆహ్లాదంగా హాయిగా ఉండనివ్వండి. మీ మాటలను 'వెండి చిత్రాలలో బంగారు ఫలాల్లా' ఉండనివ్వండి. వర్తమానం ఎదుగుదలే భవిష్యత్తు; కనిపించని మీ మాటలు కనిపిస్తాయి. అదృశ్యంగా ఉన్నవి దృశ్యమానమవుతాయి. మీ మాటలు చెవులకు ఇంపుగా ఉంటున్నాయా? మీ అంతర్గత ఉపన్యాసం ఈ క్షణంలో ఎలా ఉంటోంది? ఎవ్వరూ మిమ్మల్ని వినలేరు; అది మీకే సొంతమైన నిశ్శబ్ద ఆలోచన. బహుశా మీరు మీతో, 'నావల్ల కాదు అది అసాధ్యం' 'నేను మరీ వృద్ధుణ్ణి. నాకు ఎలాంటి అవకాశం ఉంటుంది?' 'మేరీ వల్ల అది అవుతుంది. అయితే, నావల్ల కాదు.' 'నా దగ్గర డబ్బుల్లేవు. నాకా శక్తి లేదు. నేను కొనలేను. ప్రయత్నించాను కాని, ప్రయోజనం లేదు' అని చెబుతూన్నప్పుడు మీ మాటలు తేనెపట్టుల్లా లేవు. అవి మీ చెవులకు తియ్యగా లేవు. అవి మిమ్మల్ని పైకెత్తడం లేదు. స్ఫూర్తినివ్వడం లేదు. ప్రేరణనివ్వడం లేదు.

ఊస్పెన్‌స్కై అంతర్గత భాషణల, సంభాషణల, ఉపన్యాసాల ప్రాముఖ్యతను ఎల్లప్పుడూ నొక్కి వక్కాణించేవాడు. వాస్తవానికి అది లోలోపల మీరు ఎలా ఉన్నారని తెలుసుకునే మార్గం. ఎందుకంటే, అంతర్గతం – బాహ్యాన్ని ప్రతిబింబిస్తుంది. మీ అంతర్గత ఉపన్యాసం మీ అస్థికలకు హాయిగా ఉందా? అది మీకు ఉద్దీపనం కలిగిస్తోందా? మిమ్మల్ని సంతోషపరుస్తోందా?

అస్థికలు ఆధారానికీ, సౌష్ఠవానికీ ప్రతీకలు. మీ అంతర్గత భాషణ మిమ్మల్ని సుదృఢపరచి బలోపేతం చేయాలి. 'అయితే మాట నీకు మరీ చేరువలో, నీ నోట్లో, నీ హృదయంలో ఉంది. నువ్వు దానిని చెయ్యవచ్చు. చూడు, నేను ఈ రోజు జీవాన్నీ–మంచినీ, మరణాన్నీ–చెడునూ నీ ముందుంచాను.'

ఇప్పుడు దీనిని బుద్ధిపూర్వకంగా చెప్పడానికి ఆదేశించండి : 'ఈ క్షణం నుంచి ముందుకే, స్వస్థత సమకూర్చే, ఆశీర్వదించే స్ఫూర్తినిచ్చే, నాకు బలం సమకూర్చే భావాలను, ఆలోచనలను మాత్రమే మానసికంగా ఆస్వాదించడానికి నా మనసును అనుమతిస్తాను.' ఇప్పటినుంచి మీ మాటలు 'వెండి చిత్రాలలోని బంగారు ఆపిల్ పళ్ళలా' ఉండాలి. ఆపిల్ చాలా రుచికరమైన పండు. 'బంగారం' అంటే 'శక్తి'– వెండిచిత్రాలు అంటే బైబిల్‌లో 'మీ కోరిక' అని అర్థం. అంతా ఎలా ఉండాలనుకుంటున్నారో అది మీ మనసులోని చిత్రం. అది నెరవేరిన మీ కోరిక రూపం. అది నూతన పదవి కావచ్చు. ఆరోగ్యం కావచ్చు – మీ మాటలు మీ అంతర్గత నిశ్శబ్ద ఆలోచనలు, భావోద్వేగాలు ఇవన్నీ కూడా ఏకీకృతమై 'వెండి చిత్రం'తో అంటే మీ కోరికతో అంగీకరిస్తుంది. కోరిక, భావోద్వేగం ఒకటిగా కలిసిన మానసిక పరిణయం ఫలించిన ప్రార్థన అవుతుంది.

బైబిల్ ఊహను అనుసరించడానికి కృతనిశ్చయులు కండి. మీ మాటలు చెవులకు తియ్యగా ఉండనివ్వండి. ఇప్పుడు మీరు మీ చెవులకు ఏమి అందిస్తున్నారు? మీరు దేనిని వింటున్నారు? మీరు వేటిమీద ధ్యాస ఉంచుతున్నారు? మీరు ధ్యాస ఉంచినవాటికేసే కదులుతారు. అవే మీ అనుభవంలో పెరిగి పెద్దవై, అభివృద్ధి చెంది అనేక రెట్లుగా పరిఢవిల్లుతాయి.

'వినడం వల్ల విశ్వాసం వస్తుంది', అంటాడు పాల్. దేవుడి గొప్ప సత్యాలను వినండి. ఆయన స్వరాన్ని ఆలకించండి. ఆయన ఏ భాషలో మాట్లాడతాడు? అది గౌలిక్ కాదు; ఫ్రెంచి, ఇటాలియన్ కావు; అయితే, విశ్వజనీనమైన భాష. లేదా ప్రేమ మనోస్థితి, శాంతి, ఆనందం, సామరస్యం, విశ్వాసం, నమ్మకం ఇంకా సుహృద్భావస్థితి. ఈ భగవత్ గుణాలకూ, శక్తి జనకాలకూ మీ చెవులను అప్పగించండి. మానసికంగా ఈ గుణాలను ఆరగించండి. మీరు అలా చేయగా చేయగా, ఆ సానుకూల, సహిష్ణుతా గుణాలతో ప్రభావితులవుతారు. ప్రేమ సూత్రం మిమ్మల్ని పరిపాలిస్తుంది.

తరచూ చెప్పుకునే ఈ ఉటంకింపును మీరు వినే ఉంటారు : 'మనిషి దేవుడిలాగే ఆయన ప్రతిరూపంగా తయారుచేయబడ్డాడు.' దీని అర్థం – మీ మనసు దేవుడి మనసు. ఎందుకంటే, ఉన్నది ఒక్కటే మనసు గనక. మీ ఆత్మ దేవుడి ఆత్మ గనక దేవుడు సృష్టించిన విధంగానే, అచ్చం దేవుడు సృష్టించే సూత్రం ప్రకారమే మీరూ సృష్టిస్తారు. మీ వ్యక్తిగత ప్రపంచం; అంటే – అనుభవాలు, పరిస్థితులు, పరిసరాలు, ఇంకా శారీరక ఆరోగ్యం, ఆర్థిక స్థితిగతులు, సామాజిక జీవితం మొదలైనవన్నీ కూడా మీ మానసిక బింబాల నుంచే మీలాగే తయారుచేయబడతాయి.

ఒకే విధమైన సమాన గుణాలు కలిగినవే పరస్పరం ఆకర్షించు కుంటాయి. మీ ఆలోచనలను, భావోద్వేగాలను, విశ్వాసాలను, అంతర్గత సంభాషణలను మళ్ళీ మీకేసి వెనక్కు ప్రతిబింబించే అద్దమే ప్రపంచం. ఏవో దుష్టశక్తులు మీకు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్టు అనుకోవటం ఆరంభించి నట్టయితే లేదా ఏవో దుష్టశక్తులు మిమ్మల్ని వెంటాడుతున్నాయని అనుకున్నట్టయితే, లేదా మీకు వ్యతిరేకంగా ఇతర శక్తులు, మనుషులు పనిచేస్తున్నారని ఆలోచించినట్టయితే, వాటికి తగ్గట్టుగానే మీ లోలోపలి మనసు ప్రతిస్పందించి, మీ మనసులోని ఈ ప్రతికూల చిత్రాలతో భయాలతో చేతులు కలుపుతాయి. పర్యవసానంగా ప్రతిదీ మీకు వ్యతిరేకంగా ఉన్నట్టూ, నక్షత్రాలు సైతం మీకు ప్రతికూలంగా ఉన్నట్టూ చెప్పడం ప్రారంభిస్తారు. ఈ స్థితికి మీరు మీ కర్మను, గత జన్మలను లేదా ఏదో భూతాన్ని కూడా నిందించవచ్చు.

నిజానికి ఉన్న ఏకైక పాపం అజ్ఞానం. బాధ శిక్ష కాదు; అది మీ అంతర్గత శక్తిని దురుపయోగం చేసుకున్నదాని పర్యవసానం. ఉన్నది ఏకైక ఆధ్యాత్మికశక్తి అన్న సత్యాన్ని గుర్తించి తెలుసుకోవడానికి ఏకైక సత్యంకేసి తిరిగి రండి. అది మీ మనసులోని ఆలోచనలు, బింబాల ద్వారా పనిచేస్తుంది. సమస్యలు, విసుగులు, విరక్తి భావాలు, ఘర్షణలు, బాధలు మొదలైనవన్నీ

కూడా వాస్తవానికి మనిషి భయం, పొరబాటు అనే తప్పుడు దేవుళ్ళ వెంట పరుగులు తీయడంవల్ల చుట్టుముట్టేవే. మనిషి కేంద్రబిందువుకు తిరిగి రావాలి. లోపలే ఉన్న దేవుడి సమక్షానికి తిరిగి రావాలి. మీ లోపలే ఉన్న ఆ ఆధ్యాత్మిక శక్తి – సర్వజీవ సిద్ధాంతం యొక్క సార్వభౌమత్వాన్నీ, అధికారాన్నీ ఇప్పుడే దృఢంగా అంగీకరించండి. దివ్యమార్గదర్శకత్వం, శక్తి, పుష్టి, శాంతి కోసం చేతులు సాచండి. దానికి తగ్గట్టు ఆ శక్తి స్పందిస్తుంది.

ఒక భావాన్ని లేదా మానసిక బింబాన్ని మీరు సరిగ్గా, సానుకూలంగా మీలోని సుప్తచేతనాత్మక మనసుకు తెలియజేయడం ఎలాగో ఇప్పుడు మీకు చెబుతాను. మనిషి చేతనాత్మక మనసు వ్యక్తిగతమైనది, ఎంపిక చేసుకునేది. అది ఒక విషయాన్ని విచారణ జరిపి, ఎన్నుకుని బేరీజువేసి, విశ్లేషించి చిన్న చిన్న ముక్కలు చేస్తుంది. ఆగమన, నిగమన తర్కాలు దానికి చేతనవుతుంది. ఆత్మగతమైన లేదా సుప్తచేతనాత్మకమైన మనసు– చేతనాత్మకమైన మనసుకు లోబడి ఉంటుంది. దాన్ని చేతనాత్మక మనసుకు సేవకుడు అని కూడా చెప్పవచ్చు. చేతనాత్మక మనసు ఆజ్ఞలను సుప్తచేతనాత్మక మనసు పాటిస్తుంది. మీ చేతనాత్మక ఆలోచనకు శక్తి ఉంది. మీకు పరిచయమున్న శక్తి ఆలోచన. మీ ఆలోచనకు వెనక మనసు ఉంది. అదే ఆత్మ లేదా దేవుడు. కేంద్రీకృతం చేయబడి నిర్దేశించబడిన ఆలోచనలు ఆత్మాశ్రయ స్థాయిలను చేరుతాయి; వాటికి ఒక నిర్దిష్ట స్థాయి తీవ్రత ఉండాలి. ఏకాగ్రత ద్వారా తీవ్రత పొందబడుతుంది.

ఏకాగ్రతతో కేంద్రీకరించడం అంటే – కేంద్రానికి తిరిగి వచ్చి, మీ లోపల మందహాసంతో వ్యాపించి ఉన్న అనంతశక్తిని ధ్యానించడం. సక్రమంగా ఏకాగ్రత సాధించడానికి, మీ మనోచక్రాలను తిరగకుండా ఆపి, నిలకడ చేసి, ప్రశాంతమైన సడలిన మానసికస్థితిలోకి ప్రవేశించాలి. మీరు మీ మనసును ఏకాగ్రం చేసినప్పుడు మీ ధ్యాసనంతా మీ లక్ష్యం మీద, ఆశయం మీద, ఉద్దేశం మీద నిలపడానికి మీ ఆలోచనలను ఒకటిగా

సేకరించాలి. ఇప్పుడు మీరు, మీ ధ్యాసనంతా భక్తినంతా సమర్పిస్తున్న మానసిక బింబం కేంద్రబిందువు వద్ద ఉంటారు. ధ్యాసను కేంద్రీకరించే విధానం ఇంచుమించు సూర్యకిరణాలను భూతద్దంలో కేంద్రీకరించడం లాంటిదే. చెల్లాచెదురుగా పడే సూర్యకిరణాల నుంచి వెలువడే తాప స్పందనలకూ, కేంద్రీకరించబడిన కిరణాల నుంచి వెలువడే తాపస్పందనల ప్రభావాలకూ మధ్య ఉన్న తేడాను గమనించవచ్చు. భూతద్దం గుండా కిరణాలను ఒకేచోట కేంద్రీకరింపజేసి, అవి పడే చోట ఉన్న వస్తువును వేడితో కాలిపోయేలా చేయవచ్చు. మీ మానసిక బింబాల కేంద్రీకరించబడిన, నిలకడ గల ధ్యాస కూడా అలాంటి సాంద్రతర తీవ్రతనే సంతరించు కుంటుంది. సుప్తచేతనాత్మక మనసు సున్నిత ఫలకం మీద లోతైన చెరగని ముద్ర వేస్తుంది.

అలా ముద్ర ఏర్పరచడానికి ముందు ఈ మనోనాటకాన్ని మళ్ళీ మళ్ళీ పలుసార్లు ప్రదర్శించుకోవలసి ఉంటుంది. అయినప్పటికీ, లోతైన మనసును భావగర్భితం చేసే రహస్యం నిరంతరం నిలకడగా నిలిచే ఊహ మాత్రమే. పగటివేళ మీలో భయం లేదా విచారం పొడసూపిన వెంటనే దృష్టిని మీ మనసులో వున్న అందమైన చిత్రం కేసి మళ్ళించి, మరొక నిర్దిష్ట మానసిక సిద్ధాంతాన్ని పనిచేయిస్తున్నట్టూ, అది ఇప్పుడు మీ కోసం మీ చీకటి మనోమందిరంలో పని చేస్తున్నదనీ గ్రహించి తెలుసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల – మీరు విత్తనం మొలకెత్తడానికి నీరు పోసి నేలను సారవంతం చేస్తున్నట్టు – అంటే దాని పెరుగుదలను వేగవంతం చేస్తున్నా రన్నమాట.

మనిషి చేతనాత్మక మనసు మోటారు వంటిది. సుప్తచేతనాత్మకమైన మనసు ఇంజన్ వంటిది. మీరు మోటారును స్టార్ట్ చేస్తే చాలు. ఇంజను దానంతట అదే పనిచేస్తుంది. సుప్తచేతనాత్మక మనసు శక్తిని తట్టి లేపే డైనమో చేతనాత్మకమైన మనసు.

మీ స్పష్టమైన కోరికను, ఆలోచనను, లేదా బింబాన్ని లోతైన మనసుకు చేరవేయడానికి తొలిమెట్టు – శ్వాసను సడలించి, మనసును చలనం లేకుండా చేసుకోవడం. ఈ సడలిన, నిశ్చలమైన, శాంతియుత మనోవైఖరి అనవసరమైన వెలుపలి విషయాలనూ, తప్పుడు భావాలనూ అరికట్టి, మీ లక్ష్యాన్ని లోపలి మనసు పీల్చుకునేలా చేస్తుంది. ఇంకా ప్రశాంతమైన నిశ్చలమైన గ్రహించే మనసులో ప్రయత్నం కనిష్ఠస్థాయికి తగ్గించబడుతుంది.

రెండవ మెట్టులో మీరు కోరుకునే వాస్తవికతను ఊహించుకోవడం ప్రారంభిస్తారు. ఉదాహరణకు మీరు ఒక ఇంటిని అమ్మాలనుకుంటా రనుకుందాం. ఈ విషయంలో నా స్వానుభవం చెబుతాను. రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో విడిగా సంప్రదించినప్పుడు, నా సొంత ఇంటిని అమ్మిన పద్ధతిని తెలియజేశాను. వాళ్ళు ఆ పద్ధతిని అమలుచేసి అద్భుతమైన ఫలితాలు పొందగలిగారు. నేను మా ఇంటి ముందున్న గార్డన్‌లో 'అమ్మకం కోసం–యజమాని' అనే ప్రకటన ఫలకం పెట్టాను. ఆ సైన్ బోర్డ్ పెట్టిన రెండోరోజు నిద్రపోయేముందు నేను నాలో, "నువ్వు ఇల్లును అమ్మేశావను కుందాం. ఆ తరవాత ఏంచేస్తావు?" అని ప్రశ్నించుకున్నాను.

ఆ తరవాత నా ప్రశ్నకు నేనే ఇలా సమాధానం చెప్పుకున్నాను : 'ఆ సైన్ బోర్డును తీసి గ్యారేజ్‌లో పడేస్తాను'. నా కల్పనలో ఆ సైన్ బోర్డును నేలనుంచి ఊడబెరికి భుజాల పైకెత్తుకుని గ్యారేజ్‌కి తీసుకెళ్ళి, దాంతో 'ఇక నువ్వు అవసరం లేదు!' అని హాస్యమాడుతూ అక్కడ పడేశాను. ఆ పని అయిపోయిందన్న అంతర్గత సంతృప్తి నాలో ఏర్పడింది. మరునాడే ఒక వ్యక్తి వచ్చి 1000 డాలర్లు అడ్వాన్స్‌గా ఇచ్చి, "మీ సైన్ బోర్డును తీసెయ్యండి. ఇప్పుడే మనం అమ్మకం ఒప్పందం చేసుకుందాం," అన్నాడు.

వెంటనే నేను సైన్ బోర్డును ఊడబెరికి తీసుకెళ్ళి గ్యారేజ్‌లో పడేశాను. వెలుపలి చర్య లోపలి చర్యకు అనుబద్ధంగా జరిగింది. ఇందులో కొత్తేమీ లేదు. 'లోపల ఉన్నట్టే వెలుపల ఉంటుంది'. అంటే, సుప్తచేతనాత్మకమైన

మనసు మీద ముద్రించబడిన బింబానికి అనుగుణంగానే – మీ జీవిత వస్తుగత యవనిక మీద ద్యోతకమవుతుంది.

ఈ విధానం లేదా కిటుకు మన బైబిల్‌కన్నా ప్రాచీనమైనది. బాహ్యాం, అంతర్గతాన్ని ప్రతిబింబిస్తుంది. బాహ్య చర్య, అంతర్గత చర్యను అనుసరిస్తుంది.

ఒక ఆధ్యాత్మిక కృత్యం చేయమని ఒక పెద్ద సంస్థ నన్ను కోరింది. కొందరు మోసకృత్యాల ద్వారా ఆ సంస్థకు చెందిన అపార ఖనిజ సంపదను, ఇతరమైన వాటిని తమకు చెందినవని వాదిస్తూ దోచుకోవడానికి ప్రయత్నించారు. చట్టపరమైన మోసకృత్యాలతో, కుట్రలతో ఇబ్బందులకు గురిచేస్తూ– ఏమీ లేని దానినుంచి ఎంతో కొంత అపహరించడానికి ప్రయత్నించారు. అప్పుడు నన్ను వినియోగించుకున్న ఆ కంపెనీ తరఫున వాదిస్తూన్న న్యాయవాదిని కలిశాను. తాను నిర్దుష్టమైన సామరస్య పరిష్కారం సాధించినందుకు కంపెనీ ప్రెసిడెంటు తనను అభినందిస్తున్నట్టు రోజూ చాలాసార్లు స్పష్టంగా ఊహించుకోమని సలహా ఇచ్చాను.అతడూ అలాగే చేయడం ప్రారంభించాడు. నిరంతర మానసిక ఆచరణ ద్వారా మనోచిత్రాన్ని స్థిరంగా కలిగి ఉండడంతో – ఆత్మగత వివేకం అతనికి కొన్ని సరికొత్త ఆలోచనలు అందించింది. అతనే చెప్పినట్టు అవి 'శూన్యంనుంచే వచ్చాయి!' వాటిని అనుసరించాడు. ఆ తరవాత త్వరలోనే వ్యాజ్యం ముగించబడింది.

ఒక వ్యక్తికి బ్యాంకులో తనఖా ఉండి, దానిని విడిపించుకోవడానికి డబ్బులు లేకుంటే – అతడు ఈ సూత్రాన్ని విశ్వాసంతో అమలు చేసినట్టయితే సుప్తచేతనాత్మక మనసు అతనికి అవసరమైన డబ్బును ఏర్పాటు చేస్తుంది. ఎలా, ఎప్పుడు, ఏ వనరుగుండా అన్నవి అవసరం లేదు. మీకు తెలియని మార్గాలు ఆత్మగత మనసు కలిగి ఉంటుంది; వాటిని అది త్వరితగతిలో కనుగొంటుంది. మనిషి తన సంక్షేమానికి అవసరమైన వాటినన్నిటినీ సమకూర్చుకోవడానికి దేవుడు ప్రసాదించిన ఉపకరణాలలో, పరికరాలలో ఇది ఒకటి. తనఖాను విడిపించుకోవడానికి డబ్బులు లేని మనిషి, తను

అందుకు అవసరమైన చెక్కును లేదా డబ్బును బ్యాంకుకు చెల్లిస్తున్నట్టు ఊహించుకోవాలి. ముఖ్యమైన అంశం ఏమిటంటే – మనోచిత్రంలో, లేదా ఊహాత్మక చిత్రంలో అది వాస్తవం, సహజం అన్నంతగా దానిమీద తీవ్రమైన ధ్యాస ఉంచాలి. ఆ ఊహాత్మక నాటకం మీద అతని మనసులో ఉన్న ధ్యాస తీవ్రతకు అనుగుణంగా, ఊహాత్మక చర్య సుప్తచేతనాత్మక మనసు బ్యాంకులో డిపాజిట్ చేయబడుతుంది. మీ ఊహలో మీరు టెల్లర్స్ గవాక్షం వరకు వెళ్లవచ్చు. అది వాస్తవంగా భౌతికంగా జరుగుతున్నంతగా స్పష్టంగా, నిజంగా ఊహించుకోండి.

మన ఆదివారం ఉదయం ఉపన్యాసాలకు ఒక యువతి క్రమం తప్పకుండా హాజరయ్యేది. అలా ఆమె రావాలంటే తను ఉంటూన్నచోటునుంచి ఇక్కడికి చేరుకోవడానికి మూడు బస్సులు మారవలసి వచ్చేది. గంటన్నరసేపు పట్టేది. ఒకసారి నేను నా ఉపన్యాసంలో ఒక యువకుడు కారుకోసం ప్రార్థించి దానిని ఎలా పొందగలిగాడో వివరించాను. ఆమె ఇంటికి చేరగానే దాని మీద ప్రయోగం జరిపింది. ఇదిగో ఇక్కడ ఆమె రాసిన ఉత్తరంలో కొంతభాగం ఆమె అనుమతితో ప్రచురిస్తున్నాను:

*డియర్ డాక్టర్ మర్ఫీ,*

*ఇదీ నేను క్యాడిలాక్ (సిక్) కారును పొందిన విధానం: ఆదివారం, మంగళవారం ఉపన్యాసాలకు రావడానికి తప్పక ఒక కారు కావాలనిపించింది. నా ఊహలో నేను సర్వసమ ప్రక్రియ ద్వారా నిజంగానే కారును నడుపుకుంటూ వెళుతున్నట్టు భావించేదాన్ని. ఊహలోనే నేను షోరూంకు వెళ్లాను. సేల్స్‌మ్యాన్ ఒక కారులో స్వారీకి తీసుకువెళ్లాడు. ఆ కారును నేనే వీధుల్లో నడిపాను. క్యాడిలాక్ కారు నాకు సొంతమని మళ్ళీ మళ్ళీ భావించాను. కారులోకి వెళ్ళి కూర్చోవడం, దానిని నడపడం, ఆనందం పొందడం మొదలైన వాటినన్నిటినీ మనోచిత్రంగా రెండు*

> వారాలకు పైగా మనసులో నిరంతరాయంగా పదిలపరుచుకున్నాను. గతవారం నేను మీ ఉపన్యాసానికి నిజంగానే కారు నడుపుకుంటూ వచ్చాను. ఇంగిల్‌వుడ్‌లోని మా అంకుల్ చనిపోయారు. ఆయన చనిపోయే ముందు తన క్యాడిలాక్ కారుతో సహా మొత్తం ఎస్టేట్‌ను నా పేరున రాసి వెళ్ళారు.

సరే, తనఖా బాకీ చెల్లించడానికి డబ్బు వచ్చే ఎలాంటి మార్గమూ నాకు తెలియడం లేదు అంటున్నారా? దాన్ని గురించి విచారించకండి. విచారించడం అంటే గొంతునులుముకోవడమే. మీరు ఆశ్రయించినప్పుడల్లా మీకు అవసరమైన ప్రతిఒక్కదాన్నీ సమకూర్చగల ఒక శక్తి మీలో అంతర్గతంగా ఉందని గ్రహించండి. ఇప్పుడు పరిపూర్ణ నమ్మకంతో, భావోద్వేగంతో ఇలా ఆదేశించవచ్చు: 'నా ఇల్లు రుణబాధలన్నిటినుంచీ బయటపడింది. సంపదలు పుష్కల హిమనీపాతంలా నాలోకి ప్రవహిస్తున్నాయి.' మీ ప్రార్థనకు ఫలితం వచ్చే పద్ధతిని ప్రశ్నించకండి. మీ కోరికలు నెరవేరడానికి అవసరమైన ప్రతి ఒక్కటీ తెలియడంతో, సుప్తచేతనా మేధస్సు మీ అడుగులన్నిటినీ నిర్దేశించడం వల్ల, అవసరమైనవాటిని మీరు సిద్ధం చేసుకుంటారు. మీ బాకీ చెల్లించినట్టు తెలియజేస్తూ తనఖా సంస్థ నుంచి మీకు ఉత్తరం అందినట్టు కూడా మీరు ఊహించుకోవచ్చు. ఆ ఊహలో తేలియాడుతూ ఆనందించండి. మీ మనసులో అది దృఢమైన నమ్మకంగా రూపొందేంత వరకు ఆ ఊహాలేఖతో జీవించండి.

మీరు నిజమని ఊహించి భావోద్వేగం చెందిన దానిని వాస్తవంలో రూపొందించి వెలికితెచ్చే సామర్థ్యంగల శక్తి లోపలే ఉందన్న విషయాన్ని దృఢంగా నమ్మండి. ఊరకే కూర్చుని అవి కావాలి, ఇవి కావాలి అని పగటి కలలు కన్నంత మాత్రాన అవి వాటిని ఆకర్షించవు. మీరు మనోసూత్రాన్ని తెలుసుకుని, దానిని పనిచేయిస్తున్నట్టు గాఢంగా విశ్వసించాలి. మీరు కోరిన వాటిని వాస్తవం చేసుకోవడానికి, మీ మనసును నిర్మాణాత్మకంగా

ఉపయోగించుకునే దేవుడిచ్చిన శక్తి మీద ప్రగాఢ నమ్మకం కలిగి ఉండాలి.

మీకు ఏం కావాలో తెలుసుకోండి. సుప్తనాత్మక మనసు ఆ ఆలోచనను ముందుకు తీసుకు వెళుతుంది. ఎందుకంటే మీరు పొందాలనుకున్న దాని గురించి స్పష్టమైన, నిర్దిష్టమైన భావన కలిగి ఉంటారు. మీ కోరిక నెరవేరడం స్పష్టంగా ఊహించుకోండి. అప్పుడు మీరు సుప్తచేతనాత్మక మనసు పనిచేయడానికి నిర్దిష్టమైన ఒక దానిని అందజేసినవారవుతారు. సుప్తచేతనాత్మక మనసు చిత్రం ముద్రించబడే ఫిలిం లాంటిది. సుప్త చైతన్యం చిత్రాన్ని అభివృద్ధి చేస్తుంది. దాన్ని లౌకికంగా, వస్తుగత రూపంలో మీకు వెనక్కి తిప్పి పంపుతుంది.

కేంద్రీకృత ధ్యాస ద్వారా కోరిక సఫలీకృతమవుతున్నట్టు స్పృహతో ఊహించుకునే కెమెరా మీరు. రిలాక్స్‌డ్‌గా నింపాదిగా, సంతోషకరమైన మనోస్థితిలో ఇలా ఊహించుకోవడం వల్ల, చిత్రం సుప్తచేతనాత్మక మనసు అనే సున్నితమైన ఫిలిం మీద ముద్రించబడుతుంది. అందుకు కొద్దిపాటి కాలవ్యవధి అవసరమవుతుంది. అది ఎంతసేపు అన్నది మీ స్వభావం, భావోద్వేగం, అవగాహనను బట్టి ఉంటుంది. రెండు మూడు నిమిషాలు, అంతకన్నా ఎక్కువ కూడా పట్టవచ్చు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే – మీ స్పృహ నాణ్యత, భావోద్వేగస్థాయి, లేదా నమ్మకం అంతటి ముఖ్యమైనది కాదు కాలవ్యవధి. సాధారణంగా చెప్పాలంటే, మీ ధ్యాసను మరింత కేంద్రీకరించి అందులో విలీనమై తాదాత్మ్యం చెంది నప్పుడు, మరింత సమయం అయినప్పుడు మీ ప్రార్థనకు సమాధానం కూడా మరింత నిర్దుష్టంగా ఉంటుంది. మీరు అందుకున్నట్టు నమ్మండి. తప్పకుండా అందుకుంటారు. "మీరు విశ్వాసంతో ప్రార్థనలో అడిగినదంతా మీరు అందుకుంటారు." నమ్మకం అంటే ఒకదాన్ని నిజమని అంగీ కరించడం; అదిగానే, ఆ స్థితిలోనే జీవించడం. ఈ మనోస్థితిని పదిలంగా కొనసాగించినప్పుడు, ఫలితం పొందిన ప్రార్థన ఆనందాన్ని అనుభవించ గలుగుతారు!

## అధ్యాయం మూడు

# విజయాన్ని ఊహించడం ఎలా?

దేవుడు ఎల్లప్పుడూ తను తలపెట్టే పనులలో విజయవంతంగా ఉంటాడు. మనిషి జయించడానికి కావలసిన సాధన సంపత్తితో సమకూర్చబడి ఉన్నాడు. ఎందుకంటే దేవుడు అతనిలోపలే ఉన్నాడు. దేవుడి లక్షణాలు, స్వభావాలు అంతర్గత శక్తిసామర్థ్యాలు అన్నీ మనిషి లోపల ఉన్నాయి.

మీరు జయించడానికీ, అవరోధాలన్నిటినీ అధిగమించి విజయం సాధించడానికే పుట్టారు! దేవుడి మేధస్సు, వివేకం, శక్తి మీ నుంచి విడుదల చేయబడి మిమ్మల్ని సకల కష్టాల నుంచి గట్టెక్కేలా చేయడానికి మీలో కాచుకుని ఉన్నాయి.

చాలామంది విజయం అనే నైరూప్య పదాన్ని, విజయం తమదేనన్న నమ్మకం కుదిరేంతవరకు మళ్ళీ మళ్ళీ ప్రశాంతంగా, రోజూ అనేకసార్లు ఉపయోగించుకుంటూ ఉంటారు. విజయభావంలోనే విజయానికి కావలసిన

అత్యంత ముఖ్యమైన అంశాలు ఉన్నాయన్న విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోండి. ఒక వ్యక్తి విశ్వాసంతో, దృఢమైన నమ్మకంతో విజయం అనే పదాన్ని పదే పదే చెప్పడం వల్ల, అతని సుప్తచేతనాత్మక మనసు దానిని అతనికి నిజమని అంగీకరిస్తుంది. ఆ తరవాత దానిని విజయవంతం చేయడానికి అంతర్గత నిర్బంధానికి  లోనవుతుంది.

మనం మన ఆత్మాశ్రయ నమ్మకాలను, అభిప్రాయాలను మాత్రమే కాకుండా బలీయంగా నమ్మే వాటిని కూడా వ్యక్తీకరించడానికి నిర్బంధించ బడుతున్నాం. మీరు దేనిని సాధించతలుచుకుంటున్నారు అన్న దానిని మొదట తెలుసుకోవడమే విజయానికి ఆదర్శ మార్గం. మీ సరైన స్థానం ఏది, ఏం చెయ్యాలి అన్న విషయాల గురించి స్పష్టంగా తెలియనప్పుడు దానిని గురించి మీరు మార్గదర్శకత్వం కోసం అడగవచ్చు. దానికి లోతులలోని మనసు స్పందిస్తుంది; తత్ఫలితంగా, ఒక నిర్దిష్ట కార్యకలాపాల రంగంకేసి మీరు నెట్టబడతారు. లేదా ఆ కార్యకలాపాలపట్ల ఆసక్తి కలుగుతుంది.

మీ ఆలోచనకు లోతైన మనసు స్పందిస్తుంది. కొన్ని సందర్భాలలో 'ఆత్మగత లేదా లోతైన మనసు' అని పిలవబడే సుప్తచేతనాత్మక మనసు, ఆ వ్యక్తి విజయానికి అవసరమైన పరిస్థితులను అతనికేసి ఆకర్షించే దాని స్పృహరహిత మేధస్సును పనిచేయిస్తుంది. తను చేయడానికి ఇష్టపడే పనిని చేయడం చాలా ముఖ్యమన్న విషయాన్ని మనిషి ప్రత్యేక అంశంగా చేసుకోవాలి. మీ ప్రయత్నంలో మీరు సంతోషంగా ఉన్నట్టయితే, మీరు విజయం  సాధించినట్టే.

మీలో అంతర్గత సృజనాత్మకత కలిగివున్నారన్న వాస్తవాన్ని అంగీ కరించండి. దాన్ని సానుకూల బలీయ నమ్మకంగా చేసుకోండి. ఈ అనంత శక్తి మీ ఆలోచనకు స్పందించి ప్రతిచర్యకు పూనుకుంటుంది. ఈ సిద్ధాంతాన్ని తెలుసుకుని, అర్థం చేసుకుని అమలు చేసినట్టయితే సందేహం, భయం,

విచారం క్రమ క్రమంగా కనుమరుగైపోతాయి.

మనిషి ఎప్పుడూ ఒక ఆలోచనతో ఉన్నట్టయితే, ఉదాహరణకు ఓటమిని గురించి ఆలోచిస్తూ ఉన్నట్టయితే – ఓటమిని గురించిన ఆలోచన ఓటమిని ఆకర్షిస్తుంది. సుప్తచేతన – అతనిలోని ఓటమి ఆలోచనను అతని విన్నపంగా తీసుకుని అతని అనుభవాన్ని వాస్తవం చేయడానికి ముందుకు వెళుతుంది. అతడు ఓటమిని రూపొందించుకునే మానసిక సాధనలో నిమగ్నుడై పోవడంవల్లే అలా జరుగుతుంది. సుప్తచేతనాత్మక మనసు అవ్యక్తం – వ్యక్తిగతం కాదు, ఎంపిక చేసుకోజాలదు.

వ్యాపారం చేసుకునే నా స్నేహితుడు ఒకడు ఉన్నాడు. దర్జీ పని చేసుకునే అతనికి చాలా అభిమాన సూక్తి : 'నేను ఎల్లప్పుడూ కూడికను మాత్రమే చేస్తాను. తీసివేత ఎప్పుడూ చేయను'. అంటే, అతనికి విజయం అన్నది ప్లస్ చిహ్నం. మీ అభివృద్ధికి, సంపదలకు, శక్తికి, జ్ఞానానికి, విశ్వాసానికి, వివేకానికి మరింత అదనంగా చేర్చుకుంటూనే ఉండాలి.

జీవితం కూడిక! మరణం తీసివేత. నిజమైన వాటిని, అందమైన వాటిని, ఉదాత్తమైన వాటిని, దేవుడులాంటి వాటినంతా ఊహించుకుంటూ మీ జీవితాన్ని కూడిక చేసుకోవచ్చు. మిమ్మల్ని మీరు విజయవంతంగా ఊహించుకుని అనుభూతి చెందండి. మీరు తప్పక విజేతలు కావాలి. మీరు ఎన్నటికీ పరిస్థితులకూ, వాతావరణానికీ, పరిసరాలకూ, స్థితిగతులకూ బానిసలు కారు. మీ స్థితిగతులకు మీరే యజమానులు. ప్రస్తుత పరిస్థితుల తీరుకు మానసికంగా తల ఒగ్గడం వల్ల వాటికి మీరు బలియైపోవచ్చు. మీరు మీ మనసు మార్చుకుంటే పరిస్థితులను మార్చగలుగుతారు.

ఒక సినీనటుడు ఒకప్పుడు తనకు చదువు మరీ తక్కువగా ఉండేదనీ, అయితే చిన్నప్పటినుంచే సినీనటుడు కావాలనే కల ఉండేదనీ నాతో చెప్పాడు. "పొలాల్లో గడ్డికోస్తూ పశువులు కాస్తూ, వాటిని ఇంటికి తోలుకు

వెళుతూ, పాలు పితుకుతూ ఏ పని చేస్తున్నప్పటికీ ఎల్లప్పుడూ నా పేరును బ్రహ్మాండమైన థియేటర్‌లో రంగురంగుల లైట్ల మధ్య పెద్దపెద్ద అక్షరాలలో ప్రకాశించేట్టు ఊహించుకునేవాణ్ణి. బాల్యం నుంచే నాకీ అలవాటు ఉండేది. అది కొన్ని సంవత్సరాలు అంటే, నేను ఇంటి నుంచి పారిపోయి, సినీ రంగంలో చిన్నాచితకా పనులు చేసుకుంటూ అలా అలా ఎదిగి, చిన్నప్పుడు కలలుకన్న విధంగా నిజంగానే నా పేరును పెద్దపెద్ద లైట్ల మధ్య చూసుకునేంతవరకు కొనసాగించాను!" అని చెప్పాడు. కొంతసేపు ఆగి మళ్ళీ, 'విజయాన్ని తీసుకురావడంలో సుస్థిరమైన సుదీర్ఘ ఊహకు గల శక్తి నాకు తెలుసు', అన్నాడు.

విజయం అంటే ఏమిటి? అది మీకు దేన్ని తెలియజేస్తోంది? ఇతరులతో మీకున్న సంబంధ బాంధవ్యాలలో విజయవంతంగా ఉండాలని నిస్సందేహంగా అనుకుంటారు. మీరు ఎంపిక చేసుకున్న రంగంలో, వృత్తిలో విశిష్ట స్థానంలో ఉండాలని భావిస్తారు. అందమైన ఇల్లూ, వసతి సౌకర్యాలతో సంతోషంగా జీవించడానికి కావలసిన డబ్బూ కావాలని కోరుకుంటారు. మీలో ఉన్న విశ్వజనీన శక్తికి మీరు అనుసంధానంలో ఉండాలనీ, మీరు చేసే ప్రార్థనలలో విజయవంతం కావాలనీ కోరుకుంటారు.

మీరు చేయాలనుకుంటూన్న వాటిని వాస్తవంలో చేస్తున్నట్టూ, పొందాలనుకుంటూన్న వాటిని పొందినట్టూ ఊహించుకోండి. మీరే ఊహగా విహరించండి; విజయవంతమైన వాస్తవస్థితిలో మానసికంగా పాల్గొనండి; తరచూ ఆ స్థితి చేతనలోకి ప్రవేశించండి; దాన్నొక అలవాటుగా చేసుకోండి; ఆ తరవాత మీ కల నిజం కావడానికి అవసరమైన ప్రతిదానినీ చేయడానికి మీకు మార్గదర్శకత్వం లభిస్తున్నట్టు గ్రహించగలుగుతారు. విజయవంతులైనట్టు అనుభూతి చెందుతూ పరిపూర్ణమైన తృప్తితో ప్రతి రాత్రీ నిద్రకు ఉపక్రమించండి. ఇలా చేయడం వల్ల మీ సుప్తచేతనాత్మక మనసులో విజయం ఆలోచనను విత్తడంలో ఎట్టకేలకు విజయవంతులవుతారు.

ఫార్మసిస్ట్ లైసెన్స్ పొంది డ్రగ్‌స్టోర్‌లో పనిచేస్తున్న ఒక క్లర్క్ నాకు తెలుసు. అతడు వారానికి 40 డాలర్లు సంపాదించేవాడు. దాంతోపాటు సేల్స్ మీద కమీషన్ వచ్చేది. ఒకనాడు అతను నాతో, 'పాతికేళ్ళ తరవాత నాకు పెన్షన్ వస్తుంది. రిటైర్ అవుతాను,' అన్నాడు.

'నువ్వే ఎందుకు సొంతంగా ఒక స్టోర్ పెట్టకూడదు? ఈ ఉద్యోగం మానేసి తల కాస్త పైకెత్తి పైకి చూడు. మీ పిల్లల గురించి కలలు కను. బహుశా మీ అబ్బాయి డాక్టర్ కావాలనుకోవచ్చు. మీ అమ్మాయి మ్యూజీషియన్ కావాలని ఆశపడవచ్చు,' అన్నాను నేను.

'నా దగ్గర అందుకు డబ్బుల్లేవు కదా' అన్నది అతడి సమాధానం! అయినా అతను ఆలోచించసాగాడు. నిజమని భావించిన దాన్ని నిజంగానే పుట్టించవచ్చునన్న వాస్తవంలోకి మెల్లమెల్లగా మేలుకోవడం ప్రారంభించాడు.

మనసులో ఆలోచన పుట్టడమే మీ లక్ష్యసాధనకు తొలిమెట్టు. ఆ ఆలోచన రూపం దాల్చడం రెండవమెట్టు. అతడు తన సొంత దుకాణంలో ఉన్నట్టు ఊహించడం ప్రారంభించాడు. ఆ చర్యలో మానసికంగా పాల్గొన్నాడు. మందుల సీసాలను అందంగా అమర్చేవాడు; వచ్చిన ప్రిస్క్రిప్షన్లకు మందులు పంపేవాడు. స్టోర్‌లో పలువురు గుమాస్తాలూ, మందుల కోసం కాచుకుని ఉన్న కస్టమర్లనూ ఊహించుకునేవాడు. పెద్ద బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నట్టు దృశ్యీకరించుకున్నాడు. మానసికంగా ఆ ఊహాదుకాణంలో తీరిక లేకుండా పనిచేసేవాడు. మంచి నటుడిలా అతడు తన పాత్రలో జీవించాడు. ('నేను ఎలా ఉన్నట్టు నటిస్తానో అలా అవుతాను.') మందుల దుకాణం గుమాస్తా హృదయపూర్వకంగా ఈ చర్యలో పాల్గొన్నాడు... ముఖ్యంగా దుకాణం తనదే అన్న భావనతో జీవిస్తూ, కదులుతూ నటించసాగాడు.

తరువాయి భాగం చాలా ఆసక్తికరమైనది. అతడు తన స్థానం నుంచి పంపబడి మరో పెద్ద చైన్ స్టోర్‌లో చేరి, మేనేజర్, తదుపరి డిస్ట్రిక్ట్ మేనేజర్ అయ్యాడు. నాలుగేళ్ళు తిరిగేసరికి ఆ డ్రగ్ స్టోర్‌ను కొనడానికి ఒక్కసారిగా

చెల్లించడానికి చాలినంత డబ్బు కూడబెట్టాడు. నిజంగానే సొంతంగా కొనేశాడు. దానికి 'డ్రీమ్ ఫార్మసీ' అని పేరు పెట్టాడు. 'అది అచ్చం తను ఊహాలో చూసిన విధంగానే ఉన్నట్టు' అతను చెప్పాడు. అతడు తను ఎంపిక చేసుకున్న రంగంలో విజయవంతమయ్యాడు. తనకు ఇష్టమైనది చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నాడు.

విశ్వాసం, ఉత్తమమైనవే జరుగుతాయన్న మనోవైఖరి అలవాటుగా గలిగిన వ్యక్తి తప్పకుండా విజయం సాధించి జీవితంలో ముందుకే సాగుతాడు. ఎప్పుడూ విచారంగా, విషాదంగా, నిరాశతో, రోగగ్రస్తంగా, అధైర్యంగా, శోకంగా ఉన్న వ్యక్తి వరసగా అపజయాలనే ఆకర్షిస్తాడు. భయం అన్నది నిజానికి దివ్యసరఫరాలో విశ్వాసరాహిత్యమే. అది ఉంచ వలసినచోట కాకుండా వేరొకచోట ఉంచిన విశ్వాసం. తప్పుడు విషయం మీద విశ్వాసమే భయం. లేని దాని మీద నమ్మకం ఉంచడం భయం. అది మనిషి మంచిని అతని నుంచి ఆపుతుంది.

**'బిడ్డా, నువ్వు ఎల్లప్పుడూ నాలోనే ఉన్నావు. నా వద్ద ఉన్నవన్నీ నీవే.'** మీకు అవసరమైనవన్నీ అదృశ్యంగా ఉంటాయి. కావలసిన వస్తువులన్నీ కూడా అరూపంగా ఉంటాయని చెప్పవచ్చు. జీవితంలో ముందుకు వెళ్ళాలంటే మీరు ప్రస్తుతం ఉన్నదానికన్నా గొప్పగా ఉండడానికి ఆశపడాలి. మొదట ఆశ వస్తుంది. ఆ తరవాత దాన్ని అనుసరించి కావలసిన వాటిని సాకారం చేసుకునేలా చేసుకునే శక్తి మీలోనే ఉందన్న విషయం గుర్తిస్తారు. సుప్తచేతన మనసే కోరినవాటినల్లా తన ద్వారా వస్తుగతంగా మీ ఎదుటికి తీసుకువచ్చే మాధ్యమం. అలవాటుగా సాగే ఆలోచనలు, భావోద్వేగాలు, అభిప్రాయాలు, నమ్మకాల రూపంలో మీరు ఆజ్ఞలు జారీచేస్తారు. చేతనాత్మక మనసు జారీచేసే ఆజ్ఞలను సుప్తచేతనాత్మక మనసు పాటిస్తుంది. ప్రతికూల ఆలోచనలన్నిటికీ మీ చేతనాత్మక మనసు వ్యతిరేకంగా ఉన్నట్టయితే అవి మీ సుప్తచేతనాత్మక మనసు మీద ఎలాంటి భావముద్రలనూ వేయజాలవు. మీరు వాటివల్ల బాధించబడరు.

ఉదాహరణకు మీరు, 'నేను గనక ఆరోగ్యంగా ఉండి ఉన్నట్టయితే, నా పనులలో మరింత విజయవంతంగా ఉండేవాణ్ణి!' అన్నప్పుడు శరీరం మీ మనసు వ్యక్తీకరణ అని గ్రహించడం ప్రారంభిస్తారన్నమాట. సుప్తచేతనాత్మక మనసు శరీరాన్ని నిర్మిస్తుంది. అదే శరీరానికి సంబంధించిన మూలాధార చర్యలన్నిటినీ నియంత్రిస్తుంది. మీ సుప్తచేతనాత్మక మనసులో ఉన్న ఒక భావాన్ని గాని, ఆలోచనను గాని మార్చగల శక్తి మీ చేతనాత్మక మనసుకు ఉంది. అది జరుగుతుందని తెలిసినప్పుడు సంపూర్ణ ఆరోగ్య భావాన్ని మీరు సుప్తనాత్మక మనసులో ముద్రించవచ్చు. అందుకు దృఢమైన పరిపూర్ణ నమ్మకం, నిజాయితీ గల హృదయపూర్వక విశ్వాసం అవసరం. అవునని రూఢిగా చెప్పే మాటలు సుప్తచేతనాత్మక మనసు మీద నిర్దిష్టమైన ముద్రలు వేస్తాయి.

సుప్తచేతనాత్మక మనసును ప్రభావితం చేసే అద్భుతమార్గం – క్రమశిక్షణ ఇవ్వబడిన లేదా విజ్ఞానశాస్త్ర పూర్వకమైన ఊహ ద్వారానే సాధ్యం. సోదాహరణంగా చెప్పాలంటే – మీ మోకాలు వాచి మీరు కుంటుతున్నారనుకుందాం. పరిపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడు మీ పనులు ఎలా చేసుకునేవారో అలా ఊహించుకోండి. 'ఊరంతా బస్సులో తిరుగుతాను. స్నేహితులను కలుసుకుంటాను. గుర్రపు స్వారీ చేస్తాను. ఈత కొడతాను. వాహ్యాళికి వెళతాను' అని చెప్పుకోవచ్చు. మొదట మీ ఊహలో సాధ్యమైనంత సహజం, వాస్తవం అన్నంతగా మీ మానసిక ప్రయాణాలు చేయండి. వాటిని అలాగే కొనసాగించండి. స్వయం ప్రేరణ మీదే అని మీకు తెలుసు. బాహ్యా చలనం ఏదైనా జరగడానికి ముందు అన్ని కదలికలూ మనసులోనే, అంటే మనిషి చేతనలోనే చోటుచేసుకుంటాయి.

ఉదాహరణకు, మీ ఎదుట ఉన్న కుర్చీ దానంతట అదే కదలదు. దానికి మీరే కదలికను కలిగించాలి. మీ శరీరానికి సంబంధించి కూడా ఇదే వాస్తవం వర్తిస్తుంది. ఊహలో పూర్తిగా నయమైపోయినట్టు అన్ని

పనులూ చేసుకుంటూ వెళ్ళడంవల్ల, ఈ అంతఃచలనం దానివెనక వున్న ఊహకు అనుగుణంగా శరీరాన్ని నిర్మింపచేయడానికి సుప్తచేతనను ప్రేరేపిస్తుంది.

పరిపూర్ణ ఆరోగ్యానికి ఇప్పుడు చెప్పబోయేది చాలా అద్భుతమైన ప్రార్థన. దక్షిణ ఆఫ్రికాలో నేను ఎరిగిన బోధకుడు ఒకాయన ఈ ప్రార్థనను అమలు చేసి తనను తాను నయం చేసుకున్నారు. పరిపూర్ణ స్వస్థత పొందారు. మొదట ఆయన తనను మానసికంగానూ, శారీరకంగానూ పూర్తిగా సడలించుకుని ఒక రోజులో చాలాసార్లు నెమ్మదిగా, ప్రశాంతంగా దేవుణ్ణి ఇలా ప్రార్థించేవారు: 'దేవుడి పరిపూర్ణత ఇప్పుడు నా ద్వారా వ్యక్తమవుతోంది. ఇప్పుడు పరిపూర్ణ ఆరోగ్యం గురించిన ఆలోచనాభావం నా సుప్తనాత్మక మనసును నింపుతోంది. దేవుడికి నన్ను గురించి ఉన్న బింబం – నిర్దుష్టమైన బింబం. నా సుప్తనాత్మక మనసు, దేవుడి మనసులో ఉన్న నిర్దుష్ట బింబానికి అనుగుణంగా నా శరీరాన్ని నిర్దుష్టంగా పునఃసృష్టి చేస్తుంది.' నిర్దుష్టమైన ఆరోగ్యం ఆలోచనను మీ సుప్తచేతనాత్మకు అందజేసే చాలా సరళమైన సులభ మార్గం ఇది.

విజయం సాధించడంలో మిమ్మల్ని ఏదీ ఆపజాలదని తెలుసుకుని గ్రహించడం వల్ల మీలో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చు. అవరోధా లన్నిటినీ అధిగమించడానికి అంతఃశక్తిని ఆహ్వానించవచ్చన్న నమ్మకాన్ని మీ మనసులో దృఢంగా ఏర్పరచుకోండి. మీరు చేయాలనుకున్న దానిని సాధించి, వశపరచుకోగలమన్న ధీమా, దృఢ నిర్ణయం తప్పక ఉండాలి. సానుకూలంగా దృఢపరిచే ఈ అంగీకారవైఖరే ఆత్మవిశ్వాసాన్ని రూపొం దిస్తుంది.

**'మీ విశ్వాసం ప్రకారమే మీకు జరుగుతుంది'** అన్న బైబిల్ సూక్తిని మీరు వినే ఉంటారు. దేవుడిపై విశ్వాసం అంటే – సర్వవ్యాపకమైన, సర్వం ఎరిగిన, సర్వశక్తి సమన్వితమైన, సర్వ ప్రేమమయమైన, సర్వ ప్రకాశ

వంతమైన, సర్వ సుందరమైన, సర్వ జీవమైన, ఆపత్కాలంలో ఆదుకుని సాయం చేయడానికి ఒక ఏకైక ఆధ్యాత్మిక శక్తి సర్వవేళలా సంసిద్ధంగా ఉందని తెలుసుకుని గ్రహించడం. మీ ఆలోచనకు ఆయన శక్తి స్పందిస్తుందని తెలుసుకోండి.

దేవుడు అంటే ఎక్కడో ఆకాశంలో పొడవాటి గడ్డంతో ఉంటాడన్న భావానికి స్వస్తి పలకండి. మనిషి అంతస్సారం దేవుడు. మనిషి జీవం దేవుడు. మనం దేవుణ్ణి గురించి సర్వం అర్థం చేసుకోలేము. ఎందుకంటే, పరిమితిగల మనసు పరిమితిలేని అనంత శక్తిని అలాగే ఉన్నది ఉన్నట్టు అర్థం చేసుకోజాలదు.

ఉదాహరణకు మీ చేతనాత్మక, సుప్తచేతనాత్మక మనసులు దేవుడి విక్షేపణలు; అవి పనిచేసే ఉపకరణాలు. దేవుడు అనంత వివేకం; అవధులు ఎరుగని ప్రేమ, అనంత మేధాశక్తి; పరిపూర్ణ ఆనందం; శాశ్వత సామరస్యం; వర్ణనాతీత సౌందర్యం. ఇవీ, ఇలాంటివి ఎన్నో దేవుడి లక్షణ స్వభావాలు, గుణగణాలు.

మీరు జీవిత సముద్రం మధ్య, జీవసృష్టికర్తచేత లంగరు లేని పడవలా ఒంటరిగా వదిలివేయబడినవారు కారు. ఆయన సమక్షం, శక్తి మీ లోపలే ఉన్నాయి. ఈ జ్ఞానం లేదా మీలోవున్న దివ్యశక్తి స్పృహ విజయానికి దోహదం చేసే అత్యంత శక్తివంతమైన గొప్ప అంశం.

మీ శక్తిసామర్థ్యాలను అభివృద్ధిపరుచుకోండి. వాటిని ఉపయోగించడం ప్రారంభించండి; అవి దేవుడు ప్రసాదించినవి. నిరంతర సుస్థిర అభివృద్ధికి అవసరమయ్యే శక్తిసామర్థ్యాలు మీకు ఉన్నాయి.

**'మనిషి ఒకదాన్ని ఆదేశిస్తే, అది వాస్తవంలోకి వస్తుంది.'** మీరు ప్రస్తుతం దేనిని మానసికంగా ఆదేశిస్తున్నారు? మీ అంతర్గత సంభాషణల, మాటల స్వభావమూ, అక్రియా మనోస్థితుల స్వభావమూ ఏమిటి? మనిషి మాట్లాడే ప్రతి నిష్క్రియాపదానికీ సమాధానం చెప్పవలసి ఉంటుంది.

సందేహం, భయం, ఆందోళన, విచారం మొదలైనవే నిష్క్రియాపదాలు. ఇవి గనక ఉన్నట్టయితే, మీరు నిర్దిష్ట సానుకూల సందేశాలు సుప్తచేతనాత్మక మనసుకు అందజేయలేరు. ఎందుకంటే, మీరు దేనిని కావాలని కోరు కుంటున్నారన్న దానిని సుప్తచేతనాత్మక మనసులో నిర్దిష్ట ముద్రణ చేయలేరు.

భయం, విచారం చేతనాత్మక మనసులో గందరగోళం కలిగిస్తాయి. ఇది సుప్తచేతనాత్మక మనసులో గందరగోళం సృష్టిస్తుంది. దాంతో మనిషి వ్యవహారాల్లో గందరగోళం తప్ప మరేదీ జరగదు. దివ్యశక్తిని నమ్మడం కొనసాగించండి. మీరు కోరుకున్నది ఏదో విధంగా మీ వద్దకు వచ్చి తీరుతుందని విశ్వసించండి. దేవుడిపై, దివ్యశక్తిపై, దివ్యప్రేమపై నిరంతరం మిమ్మల్ని వీక్షిస్తూ నీడనిచ్చి రక్షించే ఆయన దివ్యసమక్షంపై ఎల్లప్పుడూ విశ్వాసం కలిగి ఉండండి. మీరు అజేయులవుతారు. **'ప్రభువుపై నమ్మకం ఉంచండి; మంచిని చేయండి; భూమిలో నడయాడే మీకు సర్వం సత్యంగా సమకూర్చబడతాయి.'**

# రచయిత గురించి

**జోసెఫ్ మర్ఫీ** ఐర్లాండ్, కార్క్ కౌంటీలోని ఒక చిన్న పట్టణంలో 1898 మే 20 న జన్మించాడు. ఆయన తండ్రి డెనిస్ మర్ఫీ, ఐర్లాండ్ నేషనల్ స్కూల్, జేస్యూయిట్ ఫెసిలిటీలో డీకాన్‌గానూ ప్రొఫెసర్‌గానూ పనిచేసేవారు. ఆయన తల్లి ఎల్లెన్, నీ కొన్నెల్లీ గృహిణి. జోసెఫ్‌కు తరవాత కొడుకు జాన్‌కూ, కేథరీన్ అనే కూతురికీ ఆమె జన్మనిచ్చింది.

జోసెఫ్ కఠినమైన సంప్రదాయాలు పాటించే కేథలిక్ గృహ వాతావరణంలో పెరిగాడు. ఆయన తండ్రి చాలా భక్తి కలిగినవారు. జేస్యూట్ సెమినేరియన్స్‌కు మత సంప్రదాయాలను బోధించే అధ్యాపకుడుగా ఉండేవారు. ఆయన విభిన్న విషయాల మీద విశాలమైన పరిజ్ఞానం కలిగి ఉండేవారు. ఆయన తన కుమారుడిలో బాగా చదివి అధ్యయనం చేసి నేర్చుకోవాలన్న కోరికను పెంపొందించారు.

ఆ కాలఘట్టంలో ఐర్లాండ్ ఆర్థిక మాంద్యంతో పీడింపబడడంతో చాలా కుటుంబాలు పస్తులతో అలమటిస్తుండేవి. డెనిస్ మర్ఫీ నిలకడగా ఉద్యోగం చేస్తున్నప్పటికీ అతని ఆదాయం కుటుంబం గడవడానికి బొటాబొటిగా సరిపోయేది.

## మీపై నమ్మకం ఉంచండి

యువ జోసెఫ్ నేషనల్ స్కూల్‌లో చేరి చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. పౌరోహిత్యానికి సంబంధించిన విద్యను అధ్యయనం చేయడానికి ప్రోత్సహించబడి, జేస్యూయిట్ సెమినేరియన్‌గా అంటే రోమన్ కేథలిక్ క్రైస్తవ సంఘ పాఠశాల విద్యార్థిగా చేరడానికి అంగీకరించబడ్డాడు. అయినప్పటికీ, ఆయన యుక్తవయస్కుడయ్యాక, జేస్యూయిట్స్ కేథలిక్ సంప్రదాయాలను ప్రశ్నించడం మొదలుపెట్టి, సెమినరీ నుంచి వెనక్కు వచ్చేశాడు. నూతన భావాలను అన్వేషిస్తూ కొత్త కొత్త అనుభవాలు పొందడం ఆయన లక్ష్యం కావడంతో, అది కేథలిక్ ఆధిపత్యంగల ఐర్లాండులో సాధ్యం కాదు గనక – తన కుటుంబాన్ని వదిలి అమెరికాకు పయనమయ్యాడు.

జేబులో ఐదు డాలర్లతో ఆయన ఎల్లిస్ ఐలండ్ ప్రవాస కేంద్రానికి చేరుకున్నాడు. ఉండడానికి చోటును కనుగొనడమే మొదటి పని అయింది. అదృష్టవశాత్తు అద్దె గదులున్న ఒక ఇంటిని కనుగొన్నాడు. స్థానిక మందుల దుకాణంలో పనిచేసే ఒక ఫార్మసిస్ట్‌తో కలిసి ఒక గదిలో అద్దెకు దిగాడు.

తమ ఇంట్లోనూ, స్కూల్‌లోనూ గేయ్‌లిక్ భాషను మాట్లాడడంవల్ల, ఇతర ఐరిష్‌వాసుల్లాగే జోసెఫ్ ఆంగ్ల భాషా పరిజ్ఞానం అంతంత మాత్రంగానే ఉండేది. అందువల్ల అక్కడి వారందరిలాగే తిండికీ, అద్దెకూ మాత్రమే సరిపోయేంత వచ్చే రోజువారీ కూలీగా పనిచేయడం ప్రారంభించాడు.

త్వరలోనే ఆయనా, ఆయనతోపాటు గదిలో ఉంటూన్న వ్యక్తీ మంచి మిత్రులయ్యారు. తన మిత్రుడు పనిచేసే మందుల దుకాణంలో ఒక ఉద్యోగం ఖాళీ కావడంతో, జోసెఫ్ ఆ ఉద్యోగంలో ఆ ఫార్మసిస్ట్‌కు అసిస్టెంటుగా చేరాడు. వెనువెంటనే ఫార్మసీ విద్యనభ్యసించడానికి స్కూల్‌లో నమోదు చేసుకున్నాడు. కుశాగ్ర బుద్ధీ, నేర్చుకోవాలనే తపనాగల జోసెఫ్‌కు, ఫార్మసిస్ట్ అర్హత కలిగించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి నిపుణుడైన పరిపూర్ణ ఫార్మసిస్ట్ కావడానికి అట్టేకాలం పట్టలేదు. సొంతంగా అపార్ట్‌మెంటు కొనడానికి సరిపడా సంపాదించాడు. మరి కొన్నేళ్ళలో ఒక మందుల

దుకాణాన్ని సొంతంగా కొని కొన్నేళ్ళపాటు విజయవంతంగా వ్యాపారం సాగించాడు.

అమెరికా రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రవేశించినప్పుడు జోసెఫ్ సైన్యంలో చేరాడు. 88వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌లోని వైద్య విభాగంలో ఫార్మసిస్ట్‌గా పనిచేయవలసి వచ్చింది. సైన్యం నుంచి విడుదల చేయబడ్డాక ఆయన ఫార్మసీ వృత్తి జీవితాన్ని కొనసాగించదలుచుకోలేదు. అమెరికాలోనూ, విదేశాలలోనూ పర్యటిస్తూ వివిధ విశ్వవిద్యాలయాలలో కొన్ని కోర్సులు చేశాడు.

ఆ క్రమంలో కొన్ని అధ్యయనాలలో జోసెఫ్ ఆసియా మతాలలోని కొన్ని విషయాలను చదివి పరవశం చెందాడు. వాటిని గురించి మరింత లోతుగా, కూలంకషంగా అధ్యయనం చేసి నేర్చుకోవడానికి ఇండియా వెళ్ళాడు. ప్రముఖ మతాలన్నిటి గురించీ, వాటి ఆవిర్భావాల కాలాలనుంచి అధ్యయనం చేశాడు. ప్రాచీనకాలం నుంచి నేటివరకు గల గొప్ప తత్వవేత్తల గురించి తెలుసుకోవడానికి తన అధ్యయనాలను విస్తృతం చేశాడు.

ఆయన దీర్ఘదర్శులూ, మేధావులూ అయిన పలువురు అధ్యాపకుల వద్ద అధ్యయనం చేసినప్పటికీ జోసెఫ్‌ను అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తి డాక్టర్ థామస్ ట్రోవార్డ్. ఆయన వృత్తిరీత్యా న్యాయమూర్తి. ప్రవృత్తి రీత్యా తత్వవేత్త, వైద్యుడు, అధ్యాపకుడు. న్యాయమూర్తి ట్రోవార్డ్, జోసెఫ్ గురువు అయ్యాడు. ఆయన నుంచి తత్వ, మత, ధర్మ, న్యాయశాస్త్రాలను నేర్చుకోవడం మాత్రమే కాకుండా మార్మిక వాదం పరిచయం చేయబడి ముఖ్యంగా అందులోని మాసోనిక్ ఆర్డర్ గురించి తెలుసుకున్నాడు. ఈ మార్మికవాదుల సంస్థలో క్రియాశీల సభ్యుడై కొన్నేళ్ళలో మాసోనిక్ శ్రేణుల్లో స్కాటిష్ రైట్‌లో 32వ డిగ్రీ స్థాయికి ఎదిగాడు.

ఆ తరవాత అమెరికాకు తిరిగి వచ్చాక, మతాచార్యుడిగా విశాల పరిజ్ఞానాన్ని ప్రజలకు అందించాలనుకున్నాడు. ఆయన క్రైస్తవ మత భావన

సంప్రదాయబద్ధమైనది కాదు. వాస్తవానికి పలు క్రైస్తవ ఉపశాఖలకు వ్యతిరేకంగానూ ఉండేది. అందువల్ల ఆయన లాస్ ఏంజెలిస్‌లో సొంత చర్చిని ప్రారంభించాడు. తొలిరోజుల్లో ఆయన నిర్వహించే ప్రార్థనా సమావేశాలకు తక్కువ మందిని మాత్రమే ఆకర్షించగలిగాడు. అయితే, 'పాపం–శాపాల' తో కూడుకున్న పలువురి మతాచార్యుల ధర్మోపదేశాలకు భిన్నంగా ఆశావాదం, నమ్మకం సమ్మిళితమైన ఆయన సందేశం అసంఖ్యాకులైన స్త్రీ పురుషులను ఆయన చర్చికేసి ఆకర్షించడానికి అట్టే కాలం పట్టలేదు.

నూతన భావ ఉద్యమాన్ని డా. జోసెఫ్ మర్ఫీ ప్రతిపాదించాడు. 19వ శతాబ్దాంతంలోనూ, 20వ శతాబ్దారంభంలోనూ కొందరు తత్వవేత్తలు, తీవ్ర ఆలోచనాపరులు జీవితాన్ని సరికొత్త మార్గంలో చూసే ఈ విధానాన్ని అధ్యయనం చేసి అభివృద్ధి చేసి బోధించారు, రాశారు, ఆచరించి చూపారు. మనం ఆలోచించే, జీవించే విధానానికి ఆధిభౌతిక, ఆధ్యాత్మిక విషయాలతో కార్యవాద ధోరణిని జతచేసి మనం నిజంగా కోరుకున్న దానిని పొందడానికి అవసరమయ్యే రహస్యాన్ని ఛేదించి కనుగొనగలిగారు.

ఈ నూతన భావ ఉద్యమాన్ని ప్రతిపాదించినవారు మరింత నిర్దుష్ట ఫలితాలను తీసుకువచ్చే నూతన విధానాలను వెలికితెచ్చే సరికొత్త జీవన భావాన్ని బోధించారు. మనం మన జీవితాలను సుసంపన్నం చేసుకోవడానికి ఆ భావాన్ని ఉపయోగించుకునే శక్తి మనకున్నదని చాటారు. గతంలో దేవుడు ప్రహేళికల్లా రాసినట్టు కనిపించే సూత్రాన్ని కనుగొని, అది పనిచేసే తీరును అర్థం చేసుకున్నప్పుడే ఈ పనులన్నిటినీ చేయగలుగుతాం అని చాటారు.

ఈ సానుకూల సందేశాన్ని డా. మర్ఫీ ఒక్కరు మాత్రమే బోధించలేదు. రెండవ ప్రపంచ యుద్ధానంతర దశాబ్దాలలో ఈ నూతనభావోద్యమంతో చాలా చర్చిలు ప్రభావితమయ్యాయి. పలువురు మత ప్రచారకులు, అనుచరులు కాంగ్రిగాంట్స్ ప్రభావితులయ్యారు. వీటిని పోలిన తాత్విక

సూత్రాలనే చర్చ్ ఆఫ్ రిలిజియస్ సైన్స్, యూనిటీ చర్చ్‌లాంటి ప్రార్థనా స్థలాలలో బోధించసాగారు. డా. మర్ఫీ తన సంస్థకు 'ది చర్చ్ ఆఫ్ డివైన్ సైన్స్' అని నామకరణం చేశారు. ఆయన తరచూ వేదికలపై ఇతరులతో కలిసి ప్రసంగించసాగారు. తనలాగే ఆలోచించే భావసారూప్యంగల సహచరులతో కలిసి సంయుక్తంగా కార్యక్రమాలను నిర్వహించేవారు. తన మత ప్రచారంలో చేరి పాలుపంచుకోవడానికి స్త్రీపురుషులకు శిక్షణ నివ్వసాగారు.

కొన్ని సంవత్సరాలలో ఇతర చర్చిలు ఆయనతో చేతులు కలిపి, డివైన్ సైన్స్ చర్చిలన్నిటికీ ఛత్రంలా పనిచేసే 'ఫెడరేషన్ ఆఫ్ డివైన్ సైన్స్' అనే సంస్థను స్థాపించాయి. డివైన్ సైన్స్ చర్చ్ నాయకులు ప్రతి ఒక్కరూ మరింత విద్యార్జన కొనసాగించడానికి ముందుకు వెళ్ళాలనుకున్నారు. కొత్త మత ప్రచారకులకు శిక్షణనివ్వడానికీ, నడుస్తూన్న విద్యాబోధనలో, విద్య, మత ప్రచారకులకూ, కొత్తగా చేరేవారికీ శిక్షణనివ్వడానికి వీలుగా మిసోరీ సెయింట్‌లూయిస్‌లో డివైన్ లైఫ్ స్కూల్‌ను స్థాపించడానికి మద్దతునిచ్చిన నాయకులలో డాక్టర్ మర్ఫీ ఒకరు.

డివైన్ సైన్స్ మత ప్రచారకులు అందరూ వార్షిక సమావేశాలకు తప్పకుండా హాజరయ్యేవారు. డాక్టర్ మర్ఫీ ప్రధాన వక్తగా వ్యవహరించేవారు. ఆ సమావేశాలలో పాల్గొనేవారిని మరింత లోతుగా అధ్యయనం చేయడానికీ, నేర్చుకోవడాన్ని కొనసాగించడానికీ – ప్రత్యేకంగా సుప్తచేతనాత్మక మనసు ప్రాముఖ్యతను గురించి తెలుసుకోవడానికీ ఆయన ప్రోత్సహించేవారు.

మరి కొన్నేళ్ళలో డాక్టర్ మర్ఫీ స్థానిక 'చర్చ్ ఆఫ్ డివైన్ సైన్స్' అత్యంత అభివృద్ధి సాధించింది. సమావేశాలకు హాజరయ్యేవారికి భవనంలో చోటు చాలేది కాదు. అందువల్ల పాత సినిమా హాల్ 'విల్‌షైర్ ఎబెల్ థియేటర్'ను అద్దెకు తీసుకోవలసి వచ్చింది. అయినప్పటికీ, ప్రార్థనా సమావేశాలకు హాజరయ్యే ప్రజలు రోజు రోజుకూ పెరగడంతో అక్కడ కూడా స్థలం చాలని

పరిస్థితి ఏర్పడింది. ఆదివారం ప్రార్థనలకు 1300 నుంచి 1500 మంది హాజరయ్యేవారు. వాటితోపాటు డాక్టర్ మర్ఫీ, ఆయన సిబ్బందీ తరగతులు నిర్వహించేవారు. ఇంకా రోజూ, పగటి సమయంలో, సాయంకాలాలలో సదస్సులు, ప్రసంగాలు నిర్వహించేవారు. 1976 వరకు లాస్ ఏంజెలెస్ విల్‌షైర్ ఎబెల్‌లో ఉన్న చర్చి, ఆ తరవాత కాలిఫోర్నియా రిటైర్‌మెంట్ కమ్యూనిటీ సమీపంలోని ల్యాగునా హిల్స్‌కు మార్చబడింది.

తన సందేశాన్ని వినడానికి ఆసక్తి కనబరుస్తూన్న మరింత మందికి చేరువ కావడానికి డాక్టర్ మర్ఫీ వారంవారం రేడియో ప్రసంగాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. దానిని దాదాపు పదిలక్షలకుపైగా వినేవారు.

ఆయన ప్రార్థనా ప్రసంగాలను, రేడియో కార్యక్రమాలను రికార్డు చేసి టేపులుగా తీసుకువస్తే బావుంటుందని ఆయన అనుచరులు పలువురు సూచించారు. అందుకు ఆయన మొదట కాస్త సంకోచించినప్పటికీ ఆ తరవాత ప్రయోగం చేయడానికి సమ్మతించారు. ఆయన రేడియో ప్రసంగాలు ఎక్స్‌ట్రా లార్జ్ 78 ఆర్‌పియం డిస్క్‌ల మీద రికార్డు చేయబడ్డాయి. ఆ కాలఘట్టంలో అలా చేయడమే ప్రాచుర్యంలో ఉండేది. అలాంటి ఒక డిస్క్ నుంచి ఆరు కేసెట్లు తయారుచేసి విల్‌షైర్ ఎబెల్ థియేటర్ ప్రాంగణం సమాచారం మేజాల వద్ద ఉంచారు. ఒక గంటలో అన్నీ అమ్ముడైపోయాయి. ఇది సరికొత్త ప్రయోగానికి నాంది పలికింది. ఈ టేపుల్లో బైబిల్ పాఠాల వివరణలు, ధ్యాన మార్గాలు, ప్రార్థనా విధానాలు శ్రోతలకు విపులీకరించ బడ్డాయి. ఈ టేపులు ఆయన చర్చి వద్ద మాత్రమే కాకుండా ఇతర చర్చిల వద్దా, పుస్తకాల షాపుల్లో అమ్మడంతోపాటు తపాలా ద్వారానూ విక్రయించే వారు.

చర్చి కార్యకలాపాలు పెరిగేకొద్దీ – డాక్టర్ మర్ఫీకి పరిశోధనలలోనూ, తొలి పుస్తకాల రచనలలోనూ, వృత్తిపరంగానూ, నిర్వహణా వ్యవహారాల లోనూ సాయపడడానికి కొంతమంది సహాయకులను ఏర్పాటు చేసుకోవలసి

వచ్చింది. అలా ఆయన ఏర్పాటు చేసుకున్న సిబ్బందిలో చాలా చురుకైన వ్యక్తి అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ డాక్టర్ జీన్‌రైట్. కొన్నేళ్ళు కలిసి పనిచేయడంతో క్రమంగా వారిద్దరి మధ్య ప్రేమ పల్లవించి పెళ్లి చేసుకున్నారు. ఆ జీవితాంత సంబంధం ఇరువురి జీవితాలనూ మరింత సుసంపన్నం చేసింది.

ఆ కాలఘట్టంలో (1950లలో) ఆధ్యాత్మిక సాహిత్యాన్ని ప్రచురించే పెద్ద ప్రచురణా సంస్థలు మరీ తక్కువగా ఉండేవి. మర్ఫీ దంపతులు లాస్ ఏంజెలిస్‌లో కొందరు చిన్న ప్రచురణకర్తలను కనుగొని సంప్రదించారు. వారి ద్వారా చిన్న చిన్న పుస్తకాలను (30–50 పుటలతో కరపత్రాల్లాగా) ప్రచురించారు. ఒక పుస్తకం 1.50; 3.00 డాలర్లకు చాలావరకు చర్చిల వద్దనే అమ్మకాలు జరిగేవి. క్రమంగా ఈ పుస్తకాలకు ఆదరణ పెరిగి రెండవ, మూడవ ప్రచురణలు వచ్చేసరికి, పెద్ద ప్రచురణ సంస్థలు కూడా అలాంటి పుస్తకాలకు గిరాకీ ఉందని గ్రహించి తమ క్యాటలాగ్‌లలో వాటిని అదనంగా చేర్చాయి.

తన పుస్తకాలు, టేపులు, రేడియో ప్రసంగాల ద్వారా డాక్టర్ మర్ఫీ లాస్ ఏంజెలిస్‌కి వెలుపలి ప్రాంతాలలోనూ ప్రసిద్ధులయ్యారు. ఉపన్యాసాలు ఇవ్వడానికి దేశవ్యాప్తంగా చాలామంది ఆహ్వానించసాగారు. ఆయన తన ఉపన్యాసాలను మతపరమైన విషయాల వరకే పరిమితం చేసుకునేవారు కారు. జీవిత చారిత్రక విలువలు, పరిపూర్ణ జీవితం సాగించేకళ, తూర్పు-పడమర సంస్కృతులకు చెందిన తత్వవేత్తల బోధల గురించీ ప్రసంగించే వారు.

డాక్టర్ మర్ఫీ డ్రైవింగ్ నేర్చుకోలేదు. ఆహ్వానాల పేరిట విభిన్న ప్రాంతాలకు ప్రసంగించడానికి వెళ్ళడానికి డ్రైవర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర పనులలో – మొదట ఆయన అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగానూ, ఆ తరవాత ఆయన భార్యగానూ డాక్టర్ జీన్ సాయపడేది. ఇతర అసైన్‌మెంట్లు, రైలు ప్రయాణాలు, హోటల్ బసలు మొదలైన వ్యవహారాలన్నిటినీ ఆమె చూసుకునేది.

మర్ఫీ దంపతులు తరచూ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో పర్యటించేవారు. పర్యాటక ఓడలలో సదస్సులు నిర్వహించడం వారికి అభిమాన విషయంగా ఉండేది. ఈ ప్రయాణాలు ఒక వారమూ, అంతకన్నా ఎక్కువగానూ ఉండేవి. వాటి ద్వారా వాళ్ళు పలుదేశాలు పర్యటించగలిగారు.

డాక్టర్ మర్ఫీ అమెరికా, యూరపు, ఆసియా ఖండాలలో అనేక దేశాలు పర్యటించారు. ఆయన తన ప్రసంగాలలో మన సుప్తచేతనాత్మక మనసు శక్తిని అర్థం చేసుకోవలసిన ప్రాముఖ్యతను గురించి నొక్కి వక్కాణించేవారు. ఒకే దేవుడు, 'ఐయామ్' 'నేను ఉన్నాను' విశ్వాసం ఆధారంగా జీవన సూత్రాలను విపులీకరించేవారు.

కరపత్రాల పరిమాణంలోని ఆయన పుస్తకాలు బాగా ప్రాచుర్యం పొందడంతో, వాటిలోని విషయాలను మరింత విస్తృతంగా వివరిస్తూ మరిన్ని పెద్ద పుస్తకాలు రాయడం ప్రారంభించారు. ఆయన రచనా విధానం గురించీ, రాసే పద్ధతుల గురించీ ఆయన సతీమణి కొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలియజేశారు: ఆయన రాస్తున్న కాగితానికి కింది కాగితంలో అక్షరాల ముద్ర స్పష్టంగా కనిపించేంతగా పెన్నుతోనో, పెన్సిల్‌తోనో మరీ ఒత్తి రాసేవారట. రాస్తున్నప్పుడు సమాధి లాంటి ఒక విధమైన అతీత స్థితిలో కనిపించేవారట. కార్యాలయంలో కూర్చుని నాలుగు నుంచి ఆరు గంటల వరకు ఏమాత్రం ఎడతెరపి, అంతరాయం లేకుండా రాసేవారట. ఈ రోజుకు ఇది చాలు అనుకున్నాక ఆపేసి బయటకు వచ్చేవారట. మరుసటి ఉదయం వరకు ఆరంభించిన దాన్ని పూర్తి చేయడానికి అటుకేసి తిరిగి చూసేవారు కారట. అక్కడ పనిచేస్తున్నప్పుడు ఆహార పానీయాలను తీసుకునే వారు కారు. ఆలోచనలతో ఏకాంతంగా పెద్ద గ్రంథాలయం పుస్తకాల మధ్య ఉండేవారు. అప్పుడప్పుడు పుస్తకాలు రెఫర్ చేస్తూ ఉండేవారు. సందర్శకుల నుంచీ, ఫోన్ కాల్స్ నుంచీ ఇబ్బంది కలగకుండా ఆయన భార్య జాగ్రత్త వహించేది. ఆ సమయాల్లో చర్చి వ్యవహారాలనూ, ఇతర కార్య కలాపాలనూ ఆమె చూసుకునేది.

## డాక్టర్ జోసెఫ్ మర్ఫీ

డాక్టర్ మర్ఫీ జీవిత సమస్యలను చర్చించి, వాటిలోని అంశాలను విపులీకరించి, అవి వ్యక్తిని ఎలా ప్రభావితం చేస్తాయి అన్న విషయాలను వివరంగా విశదపరచడానికి ఎల్లప్పుడూ సరళమైన మార్గం కోసమే చూసేవారు.

సాంకేతికత అభివృద్ధి చెంది శ్రవణ రంగంలో చోటుచేసుకుంటూన్న కొత్త పద్ధతులను అందిపుచ్చుకుని ఆయన కొన్ని ప్రసంగాలను కేసెట్లుగానూ, రికార్డులుగానూ, సిడిల రూపంలోనూ అందించడానికి ఎంపిక చేశారు.

ఆయన అందించిన సిడిలు, కేసెట్లు – మనుషులు జీవితంలో ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించుకోవడానికీ, అనుకున్న లక్ష్యాలను సాధించ డానికీ ఉపయోగపడే చక్కటి ఉపకరణాలుగా నిరూపించబడ్డాయి. ఒక వ్యక్తి సమస్యలకు పరిష్కారం అతని లోపలే ఉందన్నది ఆయన బోధించే ఆధార సూత్రం. ఒకరి ఆలోచనలను వెలుపలి అంశాలు మార్చజాలవు. అంటే, మీ మనసు మీకే సొంతం. మెరుగైన జీవితం జీవించడానికి మీరు మార్చుకోవలసినది మీ మనసునే తప్ప బాహ్య పరిస్థితులను కాదు. మీ విధిని మీరే సృష్టించుకుంటారు. మార్చే శక్తి మీ మనసు లోపలే ఉంది. మీ సుప్తచేతనాత్మక మనసు శక్తిని ఉపయోగించుకుని, మెరుగైన జీవితానికి కావలసిన మార్పులు చేసుకోవచ్చు.

డాక్టర్ మర్ఫీ ముప్ఫై పుస్తకాలకు పైగా రచించారు. ఆయన రచనలలో 'ది పవర్ ఆఫ్ ది సబ్‌కాన్షియస్ మైండ్' (మీ సుప్తచేతనాత్మక మనసుకు ఉన్న శక్తి) అత్యంత ప్రసిద్ధి పొందిన పుస్తకం. అది 1963 లో మొదట ప్రచురించబడి అత్యంత పాఠకాదరణ పొందిన 'బెస్ట్ సెల్లర్' అయింది. అది 'సెల్ఫ్–హెల్ప్' గైడ్స్‌లో అత్యుత్తమ రచనగా పేరు తెచ్చుకుంది. లక్షలాది ప్రతులు అమ్ముడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంకా అమ్ముడవుతూనే ఉంది.

బాగా అమ్ముడవుతూన్న ఆయన ఇతర రచనలలో ముఖ్యమైనవి : *టెలీ సైకిక్స్ – ది మ్యాజిక్ పవర్ ఆఫ్ పెర్ఫెక్ట్ లివింగ్, ది అమేజింగ్ లాస్*

ఆఫ్ కాస్మిక్ మైండ్, సీక్రెట్స్ ఆఫ్ ది ఐ–చింగ్, ది మిరాకిల్ ఆఫ్ మైండ్ డైనమిక్స్, యువర్ ఇన్ఫినిట్ పవర్ టు బి రిచ్, ది కాస్మిక్ పవర్ వితిన్ యు.

డాక్టర్ మర్ఫీ 1981 డిసెంబర్‌లో కీర్తిశేషులయ్యారు. ఆయన మరణానంతరం ఆయన సతీమణి డాక్టర్ జీన్ మర్ఫీ తన భర్త ప్రచారం పనులను కొనసాగించారు. 1986వ సంవత్సరంలో ఆమె ఒక ప్రసంగంలో కీర్తిశేషులైన తన భర్త తాత్వికతను ఆయన మాటలనే ఉటంకిస్తూ ఇలా పునరుద్ఘాటించారు:

> "నేను తమ దివ్య ఆవిర్భావాన్నీ, తమలో నిక్షిప్తమై ఉన్న శక్తుల గురించీ స్త్రీ పురుషులకు బోధించాలనుకుంటున్నాను. ఈ శక్తి వారి లోపలే ఉందనీ, వారే వాళ్ళ రక్షకులనీ, తమ విముక్తిని సాధించగల సమర్థులనీ తెలియజేయాలనుకుంటాను. ఇదే బైబిల్ సందేశం. ఇవాళ మనకున్న పదింట తొమ్మిదిపాళ్ళ గందరగోళం – అందులో ఇవ్వబడిన జీవపరివర్తన సత్యాలను తప్పుగా పైపైన కనిపించే అక్షరాలను మాత్రమే పట్టుకుని వ్యాఖ్యానించడంవల్ల వాటిల్లినదే.
>
> నేను సగటు సామాన్య పురుషుడి వద్దకూ, బాధ్యతలతో సతమత మవుతూ తన శక్తిసామర్థ్యాలను అణగదొక్కేసుకుంటూన్న స్త్రీ వద్దకూ, అంటే – అధికసంఖ్యాకులను చేరాలనుకుంటున్నాను. ప్రతిస్థాయిలోనూ, ప్రతి స్పృహ స్థితిలోనూ ఉన్న ఒక్కొక్కరికీ తమలో ఉన్న అద్భుతాలను నేర్చుకోవటానికి సాయం చేయా లనుకుంటాను."

ఆమె తన భర్తను గురించి ఇంకా ఇలా చెప్పారు: 'పండితుడి మేధాసంపత్తి, విజయవంతమైన కార్యనిర్వాహకుడి మనసు, కవిహృదయం ఆవహించిన ఆచరణశీల మార్మికజ్ఞాని ఆయన'. 'నువ్వే రాజువూ, నీ ప్రపంచానికి పాలకుడివీ; ఎందుకంటే – నువ్వు దేవుడితో ఒకటిగా ఉన్నావు.' ఇదే ఆయన అందించిన సందేశసారం.